

‘నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 13 | సంచిక: 6

SUNDAY Special

ఆదివారం 29-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**ఇలాంటి ‘విశ్రాంతి’ కావాల్సిందే**

విరామం లేకుండా ఆడి భారత క్రికెటర్లు అలసిపోయారన్న హెడ్ కోచ్ రవిశాస్త్రి –స్పోర్ట్స్‌లో





**చైనా అలా.. ప్రపంచం ఇలా..**

- ఫొటో ఫీచర్ 12లో


# 6,10,000

## ప్రపంచ వ్యాప్తంగా గణనీయంగా పెరుగుతున్న కరోనా బాధితుల సంఖ్య

### కేసుల్లో అమెరికా, మృతుల్లో ఇటలీ టాప్

కరోనా.. ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. అమెరికా, ఇటలీ, స్పెయిన్, బ్రిటన్ తదితర దేశాలు ఆ పేరు చెబితేనే వణికిపోతున్నాయి. వైరస్ బాధితులు అంతకంతకు పెరిగిపోవడం, వందల సంఖ్యలో మృతులు నమోదవుతుండటం తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. యూరప్‌లోని చాలా దేశాల్లో లాక్‌డౌన్ ప్రకటించడంతో ఆర్థిక మాంద్యం కోరల్లో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు ఉమ్మడిగా ముందుకు సాగాలని నిర్ణయించాయి. ఇక, అగ్రరాజ్యం అమెరికాలో కరోనా బాధిత రాష్ట్రాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చరిత్రాత్మక బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. మరోవైపు చైనాలోని సెంట్రల్ హుబాయ్‌లో లాకౌట్ ఎత్తేయడంతో భారీ సంఖ్యలో జనం పొరుగునే ఉన్న జియాంగ్‌కు బయల్దేరి వెళ్లారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో ప్రజలు పోలీసు వాహనంపై రాళ్లు రువ్వారు. దీనికి సంబంధించిన వీడియోలు చైనా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

- 7లో



**30,000** ప్రపంచ వ్యాప్తంగా కరోనా మృతుల సంఖ్య..

**183** కరోనా బాధిత దేశాలు

**832** గత 24 గంటల్లో స్పెయిన్‌లో మృతులు..

**1,00,000** అమెరికాలో మొత్తం కేసులు

**10,000** ఇటలీలో మొత్తం మృతులు

**5,690** స్పెయిన్‌లో మొత్తం మృతుల సంఖ్య..



## ‘టాటా’ విరాళం 1,500కోట్లు..

- కరోనాపై యుద్ధానికి టాటా గ్రూప్ శనివారం భారీ విరాళం ప్రకటించింది. రూ.500 కోట్లు ఇవ్వనున్నట్లు తొలుత టాటా ట్రస్టు వెల్లడించింది. అనంతరం రూ.1,000 కోట్ల విరాళాన్ని ‘టాటా సన్స్’ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ప్రకటించారు. దీంతో టాటా గ్రూప్ మొత్తం రూ.1,500 కోట్ల విరాళం ప్రకటించినట్లయ్యింది.

- వివరాలు 7లో

## పరిశుభ్రతే.. శ్రీరామ రక్ష!

సాక్షి, హైదరాబాద్

కరోనా వైరస్ మన శరీరంలోకి ప్రవేశించకుండా ఉండాలంటే కనీసం ప్రతి 20 నిమిషాలకోసారి చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్న సూచనను పెడచెవిన పెడుతున్న వారు కచ్చితంగా ఈ విషయం తెలుసుకోవాల్సిందే... కడిగి కడిగి చేతులు అరిగిపోతాయ్ జాగ్రత్త అని జోకులేసేవారికి అయితే ఇది చాలా ముఖ్యం కూడా. మనకు తెలియకుండానే మన చేతులు మన ముఖాన్ని, ముఖ భాగాలను టచ్ చేస్తాయని సర్వేలు చెబుతున్నాయి. ఈ సర్వేల్లో వెల్లడయిన విషయాల ప్రకారం ఒక గంటకు మనం మన ముఖాన్ని ఎన్నిసార్లు తాకుతామో తెలిస్తే అవాక్కవక తప్పదు!. ప్రతి గంటకు ఎన్నిసార్లు మనం మన ముఖాన్ని, ముఖ భాగాలను తాకుతామో తెలుసా... సగటున 23 సార్లు. ఏంటీ ఆశ్చర్యపోతున్నారా?.. ఆస్ట్రేలియాలోని ఓ విశ్వవిద్యాలయం తన మెడికల్ విద్యార్థులపై నిర్వహించిన సర్వే ఫలితం నిజమో కాదో తెలుసుకోవాలంటే మిమ్మల్ని మీరే పరీక్షించుకోండి. లేదంటే ఇతరులను నిశితంగా గమనించండి... అప్పుడయినా చేతులు శుభ్రంగా కడుక్కోండి... కరోనా మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి.

- ముక్కును మూడుసార్లు, నుదురును నాలుగుసార్లు
- గంటకు సగటున మనం వాటిని తాకే లెక్క ఇది
- 2015లో మెడికల్ విద్యార్థులపై సర్వేలో వెల్లడి
- 20 నిమిషాలకోసారి చేతులు కడుక్కుంటేనే మేలు
- కరోనా కట్టడికి కచ్చితంగా పరిశుభ్రత పాటించాల్సిందే



**దాదాపు అన్ని భాగాలు...**

ప్రతి వ్యక్తి తన ముఖాన్ని గంటకు ఎన్నిసార్లు తాకుతారన్నదానిపై ఆస్ట్రేలియాలోని ఓ విశ్వవిద్యాలయం 2015లో ఓ సర్వే నిర్వహించింది. వర్సిటీలో చదువుతున్న 26 మంది మెడికల్ విద్యార్థులను పరిశీలించింది. అప్పుడు వీరంతా కనీసం సగటున 23 సార్లు ముఖాన్ని, ముఖ భాగాలను తాకారని

మిగతా 2వ పేజీలో ▶

## ఖాళీ ప్రదేశాలకు రైతు బజార్లు..

- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడా మైదానాలు, బస్టాండ్లు, కళాశాల ప్రాంగణాల్లో కూరగాయల అమ్మకాలు
- గ్యాస్ బుకింగ్‌లపై 14 రోజుల ఆంక్షలు

- 2లో









**ఇదం జగత్**



ఇక నుంచి మందు కావాలని బెదిరించిన వాళ్లను కూడా క్వారంటైన్‌లో వేయండి!

# తొలి కరోనా మరణం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో తొలి కరోనా మరణం నమోదైంది. దీంతో ఒక్కసారిగా రాష్ట్రంలో ఆందోళనకర వాతావరణం ఏర్పడింది. ఇప్పటి వరకు కరోనా మరణాలు నమోదుకాకపోవడంతో ప్రజల్లో వైరస్‌పై భయమున్నా, మరణాలు ఉండవన్న ధీమాతో ఉన్నారు. తాజాగా కరోనా మరణం నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ వర్గాల్లో ఆందోళన నెలకొంది. మృతి చెందిన వ్యక్తి (74)కి సంబంధించి వివరాలను వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇటీవల ఆయన ఢిల్లీలో ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లి ఈనెల 17న హైదరాబాద్‌కు వచ్చాడు. రెండ్రోజుల తర్వాత జలుబు, జ్వరం రావడంతో స్థానిక ఆస్పత్రిలో మందులు కొని వేసుకున్నాడు. ఈనెల 26 రాత్రి 10 గంటల సమయంలో తీవ్రమైన జ్వరంతో ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు లక్డీకాపూల్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. అనుమానం వచ్చిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈనెల 27న మృతదేహం నుంచి నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా కరోనా పాజిటివ్ వచ్చింది. చికిత్స సమయంలో ఆయన తీవ్ర న్యుమోనియా లక్షణాలతో బాధపడుతున్నాడని తెలిసింది.

**నాలుగు కుటుంబాలకు కరోనా..:** శనివారం రాష్ట్రంలో 8 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో కేసుల సంఖ్య 67కు చేరింది. శుక్రవారం ఒక్కరోజే 14 కేసులు నమోదు కాగా, ఈ రెండు రోజుల్లోనే 22 కేసులు నమోదు కావడం గమనార్హం. తాజాగా ఒక్క హైదరాబాద్‌లోనే నాలుగు కుటుంబాలకు కరోనా వైరస్ సోకింది. ఢిల్లీ వెళ్లి వచ్చిన పాతబస్తీకి చెందిన ఓ వ్యక్తి కుటుంబంలో ఏకంగా ఆరుగురికి కరోనా సోకింది. ఢిల్లీ వెళ్లి వచ్చిన నాంపల్లికి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి కూడా కరోనా సోకింది. కుత్బుల్లాపూర్‌లోని ఒకే కుటుంబంలో నలుగురికి పాజిటివ్ అని తేలింది. దోమలగూడకు చెందిన ఓ వైద్యుడి కుటుంబంలో ఆయన తల్లికి కూడా కరోనా సోకింది. ఇప్పటికే మణికొండలో కొడుకు నుంచి తల్లికి, కోకాపేటలో ఓ వ్యక్తి నుంచి అతడి భార్యకు, సికింద్రాబాద్‌లో భార్యాభర్తల నుంచి కుమారుడికి, కొత్తగూడెంలో కొడుకు నుంచి తండ్రికి, వారి పనిమనిషికి కూడా కరోనా సోకింది. దీంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8 కుటుంబాలకు కరోనా సోకింది. కుటుంబ సభ్యుల మధ్యే ఎక్కువగా కరోనా వైరస్ వ్యాపిస్తోంది. కాగా, శనివారం నమోదైన కేసుల్లో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్న నలుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతోవారి కుటుంబ సభ్యులను కూడా ఐసోలేషన్‌లో ఉంచారు. కాగా, ఈ నెల లండన్ నుంచి వచ్చిన వ్యక్తికి 22న కరోనా పాజిటివ్ అని తేలిన విషయం తెలిసిందే. అతడు మియాపూర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో రెండు రోజుల పాటు బస చేసినట్లు

మిగతా 2వ పేజీలో ▶

- ఒక్కరోజే 8 పాజిటివ్ కేసులు నమోదు
- రాష్ట్రంలో 67కు చేరిన కరోనా కేసులు
- చికిత్స పొందుతున్న వారిలో 10 మందికి నయం
- ఒకరి పరిస్థితి విషమం: మంత్రి ఈటల



## రైల్వే బోగీలే ఐసోలేషన్ వార్డులు

**నమూనా వార్డును రూపొందించిన రైల్వే శాఖ**

- దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతూ ఉండటంతో రైల్వే శాఖ వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. లాక్‌డౌన్‌తో ఆగిన రైల్ బోగీలను ఐసోలేషన్ వార్డులుగా మార్చాలని నిర్ణయించింది. ఓ నమూనా బోగిని తయారు చేసింది. కేంద్రం ఆమోద ముద్ర వేస్తే వారానికి 10 బోగీలు తయారు చేయనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

- 7లో



నమూనా బోగీ..

**918** భారత్‌లో కరోనా పాజిటివ్ కేసులు..

**179** శనివారం ఒక్క రోజే నమోదైన కేసులు..

**19** దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య..

**ఏపీలో మరో 6 పాజిటివ్..** 2లో

## బియ్యంతో పాటే కందిపప్పు..

- కేంద్రం ఇచ్చే కిలో కందిపప్పు రేషన్ దుకాణాల ద్వారా సరఫరా
- ఏప్రిల్ ఒకటి నుంచి పంపిణీ!

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు రేషన్ బియ్యంతో పాటే కందిపప్పును సైతం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆహార భద్రతా చట్టం పరిధిలోకి వచ్చే వారికి కిలో కందిపప్పును కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, దీనిపై అధికారిక అనుమతి వచ్చిన వెంటనే పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బియ్యం, కంది పప్పు సరఫరా చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే 2.80 కోట్ల మందికి 3.36 లక్షల టన్నుల బియ్యాన్ని ఒక్కొక్కరికి 12 కిలోల చొప్పున సరఫరా చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పంపిణీని రెండ్రోజుల కిందట ఆరంభించినప్పటికీ కేంద్రం 5 కిలోల మేర



మిగతా 2వ పేజీలో ▶

## పన్ను పెంపు లేనట్టేనా?

- ‘కరోనా’ముగిసే వరకు ఆస్తి పన్ను పెంపు ప్రతిపాదన పక్కకు
- జూలైలో నిర్ణయం తీసుకునే చాన్స్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఆస్తి పన్ను పెంచాలనే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం పక్కకు పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పన్నుల పెంపునకు సంబంధించిన అన్ని కసరత్తులను పక్కన పెట్టేయాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ యంత్రాంగానికి సూచించినట్టు సమాచారం. కరోనా వైరస్ వ్యాప్తి నిరోధమే ప్రస్తుతం ప్రభుత్వం ముందున్న లక్ష్యమనే కోణంలోనే ముందుకెళ్లాలని, మిగిలిన అన్ని అంశాలను పక్కనపెట్టాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారనే చర్చ రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు, ఆర్థిక శాఖ వర్గాల్లో




మిగతా 2వ పేజీలో ▶



పెద్దగోల్కొండ శివారులో ఔటర్‌పై ఢీకొన్న లారీ, ట్రక్కు మధ్యలో ఇరుక్కున్న ఓ వలసకూలీ..

# మృత్యు ‘వల’స..

శంషాబాద్ రూరల్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దగోల్కొండ శివారులో ఔటర్ రింగ్‌రోడ్డుపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్, యాద్గిర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు కుటుంబాలు తమ పిల్లలతో కలిసి సూర్యాపేటలో రహదారి పనులు చేయడానికి గత నెలలో వలస వచ్చాయి. లాక్‌డౌన్ కారణంగా అక్కడ పనులు నిలిచిపోవడంతో స్వస్థలాలకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. దీంతో వారిని ఇక్కడ పనికి కుదిర్చిన మేస్త్రీ.. కర్ణాటకకు చెందిన బొలేరో ట్రక్కును రప్పించాడు. శుక్రవారం రాత్రి 7 గంటలకు వీరంతా ట్రక్కులో బయల్దేరారు. పెద్దఅంబర్‌పేట జంక్షన్ నుంచి ఔటర్ మీదుగా వీరి వాహనం పెద్దగోల్కొండ శివారుకు అర్ధరాత్రి చేరుకుంది. ట్రక్కులో పది మంది చిన్నారులతో కలిపి 28 మంది ఉన్నారు. లోడ్ ఎక్కువగా ఉండడంతో పాటు వెనక టైర్‌లో గాలి తగ్గిపోవడంతో వాహనం వేగం ఒక్కసారిగా తగ్గింది. అదే సమయంలో నూజివీడు నుంచి మామిడి కాయల లోడుతో వస్తున్న లారీ వేగంగా వీరి ట్రక్కును ఢీకొట్టింది. దీంతో ట్రక్కు వెనక భాగంలో కూర్చున్న వారు రెండు వాహనాల మధ్య ఇరుక్కున్నారు. కొందరు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఐదుగురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నలుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ ఇద్దరు మృతి చెందారు.

- శంషాబాద్ పెద్ద గోల్కొండ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఏడుగురు వలస కూలీల మృతి.. మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- సూర్యాపేట నుంచి కర్ణాటకకు వెళ్తుండగా అర్ధరాత్రి వేళ దుర్ఘటన

**మృతులు వీరే..:** హుబ్లీ నివాసి బి.శెట్టి (45), రాయదుర్గం వాసులు రంగప్ప (32), శరణప్ప (30), శ్రీదేవి అలియాస్ సిరియమ్మ (8), కక్కెరకు చెందిన బసమ్మ(32), హనుమంతప్ప (2), అమ్రిశ్ (25). ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనంలో స్వస్థలాలకు తరలించారు. కాగా, ప్రమాద బాధిత కుటుంబాలను పోలీసులు శంషాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో

మిగతా 3వ పేజీలో ▶





## అచ్చా కరోనా

రణగొణ ధ్వనుల్లేవు. చెవులు చిల్లులు పెట్టే హారన్ల మోతలూ లేవు. ఉరుకులు పరుగుల జీవితాలకు తాత్కాలికంగానైనా విరామం. ఉన్నదల్లా నిర్మానుష్యమైన రహదారులు.. బోసిపోతున్న కూడళ్లు! అంతా కరోనా వైరస్ మహత్యం. వ్యాపారాలు దెబ్బతిన్నాయి. చాలామంది ఉద్యోగాలకు ఎసరూ వచ్చేసింది. అన్నివైపులా నిశ్శబ్దం.. ఈ విషమ స్థితిలోనూ ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయి. మనిషి ఎప్పుడైతే ఇంటికి పరిమితమయ్యాడో.. ఫ్యాక్టరీ గొట్టాల నుంచి విషవాయువులు ఆకాశంలోకి చేరడం నిలిచిపోయిందో, ఆ క్షణం నుంచి ప్రకృతి తన పని తాను మొదలుపెట్టేసింది. ఇప్పటివరకు మనిషి చేసిన గాయాలకు తనదైన లేపనాలు పూయడం మొదలుపెట్టింది. అంతేకాదు.. మనిషిని కూడా మార్చేసింది. నమ్మశక్యం కావడం లేదా?. చదవండి మరి..

## పొల్యూషన్... దొరికింది సొల్యూషన్

ప్రపంచంలోనే అత్యంత కలుషితమైన పది నగరాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన మన దేశ రాజధాని ఢిల్లీలో కరోనా పుణ్యమా అని వాయు కాలుష్యం గణనీయంగా తగ్గింది. శనివారం నాటికి సుమారు 40 కరోనా కేసులు నమోదవడం, ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్, పలువురు స్వీయ నిర్బంధంలో ఉండటం ఇందుకు కారణం. భారత వాతావరణ విభాగం అంచనాలను బట్టి ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29 డిగ్రీలకే పరిమితమయ్యాయి. వాహనాలు తక్కువగా తిరుగుతుండటం, ఫ్యాక్టరీలను తాత్కాలికంగా బంద్ చేయడంతో వాయు కాలుష్యం కూడా బాగా తగ్గింది. సాధారణ పరిస్థితుల్లో ఢిల్లీలో వాయు నాణ్యతను సూచించే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ వెయ్యి వరకు ఉండేది. కానీ కరోనా కట్టడి మొదలైన తరువాత ఇది ఏకంగా 129కి పడిపోవడం గమనార్హం. కరోనా వైరస్ పుట్టినిల్లుగా భావించే వూహాన్‌లోనూ ఇదే పరిస్థితి. జనవరి 23 నుంచి వూహాన్‌తోపాటు హుబే ప్రావిన్స్ ప్రాంతం మొత్తమ్మీద లాక్‌డౌన్ విధించగా ఒకట్రెండు రోజుల క్రితమే దశలవారీగా ఎత్తివేసే ప్రక్రియ మొదలైంది. ఈ కాలం నాటి ఉపగ్రహ ఛాయాచిత్రాలను చూస్తే వూహాన్ (పక్క చిత్రం) ప్రాంతంలో గ్రీన్‌హౌస్ వాయువైన




నైట్రస్ ఆక్సైడ్ గణనీయంగా తగ్గినట్లు స్పష్టంగా తెలుస్తోంది. కచ్చితంగా చెప్పాలంటే నైట్రోజన్ ఆధారిత కాలుష్యం 40 శాతం వరకు తగ్గిందని, చైనా మొత్తమ్మీద పార్టిక్యులేట్ మ్యాటర్ కాలుష్యం 20 – 30 శాతం వరకు తగ్గిందని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ చెబుతోంది.

## ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్

### ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ సోమేశ్‌కుమార్



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ఏప్రిల్ 14 వరకు దేశంలో లాక్‌డౌన్ ప్రకటిస్తూ కేంద్ర విపత్తుల నిర్వహణ విభాగం ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో సైతం ఆమేరకు లాక్‌డౌన్ అమలును పొడిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత మార్చి 31 వరకు రాష్ట్రంలో లాక్‌డౌన్ అమల్లో ఉంటుందని ప్రకటిస్తూ ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వులతో ఏప్రిల్ 14 వరకు అమల్లో ఉండనుంది.

## 150 కేంద్రాల ద్వారా ఉచిత భోజనం

### పురపాలక శాఖ మంత్రి కేటీఆర్



**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లో 150 అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా ఉచిత భోజనం అందిస్తున్నట్లు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైందని, అవసరమైన ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లు రాత్రి భోజనం కూడా అందజేస్తాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 150 కేంద్రాల లొకేషన్ల మ్యాప్‌ను ఆయన ట్విట్టర్‌లో ఉంచారు.



**ఆకలి తీర్చని కనికరం..**

ఈమె పేరు నరసమ్మ. శనివారం ఉదయం అమీర్‌పేట మెట్రో స్టేషన్ దిగువన ఇలా దిగాలుపడి కూర్చుని కనిపించింది. అయిన వాళ్ల వివరాలడిగితే చెప్పలేకపోయింది. చాలా ఏళ్లుగా నగరంలోనే ఉంటున్నట్టు చెప్పింది. ఆకలికి తాళలేక నకనకలాడుతున్నట్టు సైగలు చేసి చెప్పిన ఆమె.. తన వద్ద ఉన్న నీటిని సమీపంలోని ఓ బాత్‌రూం నుంచి తెచ్చుకున్నట్టు చెప్పింది. ఎవరైనా వచ్చి కడుపు నింపకపోతారా అని ఈ పండుటాకు గంపెడాశతో నిరీక్షిస్తోంది.



**'దారి' చూపని నగరం..**

మూసాపేటలో కనిపించిన ఈమె పేరు సక్కుబాయి. లాక్‌డౌన్‌కు ముందురోజు బంధువులను కలిసేందుకు నగరానికి వచ్చింది. తెల్లారే సొంతూరు (మెదక్ జిల్లా నర్సాపూర్) వెళ్దామనుకుంటే అంతలోనే లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో దిక్కుతోచక తిరుగుతోంది. మియాపూర్‌లో తన కుమార్తె ఉంటుందని, అక్కడకు తీసుకెళ్తే ఇల్లు గుర్తుపట్టగలనని ఆ దారిన వెళ్తున్న వారిని అర్థిస్తోన్న ఈమె.. కుమార్తె ఫోన్ నంబర్ తన వద్ద లేదని చెబుతూ బోరుమంది.



## మానవాళి ఆయురారోగ్యం కోసమే యాగం

- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- పీఠంలో ముగిసిన విషజ్వర పీడాహర యాగం

**పెందుర్తి/తిరుమల:** కరోనా మహమ్మారిని తరిమికొట్టే నివారణోపాయం తెలియక ప్రపంచమంతా సతమతమవుతున్న తరుణంలో విశాఖ శ్రీశారదాపీఠం విషజ్వర పీడాహర యాగాన్ని చేపట్టిందని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. మానవాళి ఆయురారోగ్యం కోసమే ఈ యాగాన్ని చేసినట్లు వివరించారు. విశాఖ శ్రీశారదాపీఠంలో నిర్వహించిన విషజ్వర పీడాహర యాగం శనివారం శాస్త్రోక్తంగా ముగిసింది. ఈ నెల 18న పీఠంలో ప్రారంభమైన ఈ యాగాన్ని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షించారు. యాగంలో రుత్వికులు, వేదపండితులు, ధన్వంతరి జపమాచరించారు. అపమృత్యుదోష నివారణతో కూడిన మంత్రాలను జపించారు. అధర్వణ వేదంలో ఉన్న మంత్రాలతో పాటు ఉత్కృష్టమైన యోగ వాసిష్ట గ్రంథంలో సూచించిన బీజాక్షరాల సంపుటిని యాగంలో ప్రయోగించారు. శనివారం ఉదయం వేదపండితుల సమక్షంలో మహాపూర్ణాహుతి నిర్వహించారు.

# తొలి కరోనా మరణం

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు తెలుసుకున్నారు. దీంతో అతడిని కలసిన హోటల్ సిబ్బందిని క్వారంటైన్ కేంద్రాలకు పంపించారు.

**బయట తిరిగితే కేసులే: మంత్రి ఈటల**

రాష్ట్రంలో కరోనా సోకడంతో వృద్ధుడు చనిపోయినట్లు మంత్రి ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఖైరతాబాద్‌కు చెందిన ఆ వ్యక్తి ఢిల్లీకి మార్చి 14న ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లాడని, తిరిగి 17న హైదరాబాద్‌కు వచ్చాడని, మార్చి 20న తీవ్రజ్వరంతో బాధపడుతుండటంతో ఓఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు. అక్కడే చికిత్స పొందుతూ మరణించాడని మంత్రి వెల్లడించారు. సైఫాబాద్ పోలీసుల సాయంతో మృతదేహాన్ని గాంధీకి తరలించారని, అక్కడ పరీక్షల సందర్భంగా నమూనాలుసేకరించి పరీక్షలు చేయగా పాజిటివ్ అని తేలిందన్నారు. ఆయన భార్య, కుమారుడిని క్వారంటైన్‌లో ఉంచామన్నారు. ఆస్పత్రుల్లో చనిపోయిన వారి వివరాలివ్వాలని ఆస్పత్రులనుకోరినట్లుతెలిపారు. హైదరాబాద్‌లో ఎలాంటిరెడ్ జోన్లు లేవన్నారు. ప్రస్తుతం కరోనా పాజిటివ్ వచ్చి చికిత్స పొందుతున్న వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. శనివారం నమోదైన ఆరుకేసుల్లో ప్రయాణ చరిత్ర ఉన్న కారణంగానే వచ్చిందని పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లి వచ్చిన వారివల్లే ఏడెనిమిదిమందికి పాజిటివ్ వచ్చిందన్నారు. మతపరమైన కార్యక్రమాలను ఇంటికే పరిమితం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చర్చిలు, మసీదులు,మందిరాలు కరోనా వ్యాప్తి చెందే కేంద్రాలుగా మారొద్దన్నారు. క్వారంటైన్‌లో ఉన్నవాళ్లు బయటతిరిగితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. క్వారంటైన్‌లో 13 వేల మంది ఉంటే, వారి సంఖ్య రోజురోజుకూ తగ్గుతోందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పనికోసం వచ్చే వారికి వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని సీఎం ఆదేశించారన్నారు. కోఠిలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజారోగ్య డైరెక్టర్‌శ్రీనివాస్‌రావు, డీఎంఈ రమేశ్‌రెడ్డితదితరులతో తదుపరి కార్యాచరణపై సమీక్షించారు.

**ప్రైవేటు ఆస్పత్రుల తీరుపై అధికారుల ఆగ్రహం..**

ఇటీవల మూడు పాజిటివ్ కేసుల విషయంలో ప్రైవేటు ఆస్పత్రులు వ్యవహరించిన తీరుపై వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు మండిపడుతున్నాయి. మొదట్లో కర్ణాటకకు చెందిన వ్యక్తి ఇక్కడకు వచ్చి ఓ ఆస్పత్రిలో చేరాడు. అతడికి కరోనా లక్షణాలున్నాయని తెలిసినా వైద్య ఆరోగ్య శాఖకు తెలపలేదు. మరో ఆస్పత్రికి చెందిన ఇద్దరికి, వారి ద్వారా మరో కుటుంబసభ్యుడికి వైరస్ సోకింది. వారి వివరాలను కూడా సంబంధిత ఆస్పత్రి వర్గాలు వైద్య ఆరోగ్య శాఖకు సమాచారం ఇవ్వలేదన్న చర్చ జరుగుతోంది. తాజాగా చనిపోయిన వ్యక్తికి పాజిటివ్ అని తేలింది. అతడి వివరాలు ఆరోగ్య శాఖకు తెలపకుండానే ఆస్పత్రి చికిత్స చేసింది. ఇలా తమ నిబంధనలను అనేక ఆస్పత్రులు పాటించట్లేదని సచివాలయానికి చెందిన ఓ వైద్య ఆరోగ్య శాఖ అధికారి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇలా ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ, నర్సింగ్ హోమ్స్‌లో ఎందరు సాధారణ జలుబు, దగ్గు, జ్వరం పేరుతో చికిత్స పొందుతున్నారో అన్న అనుమానాలు అధికారులను వేధిస్తున్నాయి. అమెరికాలో అన్ని కేసులు నమోదు కావడం వెనుక ప్రధాన కారణం అక్కడ లక్షణాలున్న ప్రతి కేసును గుర్తించి, పరీక్షలు చేయడం వల్లేనని చెబుతున్నారు. ఇక్కడ మాత్రం విదేశీ ప్రయాణికులతో కాంటాక్ట్ ఉన్న వారిని, అది కూడా లక్షణాలున్న వారికి మాత్రమే పరీక్షలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలను ప్రభుత్వానికి చెప్పకపోవడం వల్లేనన్న విమర్శలున్నాయి. ఇది కొంప ముంచుతుందని వైద్యాధికారులు అంటున్నారు.

**10 మందికి నయం..!**

రాష్ట్రంలో నమోదైన 67 పాజిటివ్ కేసుల్లో చికిత్స పొందుతున్న 10 మందికి నెగెటివ్ వచ్చి నయమైనట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం 67 మందికి పాజిటివ్ అని నిర్ధారణకాగా,ఇప్పటికే తొలి కేసుకు సంబంధించిన రోగి డిశ్చార్జిఅయ్యాడు. ఇటలీ నుంచి వచ్చిన అశ్వాపురానికి చెందిన యువతికికూడా పాజిటివ్ రాగా,ప్రస్తుతం ఆమె కు కూడా నెగెటివ్ వచ్చింది. అలాగేమరో 8 మందికి కూడా తాజాగా నెగెటివ్ వచ్చినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. వీరిని ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామ ని వెల్లడించాయి.

### గైడ్‌లైన్స్ ప్రకారమే అంతిమ సంస్కారాలు

**గాంధీ ఆస్పత్రి:** కరోనా వైరస్ సోకి చనిపోయిన వ్యక్తి మృతదేహానికి కేంద్రం మార్గదర్శకాల ప్రకారమే అంతిమ సంస్కారాలు నిర్వహించినట్లు తెలిసింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో గాంధీ మార్చురీ వైద్యుల పర్యవేక్షణలో మృతదేహానికి ప్రత్యేక రసాయనాలు పూసి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంతో శుభ్రం చేశారు. అనంతరం పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ దుస్తులు తొడిగారు. ప్రత్యేకంగా రూపొందించిన లీక్ ప్రూఫ్ సంచిలో మృతదేహాన్ని ఉంచి జిప్ వేశారు. మరోసారి హైపోక్లోరైడ్ ద్రావణంతో సంచిని శుభ్రం చేశారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యుల్లో ఒకరికి మాత్రమే అనుమతించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని గాంధీ మార్చురీ నుంచి తరలించారు.

## రూ. 4 కోట్ల విరాళమిచ్చిన 'శ్రీచైతన్య'

**సాక్షి, హైదరాబాద్:** కరోనా నివారణకు శ్రీచైతన్య విద్యాసంస్థల తరఫున రూ. 4 కోట్లు విరాళమిస్తున్నట్లు ఆ సంస్థల అధినేత డా. బీఎస్ రావు పేర్కొన్నారు. దీనిలో ప్రధానమంత్రి సహాయనిధికి రూ. 1.5 కోట్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల సహాయనిధులకు చెరో కోటి రూపాయలు, తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రుల సహాయనిధులకు చెరో రూ. 25 లక్షలను విరాళమిస్తున్నట్లు ఓ ప్రకటనలో బీఎస్ రావు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తమ హాస్టల్ భవనాలను క్వారంటైన్ కేంద్రాలుగా వాడుకోవచ్చన్నారు. కరోనా మహమ్మారి నుంచి బయటపడటానికి ప్రజలంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో మరో 6 పాజిటివ్

- మొత్తం 19కి చేరిన కరోనా పాజిటివ్ కేసులు
- తాజాగా ప్రకాశం, గుంటూరు జిల్లాలో రెండేసి, కర్నూలు, కృష్ణా జిల్లాలో ఒక్కో కేసు నమోదు

**సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్:** ఏపీలో శనివారం ఒక్కరోజే మరో ఆరు కరోనా వైరస్ (కోవిడ్–19) పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 19కి చేరింది. గతంలో ఢిల్లీకి మత పరమైన కార్యక్రమం కోసం వెళ్లి పాజిటివ్ కేసుగా నమోదైన గుంటూరుకు చెందిన వ్యక్తి నుంచి తాజాగా దంపతులకు సోకింది. పాజిటివ్ వ్యక్తితో వీళ్లు తిరిగారన్న వార్త తెలియగానే వారిని విచారించి ఈ నెల 26వ తేదీన ఆస్పత్రిలో ఉంచారు. వీరి నమూనాలు పరీక్ష చేయగా శనివారం పాజిటివ్ అని తేలింది.తాజాగా ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో రెండేసి, కర్నూలు, కృష్ణా జిల్లాల్లో ఒక్కో కేసు నమోదయ్యాయి.శనివారం ఒక్కరోజే 74 నమూనాలను పరీక్షించగా 68 మందికి కరోనా వైరస్ లేదని తేలింది. మిగతా ఆరు పాజిటివ్‌గా వచ్చాయి. ప్రస్తుతం హోం ఐసొలేషన్‌లో 29,242 మంది ఉన్నారని, 179 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది.రాష్ట్రంలో తొలి పాజిటివ్ కేసుగా నమోదైన నెల్లూరు వాసి కోలుకున్నట్లుగానే.. రెండో పాజిటివ్ కేసైన విశాఖ వాసి కూడా కోలుకుంటున్నాడు.




ప్రింటింగ్ మిషన్ నుంచి పేపర్ బయటకి వస్తున్నప్పుడే శానిటైజర్ స్ప్రే చేస్తున్న దృశ్యం

## సాక్షి శానిటైజ్ చేసి..

ప్రస్తుతం ప్రతి ఒక్కరినీ కరోనా భయాలు వెంటాడుతున్న నేపథ్యంలో పాఠకుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పూర్తి శానిటైజ్ రూపంలో దినపత్రికను అందిస్తోంది సాక్షి. వార్తా పత్రికలు ముట్టుకోవడం వల్ల ఎలాంటి ముప్పు లేదని ఇటీవలే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది. అయినప్పటికీ ప్రజల్లోని అనుమానాలు పోగొట్టే ఉద్దేశంతో ప్రింటింగ్ మిషన్ నుంచి పేపర్ బయటికి వస్తున్నప్పుడే శానిటైజర్‌ను స్ప్రే చేసేలా యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. ఫొటోలో అది పనిచేసే విధానాన్ని చూడొచ్చు. ప్రింటింగ్, ప్యాకింగ్ ఆటోమేటిక్‌గా జరుగుతుంది. వెండర్స్‌కి అందించే సిబ్బంది చేతులకు గ్లోవ్స్ ధరిస్తారు. సత్యమేవజయతే అనే స్లోగన్‌తో ప్రారంభమైన సాక్షి పత్రిక ఇటీవలే 13వ వసంతంలోకి అడుగుపెట్టింది. వార్తల నాణ్యత, పత్రిక నాణ్యత విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదు. అలాగే ఇప్పటివరకు మిగతా పత్రికలతో పోల్చితే తక్కువ ధరకే పత్రికను పాఠకులకు అందిస్తూ సాక్షి తన నిబద్ధతను చాటుకుంటూ వస్తోంది.

## బియ్యంతో పాటే కందిపప్పు..

▶ మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేస్తామని చెప్పడంతో నిలిపివేసింది. కేంద్రం అందించే సుమారు 97 వేల మెట్రిక్ టన్నుల బియ్యంపై మార్గదర్శకాలు అందిన వెంటనే పంపిణీ చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ భావిస్తోంది. కేంద్రం లెక్కల మేరకు 27 వేల టన్నుల కందిపప్పు రాష్ట్రానికి అందించాల్సి ఉంటుంది. దీన్ని కేంద్ర సంస్థ నాఫెడ్ ద్వారా తీసుకుని రాష్ట్రాలకు అందించాల్సి ఉంది. దీనిపై ఇంకా రాష్ట్రాలకు అధికారిక అనుమతులు రావాల్సి ఉంది. అవి అందిన వెంటనే రేషన్ బియ్యంతో పాటే కందిపప్పును లబ్ధిదారులకు అందించనున్నారు.

**రేషన్‌పై ప్రజల ఆరా...**

పౌర సరఫరాల శాఖ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు రేషన్ బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారనే విషయమై లబ్ధిదారులు ఎక్కువగా ఆరా తీస్తున్నారు. మూడ్రోజులుగా శాఖ హెల్ప్ లైన్ నంబర్లకు 1,500 ఫోన్‌లు రాగా ఇందులో అధికంగా బియ్యం పంపిణీ, ప్రభుత్వం ఇస్తామన్న రూ.1,500లు ఎప్పటినుంచి వేస్తారనే విషయాన్ని అడుగుతున్నారని అధికారులు వెల్లడించారు. కుటుంబాల బ్యాంకు ఖాతాల అంశం కొలిక్కి వచ్చిన వెంటనే నేరుగా ఖాతాల్లో డబ్బు పడుతుందని అధికారులు తెలిపారు.

## పరిశుభ్రతే.. శ్రీరామరక్ష!

▶ మొదటి పేజీ తరువాయి

తేలింది. ప్రతి గంటలో ముక్కు, కంటి భాగాలను మూడుసార్లు చొప్పున.. నుదురు, బుగ్గలు, గడ్డం, పెదవులను నాలుగుసార్లు తాకుతారని... చెవిని గంటకు ఒకసారి మాత్రమే టచ్ చేస్తారని ఈ సర్వేలో వెల్లడయింది. ఆఫీసుల్లో పనిచేసిన వారిపై నిర్వహించిన మరో సర్వేలో ఆఫీసు వేళల్లో కనీసం సగటున 16 సార్లు ముఖాన్ని తాకుతారని తేలింది. ఈ ముఖ భాగాల ద్వారానే కరోనా వైరస్ శరీరంలోకి ప్రవేశించే అవకాశమున్న నేపథ్యంలో వీలున్నప్పుడల్లా లేదంటే కనీసం ప్రతి 20 నిమిషాలకోసారి చేతులు శుభ్రంగా కడుక్కుంటే మంచిదన్నమాట. అందుబాటులో ఉంటే సబ్బు లేదంటే శానిటైజర్ ఉపయోగించి చేతులు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యమని ఈ సర్వేల ద్వారా అర్థమవుతోంది. అందుకే... మన వ్యక్తిగత పరిశుభ్రతే... ఈ పరిస్థితుల్లో మనకు శ్రీరామరక్ష.

## పన్ను పెంపు లేనట్టేనా...?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతోంది. లాక్‌డౌన్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడటమే బాధ్యతగా ముందుకెళ్లాలని ఆయన రోజూ నిర్దేశిస్తున్నారని అధికారులు చెపుతున్నారు. ఈ విషయమై ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ ఆస్తి పన్ను పెంపు అంశం ఇప్పట్లో సీఎం ముందు చర్చకు పెట్టే పరిస్థితి లేదని, అన్నీ సర్దుకున్న తర్వాత జూలైలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. దీంతోపాటు ఇప్పటికే చెల్లించాల్సిన ఆస్తిపన్ను మార్చి 31లోపు వసూలు చేయాలని, లేదంటే యజమానులకు నోటీసులు జారీ చేయాలని గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా వాయిదా పడే అవకాశాలున్నాయి. దీని రీషెడ్యూల్‌కు సంబంధించిన ప్రకటనను త్వరలోనే సీఎం అధికారికంగా వెల్లడిస్తారని, రాష్ట్రంలో ఎలాంటి దైనందిన కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితుల్లో ఆస్తి పన్ను చెల్లింపు రీషెడ్యూల్ తథ్యమంటున్నారు.



కరోనా వైరస్ విజృంభణతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అయిన నేపథ్యంలో.. దేశంలో ఆహారధాన్యాల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ఆహార,ప్రజాపంపిణీ, వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆహారధాన్యాల నిల్వలు సమృద్ధిగా ఉన్న తెలంగాణ నుంచి కొరత ఉన్న ఇతర దక్షిణాది రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు భారత ఆహార సంస్థ గోడౌన్ల నుంచి ఆహార ధాన్యాల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు.

# ఖాళీ ప్రదేశాలకు రైతుబజార్లు

- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడా మైదానాలు, బస్టాండ్లు, కళాశాల ప్రాంగణాల్లో కూరగాయల అమ్మకాలు
- సామాజిక దూరం పెరిగేలా జాగ్రత్తలు
- గ్యాస్ బుకింగ్‌లపై 14 రోజుల ఆంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం మరిన్ని ముమ్మర చర్యలు చేపట్టింది. చాలా చోట్ల ప్రజలు నిత్యావసరాలు, కూరగాయల కొనుగోళ్ల కోసం గుంపులుగుంపులుగా వస్తున్న దృష్ట్యా, దీన్ని నిరోధించడానికి రైతుబజార్లను విశాల ప్రదేశాలకు, ఖాళీ ప్రదేశాలకు తరలిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో ఖాళీగా ఉన్న క్రీడా మైదానాలు, బస్టాండ్లు, కళాశాల, పాఠశాల ల ప్రాంగణాల్లో కూరగాయల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఇప్పటికే హైదరాబాద్ చింతలబస్తీల్లోని మార్కెట్‌ను పక్కనే ఉన్న రాంలీలా మైదానంలో తరలించారు. సంగారెడ్డిలో సైతం కలెక్టరేట్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో కూరగాయల అమ్మకాలు చేపట్టగా, కరీంనగర్ బస్టాండును మార్కెట్‌గా మార్చేశారు.చాలా చోట్ల ఇదేమాదిరి రైతుబజార్లను తరలించి కొనుగోలుదారుల మధ్య సామాజిక దూరం ఉండేలా మార్కింగ్ చేస్తున్నారు. ఇక ఇప్పటి వరకు హైదరాబాద్‌కే పరిమితమైన రైతుబజార్‌లను జిల్లాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు మొదలు పెట్టారు. దీని ద్వారా ఎక్కడివారికి అక్కడే నిత్యావసరాలు అందుబాటులోకి తేవడంతోపాటూ గుంపులను నివారించే చర్యలు తీసుకుంటున్నారు.



**గ్యాస్ బుకింగ్‌లపై ఆంక్షలు..:** ఇక లాక్‌డౌన్ పేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ బుకింగ్‌లకు డిమాండ్ పెరగడంతో ఆయిల్ కంపెనీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. వినియోగదారులు ఒకటికి మించి ఎక్కువ గ్యాస్ బుకింగ్‌లు చేయకుండా పలు ఆంక్షలు విధించాయి. ఒక బుకింగ్ జరిగాక, రెండో బుకింగ్‌కు కనీసం 14 రోజుల గ్యాప్ ఉండేలా ఆంక్షలు తెచ్చాయి. ఈ మేరకు హెచ్‌పీ, భారత్ గ్యాస్, ఇండేన్ గ్యాస్‌లు నిర్ణయం తీసుకున్నాయి. గతంలో కేవలం ఒక్క రోజు తేడాతో రెండో బుకింగ్‌కు సైతం సిలిండర్ సరఫరా చేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిమాండ్ పెరుగుతుండటం, వినియోగదారులు రెండుమూడు సిలిండర్‌లను బుక్ చేసుకుంటున్న నేపథ్యంలో ఈ ఆంక్షలు ఫలితాలనిస్తాయని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. మరోపక్క కేంద్రం ఉజ్వాల పథకం కింది లబ్ధిదారులకు వచ్చే మూడు నెలల పాటు ఉచితంగా గ్యాస్ అందిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనూ బుకింగ్‌లు పెరగడంతో కంపెనీలు జాగ్రత్తలు తీసుకున్నాయి.



## వెనిస్ జలాల్లో రాయంచల హొయలు

వెనిస్.. ఇటలీలోని అందమైన నగరం. దీనినే వంతెనల నగరమంటారు. నీటిపై తేలియాడే నగరమనీ పిలుస్తారు. చిన్నచిన్న జలమార్గాలు బోలెడన్ని ఉండే ఈ నగరంలో ప్రధాన ఆకర్షణ గండోల్స్. ఈ చిన్న పడవల్లో నగరం మీదుగా ప్రయాణించడం పర్యాటకులందరికీ మధురానుభూతి. అయితే దశాబ్దాలుగా ఈ పడవల నుంచి వెలువడే కాలుష్యానికి కాలువల్లోని నీరు విషతుల్యమైపోయింది. కరోనా కారణంగా ఇటలీ మొత్తం నిర్బంధంలోకి వెళ్లిన కొన్ని రోజులకే ఈ కాలువల పరిస్థితి మారిపోవడాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. కొన్ని అడుగుల లోతు మాత్రమే ఉన్న ఈ కాలువల అడుగుభాగం కూడా స్పష్టంగా స్ఫటికం మాదిరిగా కనిపిస్తుండటం స్థానికులను ఆశ్చర్యపరుస్తోంది. జలమార్గాలు ఇంత స్వచ్ఛంగా ఉండటం తాము జీవితకాలంలోనే చూడలేదని వారు చెబుతున్నారు. కాలువలు శుభ్రంగా మారిపోవడం, పడవల హడావుడి లేకపోవడంతో సముద్రాల్లోని డాల్ఫిన్లు కూడా నగరవాసులను పలకరిస్తున్నాయి. అంతేకాదు.. మనిషి హడావుడికి ఎన్నడో దూరమైన రాయంచలు మళ్లీ వెనిస్ కాలువల్లో హొయలు పోతున్నాయి. ఒక్క ఇటలీలోనే కాదు, మన ముంబైలోని మెరీన్ డ్రైవ్ ప్రాంతంలో డాల్ఫిన్లు సందడి చేయడం ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.



# తరుముకొస్తున్న కరోనా!

## 'సామాజిక దూరం..' పట్టించుకోని ప్రజలు

- ప్రధాని, సీఎం హెచ్చరిస్తున్నా మారని తీరు
- నిత్యావసరాల కోసం మార్కెట్లలో గుంపులు
- హైదరాబాద్‌లో పరిస్థితి మరీ దారుణం
- లాక్‌డౌన్ లక్ష్యం నీరుగారుతోందని నిపుణుల ఆందోళన
- కఠిన ఆంక్షలు విధించాలని సూచనలు



**సాక్షి, హైదరాబాద్:** సామాజిక దూరం పాటించడం ఒక్కటే ప్రస్తుతానికి కరోనాను నియంత్రించే పద్ధతిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా జనం చెవికెక్కటం లేదు. స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులు జోడించి అర్థించినా ప్రజల తీరు మారటం లేదు. లాక్‌డౌన్‌కు సంబంధించి కఠిన ఆంక్షలు విధించినా నిత్యావసర వస్తువుల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు రోడ్లపైకి వచ్చే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ వెసులుబాటును దుర్వినియోగం చేస్తూ ప్రజలు విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతున్నారు. మార్కెట్లు, మెడికల్స్ ఎదుట గుంపులుగా పోగవుతూ సాధారణ రోజులను తలపిస్తున్నారు. ఇప్పుడు ఈ పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా పరిణమించవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పెరుగుతున్న పాజిటివ్ కేసులు

దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి రెండో దశలో ఉంది. సగటున దేశంలో రోజూ 100కు పైగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. వచ్చే పక్షం రోజులు మనకు కీలక తరుణం. జాగ్రత్తగా ఉండాలంటూ స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. జాగ్రత్తపడాల్సిన అతివిలువైన సమయాన్ని దుర్వినియోగం చేసినందున తీవ్ర భయంకర పరిస్థితిని చవిచూస్తున్నామని, మీరైనా జాగ్రత్త పడండంటూ ఇటలీ, స్పెయిన్ దేశాలకు చెందిన పౌరులు మన దేశానికి సూచిస్తున్న వీడియోలు వెల్లువెత్తుతున్నాయి. ఇటు ఉదయం ఆరుకు ముందు, సాయంత్రం ఆరు తర్వాత రోడ్లు ఖాళీగా మారి జనం ఇళ్లకే పరిమితమవుతున్నా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు జన సమూహాలు కనిపిస్తున్నందున లాక్‌డౌన్ ఉద్దేశం నీరుగారుతోందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం రెండో దశలో ఉన్న కరోనా వ్యాప్తి, మూడో దశకు చేరుకుంటే చేతులెత్తేయటం తప్ప చేసేదేమీ ఉండదని గట్టిగానే హెచ్చరిస్తున్నా చాలా మందిలో ఆ భయం ఎక్కడా కనిపించటం లేదు.

### అవగాహన ఎటు పోతోంది?

ఉదయం నుంచి రాత్రి వరకు ఏ టీవీ న్యూస్ చానల్ పెట్టినా కరోనాకు సంబంధించిన వార్తలే ప్రసారమవుతున్నాయి. ఎంటర్‌టైన్‌మెంట్ చానళ్లలో కూడా ప్రముఖుల సందేశాలు ప్రసారమవుతున్నాయి. వైరస్ వ్యాప్తి అత్యంత ఉధృతంగా ఉండి రోజుకు సగటున 600 మందికి పైగా చనిపోతున్న ఇటలీ, స్పెయిన్ దేశాలకు సంబంధించిన దృశ్యాలు ప్రసారమవుతున్నాయి. వీటన్నింటికి మించి వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో భయం పుట్టించే తరహాలో వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రజల్లో చైతన్యం రాకపోవటం గమనార్హం. సాధారణంగా ఆంక్షలు విధించినప్పుడు భయంతో అమలు చేయటం కద్దు.. కానీ, కరోనా లాంటి భయంకర వైరస్ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్నా.. జాగ్రత్తలు పాటించకపోవటం విచిత్రం.

### పోలీసులున్నప్పుడు జాగ్రత్తగా..

ప్రజలను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు రోడ్లపైనే ఉంటున్నారు. వారున్న సమయంలో మాత్రం దుకాణాల ముందు సామాజిక దూరాన్ని పాటిస్తున్నారు. పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లు మొదలు చిన్న చిన్న కూరగాయల బండ్ల వరకు పోలీసులు కనీసం ఒక మీటర్ దూరం చొప్పున చాక్‌పీసులతో రోడ్లపై వృత్తాకారంలో గీతలు గీయించారు. వాటిల్లో ఒకరి తర్వాత ఒకరు నిలబడాలని ఆదేశించారు. పోలీసులున్న సమయంలో అలాగే ఉంటున్నారు. వారు అక్కడి నుంచి వెళ్లిపోగానే గుంపులుగా పోగవుతున్నారు. కొన్ని దుకాణాల నిర్వాహకులు మాత్రం తగిన సూచనలు చేస్తుండటంతో వాటి ముందు పోలీసులు చెప్పినట్టుగా ఉంటున్నారు. మిగతా వాటి ముందు యజమానులు పట్టించుకోకపోతుండటంతో షరామామూలుగానే ఉంటోంది.

### కూరగాయల మార్కెట్లలో దారుణం

హైదరాబాద్‌లోని ప్రధాన కూరగాయల మార్కెట్లు, రైతు బజార్లలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వేల సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. ఎక్కడా ఆంక్షలు అమలు కావటం లేదు. ఒక్కో దుకాణం వద్ద పదుల సంఖ్యలో గుమికూడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా కూరగాయలకు కొరత లేదు. అయినా జనం మార్కెట్లకు ఎగబడుతున్నారు.

### కఠిన ఆంక్షలు అవసరం

కూరగాయల మార్కెట్ల వద్ద వలంటీర్లనో, పోలీసులనో ఉండేలా చేస్తే తప్ప తీరు మారే సూచనలు కనిపించటం లేదు. ఎక్కడైనా జనం గుమికూడితే చర్యలు తీసుకుంటామనో, యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామనో... హెచ్చరిక చేయాల్సి ఉంది. ప్రస్తుతం అన్ని విభాగాల సిబ్బంది ఇళ్లకే పరిమితమైనందున అటువంటి వారి సేవలను ఇందుకు వినియోగించాలని, వారికి ఆరోగ్యపరంగా ఇబ్బంది లేకుండా డ్రెస్సులు, మాస్కులు, శానిటైజర్లు, గ్లౌసులు ఇచ్చి, ప్రత్యేక గౌరవ వేతనం చెల్లిస్తూ వినియోగించుకోవాలన్న సూచనలు వస్తున్నాయి.



## కరోనా జాడ.. పల్లెల్లో జల్లెడ

### అనుమానితుల కోసం బృందాల వేట

**సాక్షి, హైదరాబాద్:** 'కరోనా' పంజా విసురుతోంది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం గ్రామాలను జల్లెడ పడుతోంది. అందుకోసం ప్రతీ గ్రామంలో 'కరోనా'అనుమానిత లక్షణాలున్న వారికోసం ఇళ్లిళ్లూ తిరుగుతున్నాయి. అందుకోసం 25 వేల మంది ఆశ కార్యకర్తలు, 8 వేల మంది ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, గ్రామానికో పోలీసు కానిస్టేబుల్‌తో ప్రత్యేక బృందాలను నియమించింది. వారికి గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు సహకరిస్తున్నారు. రెండ్రోజులుగా ఈ ప్రక్రియ నడుస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే వందలాది మంది అనుమానితులతో జాబితా తయారు చేసినట్లు సమాచారం. ఆయా బృందాల వద్ద ఉన్న ట్యాబ్‌లలో తెలంగాణ కోవిడ్ పేరుతో ఉన్న యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. వాస్తవంగా ఇప్పటికే ఏఎన్‌ఎంల వద్ద ట్యాబ్‌లున్నాయి. వారు గ్రామాల్లో వివిధ వ్యాధులపై జాబితా తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ ట్యాబ్‌లను ఇప్పుడు దీనికి వినియోగిస్తున్నారు. దీంతో కరోనా అనుమానితుల జాబితా తయారు చేయడం సులువైంది.

- ఇంటింటికీ వెళ్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, కానిస్టేబుళ్లు
- అనుమానితుల జాబితా తయారు
- కోవిడ్ యాప్‌లో వివరాల నిక్షిప్తం
- ఇప్పటికే పల్లెల్లో మొదలైన ప్రక్రియ

**విదేశాల నుంచి వచ్చిన వారి గుర్తింపు..**

వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం నెల రోజుల నుంచి ఇప్పటివరకు విదేశాల నుంచి 77,045 మంది మన విమానాశ్రయం ద్వారా తెలంగాణలోకి ప్రవేశించారు. ఇతర రాష్ట్రాల్లో దిగి బస్సులు, రైళ్ల ద్వారా వచ్చినవారు మరో 10 వేల మందికి పైనే ఉంటారని అంచనా. ఆ ప్రకారం దాదాపు లక్ష మంది ఈ నెలలో విదేశాల నుంచి వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగినవారిలో 77,045 మందికి థర్మల్ స్క్రీనింగ్ చేశారు. అందులో 17,283 మందిని అనుమానిత లక్షణాలున్న వారిగా గుర్తించారు. వారిలో 764 మంది నుంచి శాంపిళ్లను సేకరించారు. అందులో 39 మందికి పైగా పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారించారు. మరికొందరి ఫలితాలు రావాల్సి ఉంది. ఇక జన సమూహంలో కలిసిపోయిన వేల మంది వివరాలు తెలియాల్సి ఉంది. ఈ పనిలోనే గ్రామస్థాయి బృందాలు నిమగ్నమయ్యాయి. ఇప్పటికే పాజిటివ్ వచ్చిన 39 మందిలో 34 మంది విదేశాల్లోనుంచి వైరస్‌ను పట్టుకొచ్చినవారే. వారి ద్వారా మరో ఐదుగురు స్థానికులకు సోకింది. ప్రధానంగా ఇండోనేసియా నుంచి వచ్చిన 10 మంది మత ప్రచారక బృందానికి కోవిడ్ పాజిటివ్ రావడంతో కలకలం రేగింది. ఇప్పుడు ఈ ప్రత్యేక బృందాలు విదేశాల నుంచి వచ్చిన వారెవరు అన్నదానిపైనే ప్రధానంగా దష్టిసారించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ రెండ్రోజుల్లో 1,500 మందిని గుర్తించినట్లు చెబుతున్నారు. కాగా, పాజిటివ్ లక్షణాలున్న వారి ప్రాంతాలు, జిల్లాలు, ఏరియాల్లో పెద్ద ఎత్తున సర్వైలెన్స్ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. ప్రధానంగా అత్యధిక కేసులు నమోదైన జిల్లాల్లో పాజిటివ్ కేసులున్న వారు ఎక్కడెక్కడ తిరిగారో గుర్తిస్తున్నారు.



## గవర్నర్ ఒక నెల జీతం విరాళం

**సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.3.50 లక్షల చెక్కును అందజేసిన గవర్నర్ తమిళిసై**

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలకు సహాయంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నెల జీతం రూ.3.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందజేశారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.జగదీశ్వర్‌కు శనివారం ఆమె రాజ్‌భవన్‌లో ఈ మేరకు చెక్కును అందజేశారు. అంతకు ముందు ఆమె రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో ఫోన్లో మాట్లాడారు. వలస కూలీలకు ఆహారం, వసతి సదుపాయం కల్పించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీల దుస్థితిపై తన కార్యాలయానికి చాలామంది ఫిర్యాదు చేస్తున్నారన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలను నిర్వహించడానికి ఐసీఎంఆర్ అనుమతి పొందిన ప్రైవేటు ఆస్పత్రులను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## 'లాక్‌డౌన్'లో వేతనంతో కూడిన సెలవులు

**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్ కాలాన్ని కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా పరిగణించాలని కార్మిక శాఖ స్పష్టం చేసింది. ఆ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 22 నుంచి 31 వరకు పెయిడ్ హాలీడేస్‌గా పరిగణించాలని స్పష్టం చేశారు.

## ఉద్యోగ పరీక్షలపైనా కరోనా ప్రభావం

**సాక్షి, హైదరాబాద్:** కరోనా ప్రభావం ప్రవేశ పరీక్షలే కాదు ఉద్యోగ పరీక్షలపైనా పడింది. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ), స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ), తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించాల్సిన వివిధ ఉద్యోగ పరీక్షలు, ఇంటర్వ్యూలను వాయిదా వేశాయి. టీఎస్‌పీఎస్సీ అయితే వివిధ శాఖలతో సంప్రదింపులను కూడా రద్దు చేసుకుంది.

- ఇప్పటికే సివిల్స్ ఇంటర్వ్యూలను వాయిదా వేసిన యూపీఎస్సీ
- తాజాగా స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షలు వాయిదా
- రాష్ట్రంలో పలు పరీక్షలను వాయిదా వేసిన టీఎస్‌పీఎస్సీ
- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వద్దని నిర్ణయం




### వాయిదా పడిన యూపీఎస్సీ పరీక్షలు

ఈనెల 23 నుంచి మొదలుకొని వచ్చే నెల చివరకు వివిధ విభాగాల్లో నిర్వహించాల్సిన సైంటిస్టులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తదితర 12 రకాల ఉద్యోగ పరీక్షలను యూపీఎస్సీ వాయిదా వేసింది. వచ్చే నెల 3 వరకు నిర్వహించాల్సిన సివిల్స్ ఇంటర్వ్యూలను వాయిదా వేసింది.

### ఎస్ఎస్సీ వాయిదా వేసినవి

ఎన్ఐఏ, సీఏపీఎఫ్ కానిస్టేబుల్స్ (జీడీ), ఎస్ఎస్ఎఫ్, రైఫిల్ ప్యూన్ ఇన్ అస్సాం రైఫిల్స్‌లో ఈనెల 24 నుంచి వచ్చే నెల 30 వరకు నిర్వహించాల్సిన రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్స్‌ను (ఆర్ఎంఈ) స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) వాయిదా వేసింది. వాటితోపాటు సీఏపీఎఫ్ కానిస్టేబుల్స్ (జీడీ), ఎన్ఐఏ, ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్‌లో రైఫిల్ ప్యూన్ పోస్టులకు ఈనెల 26 నుంచి వచ్చే నెల 7 వరకు నిర్వహించాల్సిన డీటేయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్స్‌ను (డీఎంఈ) వాయిదా వేసింది. ఢిల్లీ పోలీసు విభాగంలో ఎస్ఐ, సీఏపీఎఫ్, సీఐఎస్ఎఫ్‌లో ఏఎస్ఐ పోస్టుల భర్తీకి ఈనెల 30 వరకు నిర్వహించాల్సిన డీటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్ పరీక్షలను వాయిదా వేసింది. వీటితో పాటు కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ ఎగ్జామినేషన్ (లెవల్–1) పరీక్షలను, అలాగే ఈనెల 30 నుంచి నిర్వహించాల్సిన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, క్వాంటిటీ సర్వేయింగ్, కాంట్రాక్ట్ జూనియర్ ఇంజనీర్ పోస్టుల పరీక్షలను వాయిదా వేసింది.

### టీఎస్‌పీఎస్సీ పరీక్షలు..

రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పలు పరీక్షలను వాయిదా వేసింది. ఈనెల 27 నుంచి 30 వరకు ఆల్ ఇండియా సర్వీసెస్, స్టేట్ సర్వీసెస్ వారికి నిర్వహించాల్సిన హాఫ్ ఇయర్లీ ఎగ్జామినేషన్, లాంగ్వేజ్ టెస్టు పరీక్షలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసింది. మరోవైపు కరోనా అదుపులోకి వచ్చే వరకు ఎలాంటి పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించవద్దని నిర్ణయించింది. వివిధ శాఖలతో నిర్వహించాల్సిన సమావేశాలన్నింటినీ రద్దు చేసుకుంది. వివిధ శాఖలతో ఈ–మెయిల్ ద్వారానే సంప్రదింపులు జరపాలని కమిషన్ నిర్ణయం తీసుకుంది.

## సింగరేణి ఉద్యోగుల భారీ విరాళం

**సీఎంఆర్ఎఫ్‌కు రూ. 8.5 కోట్లు**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సహకారంగా సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఉద్యోగులు, అధికారులు తమ ఒక్కరోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాలని నిర్ణయించారు. తమ వేతనం నుంచి ఒక్కరోజు మూలవేతనం, కరువు భత్యంను సీఎం సహాయనిధికి చెల్లించాలని సంస్థ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. 2,400 మంది సింగరేణి అధికారుల ఒక రోజు మూలవేతనం, కరువు భత్యం కలిపి రూ.కోటి, ఇక 47 వేల మంది కార్మికుల ఒకరోజు మూలవేతనం, కరువు భత్యం కలిపి రూ.7 కోట్ల 50 లక్షలను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. అధికారులు, కార్మికుల వితరణ కలిపి మొత్తం రూ.8.50 కోట్ల చెక్కును త్వరలో సీఎం కేసీఆర్‌కు అందజేయనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయాలలో సింగరేణి ఉద్యోగులు, అధికారులు ఇదే తరహాలో వితరణను చాటుకున్నారు. క్లిష్ట సమయంలో కార్మికులు, అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఒకరోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించడం పట్ల సంస్థ సీఎండీ ఎన్. శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. కరోనా నేపథ్యంలో దక్షిణ భారత విద్యుత్ అవసరాలకు బొగ్గు అందిస్తున్న సింగరేణి సంస్థను అత్యవసర సేవల సంస్థగా గుర్తించారని.. కనుక సింగరేణి ఉద్యోగులు, అధికారులు 3 షిఫ్టుల్లో పని చేస్తూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఎటువంటి బొగ్గు కొరత లేకుండా సింగరేణి ఉద్యోగులు నిత్యం పాటు పడుతున్నారని వివరించారు. ప్రతి గనిలో, కార్మిక కాలనీల్లో, ఆస్పత్రుల్లో, కరోనా వ్యాప్తి నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## మృత్యు 'వల'స

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన షెల్టర్‌కు తరలించారు. 8 మంది చిన్నారులు, ముగ్గురు పురుషులు, ఆరుగురు మహిళలు ఇందులో ఉన్నారు. వీరికి కన్నడ తప్ప మరేమీ రాకపోవడంతో వివరాలు సేకరించడానికి పోలీసులు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం వీరిని ప్రత్యేక బస్సులో స్వస్థలాలకు పంపించారు. డీసీపీ ప్రకాష్‌రెడ్డి బాధిత కుటుంబాలతో మాట్లాడారు.

### ఒకే కుటుంబంలో ముగ్గురు...

కర్ణాటక యాద్గిర్ జిల్లా కక్కెరకు చెందిన సోమన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. పెద్ద కూతురు రేఖమ్మను ఇంటి వద్ద వదిలి భార్య బసమ్మ, ముగ్గురు పిల్లలతో పాటు తన తమ్ముడు బుడ్డప్ప, పూజమ్మ దంపతులు, మరో తమ్ముడు అమ్రేశ్‌తో కలిసి సూర్యాపేటకు ఉపాధి కోసం వచ్చారు. ఔటర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమన్న భార్య బసమ్మ, కొడుకు హన్మంతు, తమ్ముడు అమ్రేశ్ మృతి చెందారు. వీరితో పాటు పని కోసం వీరిని ఇక్కడకు రప్పించిన మేస్త్రీ కూడా చనిపోయాడు. 'పనుల్లేకపోవడంతో అందరం ట్రక్కులో ఊరికి బయల్దేరాం. చిన్నపిల్లలు పెద్దల ఒడిలో నిద్రపోతున్నారు. అంతలో వెనక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. గాయాలైన నా భార్య, కొడుకు, తమ్ముడు మరికొందరిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారికేం జరిగిందో తెలియడం లేదు. చనిపోయినట్లు చెబుతున్నారు. మేమంతా ఇక్కడ రాత్రి నుంచి మా వారి క్షేమం కోసం దేవున్ని వేడుకుంటున్నాం'అని సోమన్న అనే బాధితుడు రోదిస్తూ చెప్పాడు.

## ఐసోలేషన్ సెంటర్‌కు అడిగితే ఇవ్వండి

**కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆదేశం**

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలను కరోనా ఐసోలేషన్ సెంటర్లకు అడిగితే ఇవ్వాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో రక్షణ శాఖ అధికారులు లేదా జిల్లా యంత్రాంగం లేఖ/ ఈమెయిల్ ద్వారా అడిగితే ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొంది. కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ లేదా ప్రాంతీయ కార్యాలయం సీనియర్ అధికారి, సంబంధిత కేవీల ప్రిన్సిపాళ్లు తరగతి గదులను కరోనా కేసులను ఉంచేందుకు అనుమతించాలని వెల్లడించింది. ఆ వివరాలను తమకు ఈమెయిల్ (jcp.kvr@fmai.com) ద్వారా తెలియజేయాలని వివరించింది.




## గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 1,500 పడకలు

### ఎక్కడా రెడ్‌జోన్లు లేవు: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల



**సాక్షి, హైదరాబాద్:** కరోనా నేపథ్యంలో గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 1,500 పడకలు ఏర్పాటు చేస్తున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. శనివారం ఆయన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఇక్కడ 3వేల మందికి సరిపడా నీళ్ల ట్యాంకులు అందుబాటులో ఉంచుతామని, 10 లక్షల లీటర్ల నీరు పట్టేలా సంప్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ప్రతి నల్లా దానంతటదే ఆగిపోయేలా ఉండాలని, ప్రతీ బాత్‌రూం శుభ్రంగా ఉండాలని, అవసరమైతే తాత్కాలిక బాత్‌రూంలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులన్నీ శాశ్వత ప్రాతిపదికన చేస్తామన్నారు. ఆయా పనుల్లో నాణ్యమైన పరికరాలనే వాడాలని అధికారులకు సూచించారు. పడకలు శుభ్రంగా ఉంచాలని, స్టాఫ్‌కి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పెద్ద సంస్థకు భోజన క్యాటరింగ్ ఆర్డర్ ఇవ్వాలని, సెంట్రల్ ఎయిర్ కండిషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రోజుల్లో మూడు ఫ్లోర్‌లు, ఆ తర్వాత మూడు రోజుల్లో మరో మూడు ఫ్లోర్లు సిద్ధం చేయాలన్నారు. దీనిని 20 రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఇవన్నీ అవసరం పడకపోవచ్చు కానీ సిద్ధంగా ఉంచాలన్న సీఎం ఆదేశంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొందరు సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సైకోలు, శాడిస్టులు పెట్టే వార్తలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ఎక్కడా రెడ్‌జోన్లు లేవన్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారని మంత్రి ఈటల వివరించారు.

# చిన్న దేశాలు.. పెద్ద విజయాలు

## కరోనా ఫోకస్

ఇటలీ.. స్పెయిన్... అమెరికా! కరోనా వైరస్ తాకిడికి అట్టుడికి పోతున్న దేశాలివి. ఒక్కో దేశంలో రోజుకు కొన్ని వందల మంది ప్రాణాలు గాల్లో కలసిపోతూంటే.. కొత్తగా గుర్తిస్తున్న కేసుల సంఖ్య వేలల్లో ఉంటోంది. గత ఏడాది చైనాలో పుట్టిన ఈ వైరస్ ఆశ్చర్యకరంగా ఇరుగుపొరుగున ఉన్న వియత్నాం, దక్షిణ కొరియాల్లో మాత్రం పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఎందుకిలా ఆ దేశాలు చేసిన పనులేమిటి. ఇతర దేశాలు మరచింది ఏమిటి ఆసక్తికరమైన ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం...

దక్షిణ కొరియా.. చైనాకు పక్కనే ఉంటుంది. జనాభా సుమారు ఐదు కోట్లు. చైనాలోని వూహాన్‌లో వ్యాధి ఉధృతంగా ఉన్న ఫిబ్రవరి నెలలో దక్షిణ కొరియాలోనూ కొన్ని వందల కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి 29వ తేదీ ఒక్కరోజే దాదాపు 909 కేసులు బయటపడటంతో అక్కడ కూడా వైరస్ విజృంభిస్తుందని అందరూ ఊహించారు. కానీ ఆశ్చర్యకరంగా ఆ తరువాత దక్షిణ కొరియాలో కేసులు తగ్గుముఖం పట్టాయి. మార్చి ఒకటవ తేదీ 586 కేసులు నమోదు కాగా.. మార్చి 19 నాటికి ఈ సంఖ్య 158కి తగ్గిపోయింది. దేశం మొత్తాన్ని లాక్‌డౌన్ చేయకుండానే దక్షిణ కొరియా వైరస్ వ్యాప్తిని సమర్థంగా అడ్డుకోగలిగింది. ఈ విజయానికి చాలా కారణాలే ఉన్నాయి. ముందుగా చెప్పుకోవాల్సింది చాలా విస్తృత స్థాయిలో చేపట్టిన పరీక్షల గురించి. ఉన్న ఐదు కోట్ల జనాభాలో దక్షిణ కొరియా సుమారు 3.5 లక్షల మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించింది. ఇంకోలా చెప్పాలంటే ప్రతి పది లక్షల మందిలో 6,000 మందికి పరీక్షలు చేశారన్నమాట. ప్రపంచంలోనే ఈ స్థాయిలో ఎవరూ పరీక్షలు నిర్వహించలేదు. అగ్రరాజ్యం అమెరికా పది లక్షల మందిలో 74 మందికి మాత్రమే పరీక్షలు చేయగలిగిందంటే పరిస్థితి ఏమిటన్నది అర్థం చేసకోవచ్చు. పకడ్బందీగా పరీక్షలు చేపట్టడం మాత్రమే కాకుండా.. వ్యాధి బారిన పడ్డ వారిని హుటాహుటిన నిర్బంధంలో ఉంచేందుకు తగిన ఏర్పాట్లు చేయడం, వీరితో సన్నిహితంగా మెలిగిన వారందరినీ వేగంగా గుర్తించడం కూడా కొరియా విజయానికి కారణాలయ్యాయి. ఐదువేలకు పైగా కోవిడ్ కేసులు ఉన్న షిన్‌ఛెనోజీ చర్చ్ ఆఫ్ జీసస్ సమావేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం కూడా ఆ దేశానికి కలిసివచ్చిందని చెప్పవచ్చు. ఈ చర్చి సమావేశాలను లక్ష్యంగా చేసుకుని పరీక్షలు చేయడం వల్ల తాము ఇతర ప్రాంతాల్లో పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం రాలేదని సియోల్ నేషనల్ యూనివర్సిటీలోని సాంక్రమిక వ్యాధుల నిపుణుడు ఓ మ్యుయాంగ్ డాన్ అంటున్నారు.

### మెర్స్ అనుభవం అక్కరకు వచ్చింది..

దక్షిణ కొరియాలో కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు 2013 నాటి మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (మెర్స్) అనుభవం బాగా ఉపయోగపడింది. 2015లో మధ్యప్రాచ్య దేశాల నుంచి తిరిగి వచ్చిన ఓ వ్యాపారవేత్త ద్వారా ఈ వైరస్ దక్షిణ కొరియాలోకి ప్రవేశించింది. వ్యాధిని గుర్తించే లోపు మూడు ఆసుపత్రుల్లో వేర్వేరు లక్షణాలకు చికిత్స పొందిన ఈ వ్యాపారవేత్త ఆ క్రమంలో 186 మందికి వైరస్‌ను అంటించాడు. ఆసుపత్రి సిబ్బంది.. ఇతర కారణాల వల్ల ఆసుపత్రిలో చేరిన వారు సుమారు 36 మంది ప్రాణాలు కోల్పోయారు కూడా. ఈ సంఘటనల తరువాత మేల్కొన్న ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వ్యాధిగ్రస్తులను గుర్తించి, నిర్బంధంలో ఉంచడం మొదలుపెట్టింది. దీంతో వ్యాధి సుమారు 17 వేల మందికి సోకినా రెండు నెలల్లో అతితక్కువ మరణాలతో దక్షిణ కొరియా పెను ప్రమాదం నుంచి బయటపడింది. ఈ అనుభవం మొత్తం ఇప్పుడు సార్స్–సీఓవీ2 కట్టడికి ఎంతో ఉపయోగపడుతోందని, మరీ ముఖ్యంగా ఆసుపత్రుల్లో వైరస్‌ను నియంత్రించేందుకు అక్కరకు వచ్చిందని అంటున్నారు ఆ దేశ వైద్య నిపుణులు. మెర్స్ వ్యాధి ప్రబలిన కాలంలో దక్షిణ కొరియా చేసిన ఒక చట్టం అవసరమైనప్పుడు ప్రజల మొబైల్‌ఫోన్, క్రెడిట్ కార్డు తదితర వివరాలను సేకరించేందుకు వెసులుబాటు కల్పించడంతో కోవిడ్ కష్టకాలంలోనూ ఆ చట్టం సాయంతో వ్యాధి బారిన పడ్డవారిని వేగంగా గుర్తించడం వీలైందని అంచనా.



చైనాలో కరోనా భూతం బయటపడిన వెంటనే కొరియా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వేగంగా వ్యాధి నిర్ధారణకు అవసరమైన కిట్లను అభివృద్ధి చేయించింది. ఫిబ్రవరి ఏడవ తేదీ, తొలి కిట్‌ను ఆమోదించగా పదకొండు రోజుల తరువాత షిన్‌ఛెనోజీ చర్చ్ ఆఫ్ జీసస్ సమావేశాలకు హాజరైన ఓ మహిళకు వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఆ వెంటనే అధికారులు సమావేశాలకు హాజరైన వారందరినీ గుర్తించి పరీక్షలు చేపట్టడంతో వ్యాధి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుకున్నట్లు అయ్యింది. ఆరోగ్య సమస్యలు ఉన్న వారిలో కోవిడ్ లక్షణాలు బయటపడితే వారికి ఆసుపత్రుల్లో ప్రాధాన్యమివ్వడం ఓ మోస్తరు లక్షణాలు ఉన్న వారిని తాత్కాలిక ఆసుపత్రులు మార్చిన భవనాల్లో ఉంచి కనీస వైద్య సదుపాయం అందేలా చేయడం, కోలుకున్న వారిలో వైరస్ లేదని రెండుసార్లు నిర్ధారణ చేసుకున్న తరువాత మాత్రమే డిశ్చార్జ్ చేయడం వంటి ప్రణాళికబద్ధమైన చర్యలు దక్షిణ కొరియాను కరోనా మహమ్మారి బారి నుంచి ఈ రోజు వరకూ రక్షించాయని చెప్పాలి.

> విజేతల్ని ఈ ప్రపంచం ఆరాధిస్తుంది. వారిని అనుసరించి, ఆ మార్గానే పయనించి తానూ గెలవాలని ఉవ్విళ్లూరుతుంది. సరిగ్గా అందుకే అందరూ ఇప్పుడు దక్షిణ కొరియా, వియత్నాంల వైపు చూస్తు న్నారు. చైనా దరిదాపుల్లోవుండి కూడా ఈ దేశాలు అక్కడినుంచి వచ్చిన మహమ్మారిని ఎలా కట్టడి చేశాయో... ఏం మంత్రం వేశాయో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### వియత్నాంలో 148 కేసులు మాత్రమే...

చైనాతో సుమారు 1100 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్న దేశం వియత్నాం. జనసమ్మర్దం ఎక్కువ. ప్రజా ఆరోగ్య వ్యవస్థ చాలా బలహీనం. అయినప్పటికీ ఈ దేశంలో మార్చి 26వ తేదీ వరకూ వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య కేవలం 148 మాత్రమే. జనవరి నెల ఆఖరులో కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రభుత్వం కరోనా వైరస్‌పై యుద్ధానికి దిగుతున్నట్లు చేసిన ప్రకటనతో ఆ దేశం నిజంగా యుద్ధ ప్రాతిపదికన పనిచేసింది. ఈ మహమ్మారిపై పోరంటే.. శత్రువుతో పోరేనని అధ్యక్షుడు నూగుయెన్ షువాన్ ఫుక్ ఇచ్చిన పిలుపుతో కదిలిన ప్రభుత్వ యంత్రాంగం వేల మందిని ముందస్తు క్వారంటైన్‌లో ఉంచేసింది. మిలటరీ ఆధ్వర్యంలోని పలు కేంద్రాల్లో తాత్కాలిక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసింది. దక్షిణ కొరియా మాదిరిగా లక్షల సంఖ్యలో పరీక్షలు జరిపేంత ఆర్థిక స్థోమత లేకపోయినా, సుమారు 80 లక్షల జనాభా ఉన్న హో చి మిన్ నగరంలో కేవలం 900 ఐసీయూ పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నా వియత్నాం అదరలేదు. బెదరలేదు. కఠినాతికఠినమైన క్వారంటైన్ నిబంధనలు రూపొందించి వాటి కచ్చితమైన అమలుతో సమస్యను ఎదుర్కొంది. చైనా కంటే చాలా ముందుగానే లాక్‌డౌన్ ప్రకటించడం, వైరస్ సోకిన వారికి సన్నిహితంగా ఉన్న వారిని వేగంగా గుర్తించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని సమర్థంగా అడ్డుకోగలిగింది. దేశం మొత్తమ్మీద కేవలం పది కరోనా కేసులు మాత్రమే నమోదైనా ఫిబ్రవరి 12వ తేదీ వియత్నాం హనోయి సమీపంలో సుమారు పదివేల మంది జనాభా ఉన్న గ్రామం మొత్తాన్ని మూడు వారాల స్వీయ నిర్బంధంలో ఉంచిందంటే ఆ దేశం పరిస్థితిని ఎలా అదుపు చేసిందనేది అర్థం చేసుకోవచ్చు. పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారితో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు కూడా వియత్నాం ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికను అమల్లోకి తెచ్చింది. జర్మనీలాంటి దేశం వైరస్ బారిన పడ్డవారిని.. వారు ప్రత్యక్ష కాంటాక్ట్‌లను మాత్రమే గుర్తిస్తే వియత్నాం మరో నాలుగు అంచెల వరకూ కాంటాక్ట్‌లను గుర్తించింది. వీరందరి కదలికలపై నియంత్రణలు పెట్టడం, ఇతరులతో కాంటాక్ట్ పెట్టుకోవడంపై ఆంక్షలు విధించడంతో సమస్య చాలావరకూ అదుపులోకి వచ్చిందని అంచనా. కరోనా సమస్య ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారిని చాలా ముందుగానే 14 రోజుల క్వారంటైన్‌లో ఉంచడంతోపాటు విశ్వవిద్యాలయాలకు, పాఠశాలలన్నింటికీ సెలవులు తొందరగా ప్రకటించిన దేశమూ వియత్నామే. ఇంకోలా చెప్పాలంటే వియత్నాం ఇటలీ, స్పెయిన్, అమెరికా, చైనాల మాదిరిగా వైద్యం, టెక్నాలజీలపై ఎక్కువగా ఆధారపడకుండా.. తన బలమైన నిఘా వ్యవస్థలపై ఆధారపడి నియంత్రణలన్నింటినీ ఉక్కు సంకల్పంతో అమలు చేయడం ద్వారా గట్టెక్కిందని చెప్పాలి.

# ఒకే పథమై.. ఒకే స్వరమై...!



పెద్దా చిన్నా తేడా లేదు... ఆడ మగ భేదం లేదు... జాతి, కులం, మతం, ప్రాంతం వ్యత్యాసం లేదు. అగ్ర రాజ్యమైనా, అట్టడుగున పడివున్న దేశమైనా లెక్కలేదు. అది ప్రజాస్వామ్య వ్యవస్థా, నియంతృత్వ రాజ్యమా అనే లెక్కలేదు. అందరినీ ఒకే రకంగా కరోనా వైరస్ పీడిస్తోంది. అన్ని ఆర్థిక వ్యవస్థల్ని కబళించడానికి సిద్ధపడుతోంది. యధేచ్ఛగా తన ధ్వంసరచన సాగిస్తోంది. దీన్ని కట్టడి చేయడానికి ఒక్కో దేశం ఒక్కో వ్యూహాన్ని అనుసరిస్తోంది. మన దేశం బహు విధాలుగా ఈ మహమ్మారిపై పోరాటం మొదలుపెట్టింది. 21 రోజుల లాక్‌డౌన్ ద్వారా పౌరుల్ని బయటకు రానీయకుండా చూడటం, ఈ బహుముఖ పోరాటంలో మొదటిది. దీంతోపాటు రాజకీయ విభేదాలు మరిచి, ఏ రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వమున్నా లాక్‌డౌన్‌కు సహకరించడం రెండోది. ఇది మెచ్చదగిన పరిణామం. సంక్షోభ సమ యాల్లో మన నేతలంతా ఒక్కటిగా ఉంటారనేందుకు ఇది ఉదాహరణ. అసలే ఆరోగ్య వ్యవస్థ అంతంతమాత్రంగా వున్న మన దేశంలో ఇలా సమష్టిగా కదలకపోతే ఈ మహమ్మారితో పోరా డటం అసాధ్యం. ఖజానా నుంచి భారీ మొత్తంలో నిధుల విడుదల మూడో చర్య. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ రూ. 1.7 లక్షల కోట్ల ప్యాకేజీని ప్రకటించడం, వివిధ వర్గాల వారికి ఈ కష్టకాలంలో అవసరమైన మొత్తాన్ని అందజేస్తా మని చెప్పడం, ఉచితంగా తిండిగింజలివ్వడం, రైతులు, కార్మికులు, కూలీలు, మహిళలు తదితర వర్గాలకు అందించబోయే సాయమేమిటో ప్రకటించడం, మధ్యతరగతికి కొన్ని వెసులుబాట్లు ఇవ్వడం వంటివి ఇందులో భాగమే. నాలుగోది ద్రవ్యసంబంధమైనది. రెపో రేటు, రివర్స్ రెపో రేట్లను సవరించి బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయడానికి మార్గం సుగమం చేయడం, ఉత్పాదక రంగానికి జవసత్వాలివ్వడం నాలుగోది. 1.37 లక్షల కోట్ల రూపాయలు లభ్యమయ్యేలా చర్యలు తీసు కోవడం మెచ్చదగ్గది. అయితే ఆర్థిక సంబంధ కార్యకలాపాలు స్తంభించిపోయిన వర్తమాన స్థితిలో ఇది ఏమేరకు వాణిజ్య లావాదేవీలు పెర గడానికి దోహదపడుతుందో ఇంకా చూడాల్సి ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్లు యథావిధిగా వ్యవహారాలు కొనసాగించడానికి, ఆర్థిక సుస్థిరత సాధిం చడానికి ఈ చర్యలు తోడ్పడాలన్నది రిజర్వ్‌బ్యాంకు ఆలోచన. ఈ మహమ్మారి కొట్టిన దెబ్బ సామాన్యమైనది కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారు కుంటున్న ప్రస్తుత స్థితిలో ఈ చర్యలన్నీ గొప్ప ఫలితాలిస్తాయని ఆశించలేం. రిజర్వ్ బ్యాంక్ చర్యలు మరింత వాస్తవికంగా ఉండాలన్నది కొందరు నిపుణుల సూచన. ఒకపక్క ముడి చమురు ధరలు పడిపోయినందువల్ల ద్రవ్యోల్బణం తగ్గొచ్చునని, పర్యవసానంగా కొన్ని ఆహార వస్తువుల ధరలు కూడా కిందికి దిగొచ్చే అవకాశం వుందని వారు చెబుతున్నారు. పార్లమెంటు, అసెంబ్లీల కార్యకలాపాలు ఆగి పోయాయి. కార్యనిర్వాహక వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేస్తుండటం, ఆఖరికి న్యాయ వ్యవస్థ సైతం అత్యవసర స్వభావమున్న కేసుల్ని తప్ప మరేమీ విచారించబోవటం లేదని చెప్పడం ఈ బహుముఖ పోరులో భాగమే. కంపెనీలు, ఉత్పత్తిదారులు, పంపిణీదారులు, బ్యాంకింగ్ రంగాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ఒక్కటై పనిచేస్తున్నాయి. వేల కోట్లకు పడగలెత్తిన కుబేరులు ఆలస్యంగానైనా తమ బాధ్యత గుర్తించి ఉదారంగా విరాళాలివ్వడం మొదలుపెట్టారు. కొందరు తమ ఉత్పాదక సంస్థల్లో వైద్యపరమైన ఉపకరణాల తయారీకి సిద్ధపడుతున్నారు. మేధోపరమైన అధ్యయనాలు చేసే సంస్థలు ఈ మహమ్మారిని పోరాడటంలో ఏ ఏ వ్యూహాలు అనుసరించాలో, ఎక్కడెక్కడ లోటుపాట్లున్నాయో, వాటిని సరిచేయడానికి చేయాల్సిందేమిటో చెబుతున్నాయి. మొత్తానికి దేశంలోని వ్యవస్థలు, సంస్థలు, వ్యక్తులు అందరూ ఒక్కటై చేతులు కలిపారు. వైద్యరంగ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర అత్యవసర సర్వీసుల్లోని సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారు. ఇలాంటి ధోరణులు ఇంతక్రితం మన దగ్గర ఈ స్థాయిలో కనబడలేదు. ఎంతసేపూ ఆధిపత్య రాజకీయాలు తప్ప మన పార్టీలకు మరేమీ పట్టేవి కాదు. ఈ మహమ్మారి పుణ్యమా అని మొత్తానికి అందరిలో జడత్వం వదిలిన జాడలు కనబడుతున్నాయి. ఈ సంక్షోభాన్ని మనమంతా అధిగమించాక ఈ సమైక్యత మన మధ్య ఇంతగా ఎలా సాధ్య మైందో, దీన్ని మరింత మెరుగైన పాలనకు ఎలా వినియోగించవచ్చునో, మనమంతా క్రమశిక్షణాయుత పౌరులుగా రూపొందడానికి ఇదెలా దోహదపడుతుందో, ఆర్థికరంగంలో మనం మరింతగా పుంజుకుని మెరుగైన వృద్ధి రేటును సొంతం చేసుకోవడానికి ఈ అనుభవాలన్నీ ఎలా దోహదపడతాయో అధ్యయనం చేద్దాం. పటిష్టమైన, సమున్నతమైన భారతాన్ని ఆవిష్కరించుకోవడానికి కృషి చేద్దాం.

> దృఢచిత్తంతో వున్నవారిని సంక్షోభాలు ఏమీ చేయలేవు. సరిగదా వారి సంకల్పాన్ని మరిన్ని రెట్లు పెంచుతాయి. లక్ష్య సాధనకు వారిని పురిగొల్పుతాయి. ఇంతగా, ఈ స్థాయిలో ఒక్కటై నిలిచామా అని మనమే ఆశ్చర్యపోయేలా చేస్తాయి. ఈ ప్రాణాంతక మహమ్మారి పరారయ్యాక ఈ స్ఫూర్తిని మనం కొనసాగించాలి.

# ఊపిరాడని యూరప్!

ఇప్పుడు ప్రపంచాన్ని వెన్నాడుతున్న భూతం– కరోనా వైరస్ అన్ని ఖండాలతోపాటు యూరప్‌ను కూడా వణికిస్తోంది. అయితే ఈ ఖండంలోని అన్ని దేశాల్లోనూ కేసుల సంఖ్య ఒకేలా లేదు. మరణాల సంఖ్యలోనూ ఎన్నో వ్యత్యాసాలు. ఈ గణాంకాలు అందరిలోనూ సందేహాలు రేకెత్తిస్తున్నాయి. ఇందులో కావాలని తగ్గించి చూపుతున్న దేశాలెన్ని.. పట్టించుకోవడంలో జాప్యం చేసి లెక్క సరిగా చూసుకోని దేశాలెన్ని.. నిర్లక్ష్యంతో ప్రాణాలమీదకు తెచ్చుకున్న దేశాలెన్ని అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య ఆరు లక్షలు దాటిపోగా... మరణాల సంఖ్య 30,000కు చేరువవుతోంది. 1,37,329 మంది పూర్తిగా కోలుకోగలిగారు. యూరప్ దేశాలన్నీ రాగల ఉత్పాతాన్ని తల్చుకుని తల్లడిల్లిపోతున్నాయి. ఇటలీలో మృత్యుదేవత వికటాట్టహాసం చేస్తోంది. అక్కడ 86,500 కేసులుండగా, 9,134 మంది మరణించారు. స్పెయిన్‌లోనూ దాని తీవ్రత ఎక్కువే. మూడో వారానికి చేరుతుండగా ఆ జబ్బు 'వదల బొమ్మాళి' అంటూ దాన్ని పీడిస్తోంది. అక్కడ 72,248 కేసులు బయటపడ్డాయి. అక్కడ 5,690 మంది మరణించారు. ఫ్రాన్స్‌లో ఆలస్యంగా ప్రకటించిన లాక్ డౌన్‌ను జనం సక్రమంగా పాటించకపోవడం వల్ల ఆ దేశం చెల్లించుకోవాల్సిన మూల్యం ఎక్కువే కావొచ్చునంటున్నారు. అక్కడ 32,964 కేసులు బయటపడితే, 1,995 మంది మరణించారు. అయితే ఎప్పటికప్పుడు కొత్త కేసులు వస్తూనే వున్నాయి. జర్మనీలో కేసులు జాస్తిగా వున్నాయి. అక్కడ 53,340 మంది ఈ జబ్బుబారిన పడ్డారు. ఈ సంఖ్య చూసి అందరికందరూ బెంబేలెత్తుతున్నారు. కానీ మరణాలు చూస్తే ఇప్పటికీ 400 దాటలేదు. అందుకు ఊరటపడాలా లేక సరైన లెక్కలు రావడం లేదనుకోవాలా అన్న శంకలు తప్పడం లేదు. బ్రిటన్‌లో ఆ దేశ ప్రధాని బోరిస్ జాన్సన్, ఆరోగ్యమంత్రి మట్‌హన్ కాక్ స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయారు. వీరికన్నా ముందే ప్రిన్స్ చార్లెస్ కరోనా బారినపడ్డారు. అక్కడ కూడా కరోనా తన ప్రతాపాన్ని చూపుతోంది.



ఈ మహమ్మారి బయటపడింది ఇటీవలే కావడం వల్ల తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపైనగానీ, కేసుల్ని ఆరా తీయడంలో, వ్యాధిగ్రస్తుల్ని నిర్ధారించడంలో అనుసరించదగిన విధానాలపైగానీ అంతర్జాతీయ ప్రమాణాలు ఇంకా సంపూర్ణంగా రూపుదిద్దుకోలేదన్నదే నిపుణులిస్తున్న జవాబు. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు మదింపు వేస్తూ, వేర్వేరు దేశాల ఆచరణ ఎలావుందో చూస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు, సలహాలు ఇస్తోంది. కరోనాలో అందరికన్నా ముందే నిండా మునిగి, ఇప్పుడిప్పుడే తేరుకున్న చైనా వైపు ప్రపంచమంతా ఆశగా చూస్తోంది. ఇప్పటికే ఆ జబ్బుతో నానా యాతనలూ పడుతున్న దేశాల్లో కొన్ని అమల్లోకి తీసుకొచ్చిన వ్యవస్థల వల్ల మెరుగైన ఫలితాలు కనబడటంతో వాటిని ఆచరించడానికి అనేక దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఒకడుగు ముందుకేస్తున్న దేశాలు.. చేయగలిగినంత చేసి చేతులెత్తేస్తున్న దేశాలు.. ఇప్పటికీ సక్రమంగా పద్ధతులు పాటించని దేశాలు.. ఇలా రకరకాలుగా వుంటున్నాయి. అసలు దేశాల్లోనే వివిధ రాష్ట్రాల మధ్య ఎంతో వ్యత్యాసం వుంటోంది. ఇలాంటి సమయంలో ఒక దేశం డేటాను మరో దేశం డేటాతో పోల్చి భరోసాతో వుండటం లేదా బెంబేలెత్తిపోవడం సరికాదని నిపుణులు చెబుతున్న మాట.

కరోనా జబ్బు లక్షణాల గురించి ఇప్పుడిప్పుడే స్పష్టత వస్తున్నా, కొన్ని ఇతర జబ్బులకు కూడా ఇంచుమించు అవే లక్షణాలు ఉండటం వల్ల జనం ఈ మహమ్మారిని పోల్చుకోలేకపోతున్నారు. అందుకే తీవ్రమయ్యాకగానీ డాక్టర్లను ఆశ్రయించడం లేదు. కనుకనే ఇప్పుడు కనబడుతున్న కేసుల్ని బట్టి ఏం కాలేదన్న భరోసా మంచిది కాదని యూరప్ దేశాల ప్రభుత్వాలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాయి. ఫ్రాన్స్‌లో యువతను రోడ్ల మీదకు రాకుండా ఆపడం అక్కడి ప్రభుత్వానికి ఎంతో కష్టమైంది. ఇటలీవాసులు కూడా మొదట్లో ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. ఎవరిని పరీక్షించాలి, ఏ దశలో చికిత్స మొదలెట్టాలి, పరీక్షలకు అనుసరించాల్సిన శాస్త్రీయమైన ప్రోటోకాల్ ఏమిటి అన్న అంశాల్లో ఇంకా స్పష్టత ఏర్పడలేదు. ఈ తేడాలవల్లే దేశాల మధ్య గణాంకాల్లో వ్యత్యాసాలు కనబడుతున్నాయని నిపుణులంటున్నారు.

'మా దగ్గర ఫ్లూ లక్షణం కనబడితే అనుమానిస్తున్నాం. కరోనా రోగికి తెలిసిగానీ, తెలియకగానీ సన్నిహితంగా మెలిగిన వారందరినీ కూడా పరీక్షలకు పంపుతున్నాం. యూరప్‌లోనే కాదు.. ప్రపంచంలో ఏ దేశమూ ఇలా చేయడం లేదు. అందుకే మా దగ్గర కరోనా కేసుల సంఖ్య అధికంగా కనబడుతోంది' అని జర్మనీ ఆరోగ్య శాఖ సంజాయిషీ ఇస్తోంది. అందులో కొంతవరకూ నిజముంది. ఇంతవరకూ రోజుకు 1,60,000 కరోనా పరీక్షలు చేయగల సామర్థ్యం దానికుండేది. దాన్ని 4 లక్షల పరీక్షలకు పెంచబోతోంది. చాలా దేశాలు అసలు పరీక్షలపై దృష్టి పెట్టడం లేదన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫిర్యాదు. పరీక్షల సంగతలా వుంచితే యూరప్ దేశాల్లో అనేకం లాక్‌డౌన్‌ల విషయంలో ఇంకా ఉదాసీనంగానే వుంటున్నాయని ఆందోళన పడుతోంది. ఇదే వరస కొనసాగితే ఆ ఖండంలో రెండున్నర లక్షలమంది మరణించే ప్రమాదం వుందని హెచ్చరిస్తోంది. అందుబాటులోని గణాంకాల ఆధారంగా వ్యాధుల వ్యాప్తిపై అంచనాలు వేసే బ్రిటన్ నిపుణుడు టిల్డెస్లీ ఒక మాట అంటున్నారు. ఎవరికి వారు తమకు కలిగే ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేసుకుని, ప్రభుత్వాలిచ్చిన సూచనలు పాటించడం లేదని, వారిలో ఏమేరకు భయం కలిగించగలమన్న దాన్నిబట్టి ఈ విలయాన్ని కనిష్ట స్థాయికి పరిమితం చేయొచ్చునని ఆయన సలహా ఇస్తున్నారు. ఎవరికి వారు తమను ఈ వ్యాధి కబళిస్తుందన్న భయంతో వున్నప్పుడే దాన్ని ఆపగలమని చెబుతున్నారు. సామాన్య జనం కంటే ముందు ప్రభుత్వాలు ఈ సంగతి తెలుసుకోవాలి. అది యూరప్ అయినా, ఆసియా అయినా... మరో ఖండమైనా ఈ సూత్రాలే వర్తిస్తాయి.

# కరోనా కరాళ నృత్యం




కేసుల్లోనూ అమెరికా అగ్రరాజ్యమే

అగ్రరాజ్యంగా వెలుగొందుతున్న అమెరికా కరోనా కేసుల విషయంలోనూ అగ్ర స్థానంలో ఉండటం విషాదం. సైనిక, శాస్త్ర, సాంకేతిక సహా అనేక రంగాల్లో ముందంజలో ఉంటూ ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా కోవిడ్–19 ముందు బోల్తా పడింది. చాలా సందర్భాల్లో విచిత్రమైన తన మాటలతో అందరినీ ఆశ్చర్యచకితులను చేసే ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైరస్ శక్తిని అంచనావేయలేక క్లీన్ బౌల్డ్ అయ్యాడని అందరూ విమర్శలు గుప్పిస్తున్నారు. కరోనా వైరస్ పుట్టిన చైనాను, నిర్లక్ష్యం కారణంగా వేలాది మరణాలను చవిచూస్తున్న ఇటలీని అమెరికా దాటేయడం సర్వత్రా ఆందోళనను కలిగిస్తోంది. ఇప్పటికే సుమారు లక్షన్నరమందికి కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారణ కాగా, మరో 80 వేలమందికి కూడా సోకే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషించడం అక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే, ఇతర దేశాలతో పోలిస్తే అమెరికాలో మరణాల సంఖ్య కాస్త తక్కువగా ఉండటం ఉపశమానాన్ని ఇచ్చే అంశం. అనేక ప్రపంచ స్థాయి కార్యాలయాలకు, ప్రముఖ కంపెనీల కేంద్ర కార్యాలయాలకు నెలవైన న్యూయార్క్ లో కరోనా కరాళ నృత్యం చేస్తోంది. న్యూయార్క్ లో 46,262 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 600మంది మరణించారు. అటు న్యూజెర్సీ, కాలిఫోర్నియా, వాషింగ్టన్ డీసీ, ఫ్లోరిడా, ఇల్లినాయిస్, మిచిగాన్, పెన్సిల్వేనియా, టెక్సాస్, లూసియానా, జార్జియాల్లో, కొలరాడో, మసాచుసెట్స్, చికాగో, డెట్రాయిట్ తదితర రాష్ట్రాల్లో కూడా కరోనా ప్రభావం తీవ్రంగా ఉంది.

### ఇదీ తేడా

ఈ ఏడాది జనవరి 20వ తేదీన మొదటిసారి కరోనా వైరస్ కేసు వెలుగులోకి వచ్చింది. చైనాలోని వూహాన్ నగరంలోని తన కుటుంబ సభ్యులను కలిసి వచ్చిన 35 ఏళ్ల వ్యక్తికి కరోనా వైరస్ సోకింది. సరిగ్గా అదే రోజు ఐదు వేల మైళ్ల దూరంలో ఉన్న దక్షిణ కొరియాలో కూడా ఈ వైరస్ బయటపడింది. ఈ రెండు నెలల్లో ఈ రెండు దేశాలు దానిపట్ల వ్యవహరించినతీరులో ఎంతో భిన్నత్వం కనబడుతుంది. దక్షిణ కొరియా తక్షణం స్పందించి కరోనా సోకిన వ్యక్తిని ఐసోలేషన్‌లో ఉంచడమేగాక, రాబోయే పెనుముప్పును ఎదుర్కొనేందుకు పూర్తిగా సన్నద్ధమయ్యింది. కానీ, అమెరికా మాత్రం వైరస్ వ్యవహారాన్ని చాలా నిర్లక్ష్యం చేసింది. అమెరికాలో విస్తరించబోయే మహమ్మారిని అడ్డుకోడానికి తక్షణం యుద్ధప్రాతిపదికన స్పందించాలని వైద్య నిపుణులు మొత్తుకున్నా ఫిబ్రవరి నెలాఖరు వరకూ ట్రంప్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. అప్పుడు కూడా దేశంలోని పరీక్షా కేంద్రాలు, ఆసుపత్రులు కోవిడ్–19 పరీక్షలు నిర్వహించడానికి మాత్రమే అనుమతి ఇచ్చారు.

### చరిత్ర పాఠం

రాజకీయ నాయకత్వం విఫలమైతే ఎటువంటి గుణపాఠాలు నేర్చుకోవాల్సి ఉంటుందనే దానికి అమెరికాయే ప్రత్యక్ష నిదర్శనం. అమెరికా అధ్యక్షుడి బాధ్యతారాహిత్యాన్ని గురించి తరువాతి తరాల వారు చరిత్ర పాఠాలుగా చదువుకుంటారని అక్కడి మేధావులు విమర్శిస్తున్నారు. జనవరి చివరి నాటికే అమెరికా దగ్గర కోవిడ్–19 గురించిన పూర్తి సమాచారం ఉన్నప్పటికీ ట్రంప్ దాన్ని రాజకీయంగా వాడుకోవడానికే ప్రాధాన్యతనిచ్చారు. 'చైనీస్ వైరస్' అని విమర్శించడం, చైనా పర్యటనలపై తాత్కాలిక నిషేధం విధించడంతో కాలం వెళ్లబుచ్చారు. తనను తాను వార్ టైమ్ ప్రెసిడెంట్ గా చెప్పుకునే ట్రంప్ కరోనా విషయంలో పప్పులో కాలేశారు. జనవరి 30న ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర పరిస్థితిని ప్రకటించినప్పటికీ ట్రంప్ లో చలనం రాలేదు. యథా రాజా తథా ప్రజ అన్నట్టు అక్కడి ప్రజలు కూడా చాలా రోజులు కరోనా వస్తే రానీ అని నిర్లక్ష్యం వ్యవహరించారు. పార్టీలు, పండుగలు చేసుకున్నారు. అందుకు ఇప్పుడు వాళ్లు మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

### అమల్లోకి రక్షణ చట్టం

చిట్టచివరకు చేతులు కాలుతున్నప్పుడైనా ఆకులు పట్టుకోడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సిద్ధమయ్యారు. అత్యవసరంగా చేపట్టగలిగే అన్ని చర్యల్ని తీసుకుంటూనే సైన్యంలోని ఇంజినీర్లను రంగంలోకి దించి దేశ వ్యాప్తంగా ఆసుపత్రులు నిర్మించాలని ఆదేశించారు. అలాగే, డిఫెన్స్ ప్రొడక్షన్ యాక్ట్ ను కూడా అమల్లోకి తీసుకు వచ్చారు. వీటన్నిటితో పాటు రెండు లక్షల కోట్ల ప్యాకేజీపై ట్రంప్ సంతకం చేశారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, వ్యాపార వర్గాలతోపాటు సామాన్యులకు ఊరట కలిగించడానికి ఈ మొత్తాన్ని వినియోగిస్తారు.

### వీడని పెద్దన్న పాత్ర

ఇదే సమయంలో తన పెద్దన్న పాత్రను నిలబెట్టుకోడానికి అన్నట్టు కోవిడ్–19పై పోరాటానికి అమెరికా 64 దేశాలకు సుమారు 17.4లక్షల కోట్ల డాలర్లు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరిలో ప్రకటించిన పది లక్షల కోట్ల డాలర్లకు ఇది అదనం. ఇందులో భాగంగా మన దేశానికి సుమారు 29 లక్షల కోట్ల డాలర్లు అందుతాయి. వ్యాధి నిరోధక, అదుపు కేంద్రాలు(సీడీసీ) ద్వారా ఈ నిధులు అందిస్తారు.

### ఉచిత యోగా

ఇందుకు ప్రత్యామ్నాయమా అన్నట్టుగా భారత రాయబార కార్యాలయం కూడా స్పందించింది. దేశ సంస్కృతిలో భాగమైన, ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ పొందిన యోగాను అమెరికా పౌరులకు ఉచితంగా అందించాలని నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీ నుంచి భారత రాయబార కార్యాలయానికి చెందిన ఫేస్‌బుక్ పేజీలో సాయంత్రం ఐదు గంటలకు యోగా తరగతులు ప్రసారమవుతాయి. కరోనా వైరస్ విషయంలో అక్కడి ప్రజలు భయాందోళనకు గురికాకుండా యోగా, మెడిటేషన్ ఎంతో దోహదపడతాయని అమెరికాలోని భారత రాయబారి తరంజిత్ సింగ్ వ్యాఖ్యానించారు.

### కొసమెరుపు:

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్వాకంతో ఒళ్లుమండిన పలువురు నెటిజన్లు ఆయనపై దాడి చేస్తున్నారు. ఒక సమావేశంలో మాట్లాడుతూ తూలిపడబోయిన ట్రంప్‌ను ఇతరులు పట్టుకుని తీసుకువెళ్లిన వీడియోను షేర్ చేస్తూ.. ట్రంప్ కూడా కరోనా వైరస్ సోకిందనీ అందుకే అలా స్పృహ కోల్పోయారంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి శు.పంచమి రా.10.06 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం కృత్తిక ప.12.11 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం తె.5.02 నుంచి 6.44 వరకు (తెల్లవారితే సోమవారం), దుర్ముహూర్తం సా.4.32 నుంచి 5.20 వరకు, అమృతఘడియలు... ఉ.9.34 నుంచి 11.18 వరకు. సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.08, రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 29-3-2020


రామాయణం సీరియల్‌లోని దృశ్యం

**ప్రపంచమంతా కరోనా కల్లోలం కారణంగా ఇంటి గడపదాటని స్థితి. ప్రధాని పిలుపుతో లాక్‌డౌన్ వల్ల ప్రజలందరితో పాటు సెలబ్రిటీలు సైతం సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లిపోయారు. ఈ సమయంలో ఓ ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. దూరదర్శన్ ఛానెల్ 32 ఏళ్లకిందట ప్రసారం చేసిన 'రామాయణ్' సీరియల్‌ని మళ్లీ ప్రసారం చేస్తోంది. దీంతో పెద్దవాళ్లు, సెలబ్రిటీలు రామాయణాన్ని టీవీలో తిలకిస్తూ తమ బాల్యస్మృతులను నెమరేసుకుంటున్నారు. 'భారతీయ ఇతిహాసాలు పిల్లలు తెలుసుకోవడానికి ఇది ఓ గొప్ప మార్గం' అంటూ పలువురు సెలబ్రిటీలు సోషల్‌మీడియా ద్వారా అభిప్రాయాలను పంచుకుంటున్నారు. సీరియల్ చూస్తూ ఫొటోలు తీసుకొని వాటిని ఆనందంగా షేర్ చేసుకుంటున్నారు.**

# థ్యాంక్స్ మోదీ... థ్యాంక్స్ డీడీ

## దూరదర్శన్ ఛానెల్‌లో మళ్లీ ప్రారంభమైన రామాయణం

**రోజూ 2 ఎపిసోడ్లు**

రామాయణ్ ధారావాహిక ఈ శనివారం (28–03–2020) ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మొదటి ఎపిసోడ్‌తో దూరదర్శన్‌లో మళ్లీ ప్రారంభమైంది. తిరిగి రాత్రి 9 నుంచి 10 గంటల వరకు మరో ఎపిసోడ్‌ను ప్రసారం చేసింది. 'ప్రజల డిమాండ్ మేరకు రామాయణం సీరియల్‌ను పునఃప్రసారం' చేస్తున్నట్టు సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ శుక్రవారం ప్రకటించారు. దీంతో చాలామంది సోషల్ మీడియా ద్వారా ప్రధాని మోదీకి, దూరదర్శన్ ఛానెల్‌కు 'థ్యాంక్స్ మోదీ... థ్యాంక్స్ డీడీ' అంటూ ధన్యవాదాలు చెబుతున్నారు.


డీడీ1లో ప్రసారమవుతున్న 'రామాయణ్' సీరియల్ చూస్తూ, సోషల్‌మీడియాలో ఫొటోలు షేర్ చేసుకుంటున్నారు

**అప్పట్లో ఎక్కడివారక్కడే..**

జనవరి 25, 1987లో 30 నిమిషాల నిడివితో 78 ఎపిసోడ్లతో మొదటిసారి దూదర్శన్‌లో రామాయణం ప్రసారమైంది. అప్పట్లో ఇది టీవీలో ఓ విప్లవం. ఈ సీరియల్ వచ్చే సమయంలో ప్రజారవాణా సదుపాయాలన్నీ స్తంభించిపోయేవి. రైళ్లు, బస్సులు, ఇంటర్ సిటీ ట్రక్కులు.. జనం లేక వెలవెలబోయేవి. ఊళ్లలో సమూహాలుగా టీవీ సెట్స్ ముందు చేరిపోయేవారు. టీవీల ముందు కొబ్బరికాయలు కొట్టి, అగరొత్తులు వెలిగించేవారు. పువ్వులు జల్లి నీరాజనాలు సమర్పించేవారు. నిజానికి ఇది ఒక కార్యక్రమమే. కానీ పిల్లా జెల్లాతో కలిసి కుటుంబం అంతా ఈ సిరియల్‌ని చూసింది. సీరియల్ పూర్తయ్యాక సత్యమే పలకాలనే వాగ్దానాలు చేసుకునేవారు. పిల్లలు ఇంటి గడప దాటి బయటకు వెళ్లాలన్నా తల్లిదండ్రుల పర్మిషన్ తీసుకునేవారు. రామాయణంతో టీవీ అలా ప్రతి ఒక్కరినీ కథలో లీనమయ్యేలా చేస్తూ జీవన విలువలనే ధ్యేయంగా విద్యాభ్యాసం చేయించింది.

ముప్పై రెండేళ్ల క్రితం ప్రతి ఆదివారం ఉదయం వేళ కర్ఫ్యూ వాతావరణాన్ని సృష్టించిన రామాయణం ఇప్పుడు కర్ఫ్యూ వాతావరణంలో మళ్లీ బుల్లితెర మీదకు వచ్చేసింది. రామనవమి వస్తున్న ఈ తరుణంలో రామాయణం మళ్లీ వీక్షించడం మహద్భాగ్యంగా చెప్పుకుంటున్నారు జనం.

పాలసంద్రం నుంచి పట్టాభిషేకం దాకా!

'శాంతాకారం భుజగ శయనం
పద్మనాభం సురేశం
విశ్వాధారం గగన సదృశం
మేఘవర్ణం శుభాంగం..'

పాల సముద్రం మీద శేష శయనుడైన నారాయణుడు, పాదాలు వత్తుతూ లక్ష్మీదేవి. బ్రహ్మాది దేవతలంతా స్తుతిస్తున్న సన్నివేశంతో రామాయణం మొదలవుతుంది. యోగనిద్రలో ఉన్న నారాయణుడు కనులు తెరిచి విషయం ఏంటని అడుగుతాడు. రావణాసురుడి ఆగడాలకు అంతు లేదు. అధర్మమే అంతటా ఉంది. పాప నాశనం చేసి, ధర్మ సంస్థాపన చేయండి అని వేడుకుంటారు దేవతలు. వరాలను దుర్వినియోగం చేస్తున్న రావణాసురుడిని నిలువరించాల్సిన అత్యావశ్యకం వచ్చింది చెపుతాడు శివుడు. సత్యమే గెలుస్తుందని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సూర్యచంద్రులు ఉండేంతవరకు ఆ ధర్మం అందరికీ మార్గదర్శకం కావాలని కోరుకుంటారు. రావణుడి అహంకారాన్ని మట్టుపెట్టేందుకు తాను జన్మిస్తానని వరమిస్తాడు నారాయణుడు. 'సత్యమేవ జయతే' అంటారు దేవగణం. అక్కడి నుంచి.. రాముడు జననం, విద్యాభ్యాసం, వివాహం, వనవాసం మీదుగా కథ నడుస్తూ సీతాదేవి అపహరణ, రావణాసుర సంహారం, తిరిగి అయోధ్యనగర ప్రవేశం, పట్టాభిషేకంతో కథ ముగుస్తుంది.

**నిత్యవిద్యార్థి రామానంద సాగర్**

రామానంద సాగర్ దాదాపు వందేళ్ల క్రితం కశ్మీరీ ధనిక కుటుంబంలో పుట్టాడు. రచయితగా ఎన్నో మారు పేర్లతో రచనలు చేశాడు. ఒకానొక సమయంలో ముంబయ్‌కి అతని కుటుంబ వలస వచ్చింది. సినిమా మీద వ్యామోహంతో పృథ్వీ థియేటర్‌లో పృథ్వీరాజ్ కపూర్ దగ్గర అసిస్టెంట్‌గా చేరాడు. 1950లో సాగర్ ఆర్ట్స్ పేరుతో సొంత ప్రొడక్షన్ కంపెనీని నిర్మించాడు. పదుల సంఖ్యలో నామమాత్రపు సినిమాలు అతని ప్రొడక్షన్‌లో వచ్చాయి. ఆ తర్వాత అతని దశ, దిశ మార్చింది మాత్రం చిన్నతెరనే. అంతకాలం అతనొక విద్యార్థి. రామాయణంతో అతనిలోని మేధావి ప్రపంచానికి కనిపించాడు. తనలో సాంకేతిక పరిజ్ఞానం ఏ మాత్రం లేదని ఒప్పుకున్న సాగర్ రామాయణాన్ని బుల్లితెర మీద చూపించడంలో అపారప్రతిభను కనబరిచాడని అంతా చెబుతుంటారు.

**తులసీదాస్ రామాయణమే మూలం**

రామానంద సాగర్ తులసీదాస్ రామాయణంలోని కథను తన సీరియల్‌కి ఎంచుకున్నాడు. రామరాజ్య స్థాపనకు ముందు రాముడి జీవితాన్ని ఇందులో తీసుకున్నారు. రాముడు తిరిగి అయోధ్యను చేరుకోవడం, పట్టాభిషేకంతో కథ ముగుస్తుంది. చివరలో సీతను రాముడు వదిలేయడం, లవకుశల అంశాలతో కూడిన ఉత్తర రామాయణ్ తీసుకోలేదు. 'చాలా మంది రచయితలు రాముడు సీతను వదిలేసినట్టు రాశారు. 'కానీ, నా రాముడు అలా కాదు అనేవాడు నాన్న. ఆ తర్వాత ప్రత్యేకంగా లవ–కుశ సీరియల్ తీయాలనుకున్నాడు. కానీ, అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది' అని చెప్పారు ఓ ఇంటర్వ్యూలో రామానంద్ సాగర్ తనయుడు ప్రేమ్ సాగర్. భారత దేశంలో పౌరాణిక ఇతివృత్తంతో సీరియల్స్ రూపొందించడానికి రామాయణం ఒక మాధ్యమంగా సాగింది.

**జీవించిన నటీనటులు**

రామ పాత్రధారి అరుణ్‌గోవిల్ గళం ఈ సీరియల్‌కే పెద్ద ఎస్సెట్. ప్రశాంత చిత్తం. మృదువైన మాట. అతను మాట్లాడుతుంటే వినేవారి చెవులు ఆసక్తితో రిక్కించుకుని వింటాయి. ఇక ఇప్పటి వరకు వచ్చిన సీత క్యారెక్టర్లలో ఎవరు ది బెస్ట్ అని కళ్లు మూసుకొని వెతికినా దీపికా చికాలియా రూపం కళ్లముందు నిలుస్తుంది. కళ్లతో ఆమె పలికించిన భావాలు మనసు నుంచి చెదిరిపోవు. ఇప్పటికి వచ్చిన రామాయణ్ సీరిస్‌లో హనుమాన్ పాత్ర ధారులను గమనిస్తే హనుమాన్‌గా నటించిన ధారా సింగ్ అపరమేధావిలా కనిపిస్తాడు. హనుమాన్ అంటే ధారాసింగ్ మాత్రమే అనేలా మెప్పించాడు. ఇక రాముడికి దీటుగా రావణుడి పాత్రకోసమే పుట్టాడేమో అనిపించేలా అరవింద్ త్రివేది కనిపిస్తారు.

**మరింత అందంగా!**

మూడు దశాబ్దాల క్రితమే కోటి రూపాయల బడ్జెట్‌తో తీసిన ఈ సీరియల్ పాత్రదారులకు బ్రైట్ కలర్ కాస్ట్యూమ్స్ వాడారు. మన దేశ ప్రజలకు అప్పుడప్పుడే కలర్ టెలివిజన్ చేరవవుతుంది. ఈ చిన్న తెరమీద గులాబీ, నీలం, పసుపు, ఎరుపు రంగులతో షోని బ్లాస్ట్ చేశాడు దర్శకుడు. ఇప్పుడు మనంటి గోడ మీద టీవీగా స్థానం సంపాదించుకున్న టీవీలో రామాయణం వర్ణాలన్నీ మరింత క్లారిటీగా వీక్షించవచ్చు.

**రికార్డులు**

ఇండియన్ టీవీలో మొట్టమొదటి బ్లాక్ బస్టర్, అత్యంత ఎక్కువ ప్రజాదరణ పొందిన పౌరాణిక షో గా రామాయణం వరల్డ్ లిమ్కా బుక్ రికార్డ్స్‌లో చోటు చేసుకుంది. ఆ తర్వాత వచ్చిన రామాయణాలకు రామానంద్ సాగర్ రామాయణమే పెద్ద బాలశిక్ష అయ్యింది.

– నిర్మలారెడ్డి

కరోనా హీరో అలోక్ దేవ్

# సాఫ్ కరోనా

ఒక అవసరం... ఒక కొత్త ఆవిష్కరణకు దారి తీస్తే దేశం అభివృద్ధిలో ముందడుగు వేస్తుంది. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్... ప్రతి ఒక్కరికీ చేతులు కడుక్కోవడం అలవాటు చేస్తోంది. ఇంత వరకు అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితమై ఉన్న శానిటైజర్ వాడకం ఇప్పుడు పేద దేశాలకు కూడా అలవాటవుతోంది. మారుమూల గ్రామాలకు కూడా చేరుతోంది. ఈ పరిణామాలను గమనించిన పదేళ్ల కుర్రాడు అలోక్‌దేవ్ మరికొంత అడ్వాన్స్‌డ్‌గా ఆలోచించాడు. పబ్లిక్ ప్రదేశాల్లో ఒక శానిటైజర్ బాటిల్‌ను ఎంతమంది వాడతారు? దాదాపు వందమంది ఉపయోగిస్తారు. శానిటైజర్ అరచేతిలో వేసుకోవడానికి ప్రతి ఒక్కరూ బాటిల్‌ని ప్రెస్ చేయాల్సిందే. అన్ని చేతులు బాటిల్‌ని తాకకుండా శానిటైజర్ చేతిలోకి వంపుకునే టెక్నాలజీ ఉంటే ఎలా ఉంటుంది... అనుకున్నాడు అలోక్ దేవ్. మినీ హ్యాండ్ శానిటైజింగ్ రోబోకు రూపకల్పన చేశాడు.

అలోక్ దేవ్... కేరళ రాష్ట్రం, గోవిందపురం కేంద్రీయ విద్యాలయలో నాలుగో తరగతి చదువుతున్నాడు. అలోక్‌కి రోబోలంటే ఏడేళ్ల వయసు నుంచే చాలా ఇష్టం. అలోక్ ఆసక్తిని గమనించి వాళ్ల తల్లిదండ్రులు రోబోటిక్స్‌లో కోచింగ్ ఇప్పించారు. అలోక్‌కు రోబోలంటే ఇష్టం ఉండడంతోపాటు తాముండే ఇంటికి దగ్గరలోనే రోబోటిక్స్ గురించి నేర్పించే 'రోబోటెక్ ఎడ్యుసెంటర్' ఉండడం వల్ల కోచింగ్ ఇప్పించడం సులువైందని చెప్పారు అలోక్ అమ్మానాన్న పూర్ణిమ, దానిష్. ''అలోక్ ఆటలు కూడా రోబోటిక్స్ చుట్టూనే ఉండేవి. ఇప్పుడు స్కూళ్లకు సెలవులు కావడంతో అలోక్ రోజంతా ఇంట్లోనే ఉంటున్నాడు. హ్యాండ్ వాష్ ఆవశ్యకత గురించి ప్రముఖులందరూ టీవీల్లో తెలియచేయడాన్ని చూసి తన బుర్రలో మెరిసిన ఆలోచనకు ఇలా రూపమిచ్చాడు'' అన్నారు పూర్ణిమ.

ఉతికిన దుస్తులను మడత పెట్టే రోబోను తయారు చేయడం తన తదుపరి ఆవిష్కరణ అని అలోక్ చెబుతున్నాడని, రోబోటిక్స్ సైంటిస్టును అవుతానని చెబుతుంటాడని నవ్వుతూ చెప్పారు పూర్ణిమ.

– మంజీర



**సెన్స్‌తో పని చేస్తుంది**

అలోక్ తయారు చేసిన హ్యాండ్ వాష్ రోబో సెన్సార్‌ల ఆధారంగా పని చేస్తుంది. శానిటైజర్ కోసం చేతులు చాచిన వెంటనే సెన్సార్ గ్రహించి శానిటైజర్ బాటిల్ మీద ఒత్తిడి కలిగించడంతో శానిటైజర్ లిక్విడ్ చేతుల్లో పడుతుంది. నీళ్ల కోసం ట్యాప్ తిప్పాల్సిన అవసరం లేకుండా దోసిలి పట్టగానే నీళ్లు పడ్డట్లుగానే ఇది కూడా. ఈ టెక్నాలజీ... శానిటైజర్ బాటిళ్లకే పరిమితం కాదని హ్యాండ్ వాష్ లిక్విడ్‌లకు కూడా ఉపయోగించవచ్చని చెప్పాడు అలోక్. ఈ చిన్న యంత్రాన్ని ఎక్కడికి కావాలంటే అక్కడికి సులువుగా తీసుకెళ్లవచ్చు.

ధార్మికం

# ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే..?



● ప్రతిరోజు ఉదయించే సూర్యుని ముందు నిల్చొని, ఆదిత్యహృదయం చదవాలి. శాస్త్ర పద్ధతిలో సూర్యనమస్కారాలు కూడా చేస్తే మంచిది ● వాల్మీకి రామాయణం యుద్ధ కాండలోని యాభై తొమ్మిదవ సర్గ పారాయణం చేయాలి. ఇది మనలోని అహంకారాన్ని, అంతః శత్రువులను తగ్గిస్తుంది. ఆరోగ్యాన్నిస్తుంది ● మన కర్మ ఫలాలను, ప్రధానంగా అనారోగ్యాలను నియంత్రించే ఆదేశాలను భగవంతుడు నరసింహ దివ్యరూపంలో సుదర్శనుల వారికి కటాక్షిస్తాడని ప్రసిద్ధి. అందువల్ల వారికి ప్రీతి కలిగించే సుదర్శన శతకం, సుదర్శనాష్టకం, నృసింహాష్టకం, లక్ష్మీనరసింహ అష్టోత్తర శతనామావళి పారాయణం అర్చన చేయడం మంచిది ● అనారోగ్యాన్ని దూరం చేయడానికి ధన్వంతరి అష్టోత్తర శతనామం పారాయణం సత్ఫలితానిస్తుంది ● అంటువ్యాధులు ప్రబలినప్పుడు శీతలాష్టకం చదవడం వల్ల సత్ఫలితాలుంటాయని పెద్దలు చెబుతారు.

ఇస్లాం వెలుగు

# యా అల్లాహ్! 'కరోనా' కో దూర్ కరోనా!

ఒకసారి ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) మదీనా నుండి బయలుదేరి సహచరులతో కలసి సిరియా వెళుతున్నారు. మార్గమధ్యంలో హజ్రత్ అబూ ఉబైదా (ర) తన సహచరులతో వచ్చి హజ్రత్ ఉమర్ గారిని కలిశారు. సిరియాలో ఏదో అంటువ్యాధి ప్రబలి ఉందని వెల్లడించారు. దీంతో ఖలీఫా హజ్రత్ ఉమర్ (ర) కొంతమంది ముహాజిర్లను పిలిపించి సలహా అడిగారు. వారు, వచ్చిన పని పూర్తి కాకుండా ఎలా వెళతారు? ముందుకే వెళ్ళండి అని సలహా ఇచ్చారు. తరువాత ఆయన వారిని పంపించి వేసి, కొంతమంది అన్సార్లను పిలిపించి వారిని కూడా ఇదే సలహా అడిగారు. వారు కూడా దాదాపుగా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తరువాత ఆయన మక్కా ఖురైషీయుల్లోని వృద్ధులను పిలిపించారు. సిరియాలో నెలకొన్న పరిస్థితుల్ని వారికి వివరించి సలహా అడిగారు. దానికి వారు, 'అంటువ్యాధి ప్రబలి ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రజలతో కలసి మీరు సిరియా వెళ్ళడం సమంజసం కాదు. మీరు వెనుదిరిగి మదీనా వెళ్ళిపోవడమే శ్రేయస్కరం' అని సలహా ఇచ్చారు. దీంతో హజ్రత్ ఉమర్ (ర) వెనుదిరిగి వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు.



అంతలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర) ఎటో వెళుతూ అక్కడికొచ్చారు. కుశల ప్రశ్నల తరువాత, విషయం తెలుసుకొని, ఈ సమస్యకు తన దగ్గర జ్ఞానంతో కూడుకున్న సరైన సమాధానం ఉందన్నారు. ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలినప్పుడు స్వయంగా ముహమ్మద్ ప్రవక్త (స) ఇలా ఉపదేశించేవారు: 'ఏదైనా ప్రదేశంలో అంటువ్యాధులు ప్రబలటం మొదలైతే మీరు ఆ ప్రదేశానికి వెళ్ళకండి. ఒకవేళ మీరు ఉన్న ప్రదేశంలో గనుక అంటువ్యాధులు ప్రబలితే మీరు మీ ప్రదేశాన్ని విడిచి ఎటూ వెళ్ళకండి' అని. అంటే, లాక్ డౌన్ ఆదేశం జారీ చేశారన్నమాట.

అంటువ్యాధులు ప్రబలినప్పుడు మనం చేయవలసిన మానవ ప్రయత్నం ఏమిటో ఆయన చాలా స్పష్టంగా వివరించారు. ఈ ప్రవచనాల వెలుగులో చూసినప్పుడు, ప్రజలెవ్వరూ ఇళ్ళలోంచి బయటికి రావద్దని, సామూహిక నమాజులకు సైతం మస్జిదులకు వెళ్ళవద్దని, నమాజులు ఇళ్ళలోనే ఆచరించాలని, కనీసం జుమ్మా నమాజుకు కూడా మస్జిద్‌లకు వెళ్ళవద్దని, ఈ విషయంలో ప్రభుత్వ సూచనలను తు. చ తప్పకుండా పాటించాలని ఇస్లామిక్ జాతీయ షరియా కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంలోని వివేకం, హేతుబద్ధత, దూరదృష్టి మనకు ఇట్టే అర్థమవుతుంది. కరోనా వంటి మహమ్మారి ప్రబలుతున్న ఈ క్రమంలో ఇళ్ళలోనే ప్రార్థనలు ఆచరించడంలో ఎలాంటి దోషమూ లేదు.

స్వయంగా ప్రవక్త కాలంలో కూడా ఇలా జరిగేది.

అల్లాహ్‌కు అన్నీ తెలుసు. ఆపదలు పంపేవాడూ ఆయనే.. వాటిని తొలగించేవాడూ ఆయనే.. మానవులారా.. ఇప్పటికైనా మేల్కొండి. అని చెప్పడానికే ఈ పరీక్షలు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

కరోనా కథలు

కరోనా భయంతో ఊరంతా నిర్మానుష్య వాతావరణం. కాలనీ మధ్యలో ఉన్న పార్కు బెంచీమీద ఒక బిచ్చగాడు కడుపులో కాళ్ళు పెట్టుకొని ముడుచుకొని పడుకున్నాడు. అతనికి ఆకలితో పేగులు మెలిపెడుతున్నాయి. నోరు ఆర్చుకు పోతోంది. జన సంచారం లేకపోవడంతో ఎక్కడా తిండి దొరకలేదు.

పార్కు ఎదురు అపార్టుమెంటు ఫ్లాటులో ఉన్న రామేశం యధాలాపంగా బాల్కనీలోంచి పార్కువైపుకి చూసాడు. పార్కులో మునగదీసుకున్న బిచ్చగాడు కనిపించాడు. అతడి పరిస్థితి అర్థం అయ్యిందతనికి. ఇంతలో శ్రీమతి మాటలు వినిపించాయి. 'దిక్కుమాలిన ఈ కరోనా వలన పనిమనిషి రావడం లేదు, ఎన్నాళ్ళో ఇలా! పనంతా చేయలేక ఛస్తున్నాను ''రండి భోజనం చేద్దురుగాని. ఇక్కడేం చేస్తున్నారు?'' అంటూ

# ఆరగింపు

వాసంతి బాల్కనీలోకి వచ్చింది. ''ఏం లేదు! నడు'' అంటూ భోజనానికి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. తింటున్నాడేగాని అతని మనస్సు ఆ బిచ్చగాడి మీదే ఉంది.

''ఏంటి పరధ్యానం?'' అని అడిగింది వాసంతి.

''అన్నం ఏమైనా మిగుల్తుందా?'' అడిగాడు రామేశం.

''ఆ! నాకు పనిమనిషి తింటుందని నాలుగు గింజలు ఎక్కువ పోయడం అలవాటు కదా! ఈ రోజు కూడా పోసేసాను. మనిద్దరం తినగా ఇంత మిగిలింది'' అని గిన్నె చూపించింది. రమేశం గబగబ అది ప్లేటులో పెట్టుకుని, కాస్త మజ్జిగా, నీళ్ళబాటిల్, అడుగున మిగిలిన కాస్త పప్పు, కూర పట్టుకుని 'ఎక్కడికండీ అని వాసంతి పిలుస్తున్నా సమాధానం చెప్పకుండా రోడ్డుమీదకు పరుగెత్తాడు. పార్కులో ఉన్న అతనిని దూరం నుంచే గట్టిగా పిలిచి, పళ్లెం అక్కడ పెట్టి. అతను ఆబగా తింటూంటే తృప్తిగా నిట్టూర్చి వెనుదిరిగాడు. బాల్కనీలోంచి వాసంతి కూడా గమనించి, ఎన్ని అవాంతరాలొచ్చినా మనిషికి ఆకలి మాత్రం ఆగదు, దాని పని అది చేసుకుపోతుంది కదా! అని ఆర్ద్రమైన కళ్ళని తుడుచుకుంది.

రామేశానికి మాత్రం దేవుడికి ఆరగింపు చేసినట్లనిపించింది.



– వాగంటి ప్రసాద్

జయహో

# భారతీ తీర్థ చరణమాశ్రయే

పతనావస్థలో ఉన్న భారతీయ సనాతన ధర్మాన్ని పరిరక్షించి ప్రజలందరినీ ఒక్క తాటి మీద నడిపించడం కోసం భారతదేశం నలుమూలలా నాలుగు పరమ పీఠాలను స్థాపించారు జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు. వాటిలో ఒకటి కర్ణాటక రాష్ట్రం చిక్‌మగళూర్ జిల్లాలోని శ్రీశృంగేరీ శారదాపీఠం. ఈ పీఠానికి మొట్టమొదటి అధిపతి శ్రీశ్రీశ్రీ సురేశ్వరాచార్య కాగా ప్రస్తుతం శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి 36వ అధిపతి.

జగద్గురు ఆదిశంకరులు ఏ లక్ష్యం కోసమైతే ఆ పీఠాలను స్థాపించారో అక్షరాలా అందుకు అనుగుణంగా వర్తిస్తున్న వారు శ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు. ఆయన మోములో ప్రశాంతత, కన్నులలో కరుణ, పలుకులో ప్రసన్నత ఉట్టిపడుతుంటాయి. ఆయన అనుగ్రహ భాషణం చేస్తుంటే అమృతపు జల్లు కురిసినట్లనిపిస్తుంది.

**జగద్గురువు జీవితంలో ముఖ్యఘట్టాలు**

గుంటూరుజిల్లా పలనాడు తాలూకా అలుగుమల్లెపాడు అగ్రహారానికి చెందిన తంగిరాల వేంకటేశ్వరావధాని, అనంత లక్ష్మమ్మ దంపతుల నోముల పంటగా శ్రీ ఖరనామ సంవత్సరం చైత్ర శుద్ధ పంచమినాడు జన్మించిన సీతారామాంజనేయులు పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా శ్రీ మదభినవ విద్యాతీర్థుల నుంచి 'భారతీతీర్థ' అనే దీక్షానామాన్ని పొంది, శృంగేరీ పీఠానికి ఉత్తరాధికారి అయ్యారు. శృంగేరీ మఠ సంప్రదాయం ప్రకారం తమ గురువులతోపాటు భారతదేశమంతటా సంచరిస్తూ, వారి అడుగుజాడల్లో నడుస్తూ ధర్మప్రచారం చేశారు. ప్రస్తుతం భారతీ తీర్థులవారు పీఠాధిపతి కాగా, శ్రీ విధుశేఖర భారతీ స్వామి వారు ఉత్తరాధికారిగా ఉన్నారు.

**ఆదర్శ పీఠాధిపతి...**

మఠ సంప్రదాయానుసారం 1989 అక్టోబర్ 19న 36వ పీఠాధిపతిగా శ్రీ శారదా పీఠంలో వ్యాఖ్యాన సింహాసనాన్ని అధిరోహించిన శ్రీ భారతీతీర్థ మహాస్వాములవారు అచిరకాలంలోనే ఆదర్శమూర్తిగా ఖ్యాతిగాంచారు. తన పూర్వ పీఠాధిపతి శ్రీ చరణులవారి ఆశయాలను సఫలం చేయడమే జీవిత పరమ



లక్ష్యంగా పెట్టుకున్నారు. శృంగేరిలోనూ, చుట్టుపక్కల నివసించేవారికి వైద్యసౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో తమ గురువులు స్థాపించిన శారదా ధన్వంతరీ వైద్యశాల అన్ని విధాల అత్యాధునికమైన వైద్యశాల అయ్యేటట్లు చేశారు. శృంగేరికి వచ్చే భక్తులకు, యాత్రీకులందరికీ ప్రసాద రూపంగా ఉచిత భోజన వ్యవస్థను ఏర్పాటు చేయించారు. మఠాన్ని కేవలం ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలను కూడా వేదికగా తీర్చిదిద్దారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆపన్నులను ఆదుకోవటమే పరమావధిగా పాటుపడుతున్నారు. వారి ఆధ్వర్యంలో ఈ పీఠం దేశం నలుమూలలా శతాధిక శాఖలతో విస్తరించడం ముదావహం.

**జగద్గురు బోధలు**

బాలలు, యువత క్రమశిక్షణను ఎప్పుడూ కోల్పోకూడదనీ, స్వధర్మాన్ని నిలబెట్టుకోవడం వల్లనే సనాతన ధర్మం పదికాలాల పాటు నిలబడుతుందంటారు. యువత ఎప్పుడూ అదుపు తప్పి ప్రవర్తించకూడదు. అందుకు బాల్యంలోనే బీజాలు పడాలంటారు. ప్రస్తుతం ప్రపంచమంతటా కరోనా వైరస్ గుప్పిటలో ఇరుక్కుని పాఠశాలలు, కార్యాలయాలకు సెలవులు రావడం వల్ల పిల్లలు, పెద్దలు అందరూ ఇంటిలోనే ఉంటున్నారని, ఈ సమయంలో పెద్దలు పిల్లలను దగ్గర కూర్చుండ బెట్టుకుని వారికి రకరకాల నైతిక, పౌరాణిక కథలను చెప్పడం, వారికి మన దేశ ఘనవారసత్వాన్ని, సాంస్కృతిక విలువలను బోధించడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుందంటారు.

పరిశుభ్రమైన, క్రమబద్ధమైన జీవితాన్ని గడపడానికి ఈ సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్తశుద్ధితో, నమ్మకంతో చేసే ప్రార్థనలు, పాటించే ఆచార సంప్రదాయాలతో మానసిక దృఢత్వాన్ని పొందవచ్చునంటారు శ్రీస్వామివారు. ఇటువంటి గురువుల అడుగుజాడలలో నడుస్తూ వారు బోధించే సనాతన సంప్రదాయాలను అనుసరించడమే వారికి మనం చెల్లించే గురుదక్షిణ.

– డి.వి.ఆర్.

*(రేపు భారతీ తీర్థుల 70వ వర్ధంతి. సన్యాస దీక్ష స్వీకరించిన అనంతరం జయంతిని వర్ధంతిగా జరుపుకోవడం శృంగేరీ సంప్రదాయం)*

epaper.sakshi.com

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
29-3-2020

## ప్రధానమంత్రి సహాయనిధికి బీసీసీఐ విరాళం రూ. 51 కోట్లు

కోవిడ్-19పై పోరాటానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ముందుకొచ్చింది. ప్రధానమంత్రి సహాయనిధికి తమ వంతుగా రూ. 51 కోట్లు విరాళం ఇస్తున్నట్లు శనివారం ప్రకటించింది. మరోవైపు భారత క్రికెటర్ సురేశ్ రైనా రూ. 52 లక్షలను విరాళంగా ప్రకటించాడు. ఇందులో రూ. 31 లక్షలు పీఎం-కేర్స్ నిధికి... రూ. 21 లక్షలు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇస్తాడు. ఇప్పటి వరకు విరాళాలు ప్రకటించిన భారత క్రీడాకారుల్లో సురేశ్ రైనాదే అత్యధిక మొత్తం కావడం విశేషం. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ శుక్రవారం రూ. 50 లక్షలు విరాళం ప్రకటించాడు.

# ఆటగాళ్లూ... మీ స్థానాలు భద్రం

## 'టోక్యో' బెర్తులపై ఐఓసీ స్పష్టత

**టోక్యో:** కరోనా కారణంగా టోక్యో ఒలింపిక్స్ వచ్చే ఏడాదికి వాయిదా పడటంతో ఒలింపిక్స్ బెర్తులపై ఆటగాళ్లలో నెలకొన్న సందేహాలపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధికారులు స్పష్టత ఇచ్చారు. అర్హత టోర్నీల ద్వారా ఇప్పటికే ఒలింపిక్స్ బెర్తులు సాధించిన 6,200 మంది అథ్లెట్ల స్థానానికి ఢోకా లేదని తెలిపారు. వారు వచ్చే ఏడాది జరుగనున్న ఒలింపిక్స్‌లో నేరుగా పాల్గొంటారని స్పష్టం చేశారు. ఐఓసీ నిర్ణయంపై అన్ని అంతర్జాతీయ క్రీడా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రపంచ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. 'ఇప్పటికే టోక్యోకు అర్హత సాధించిన అథ్లెట్లను నేరుగా వచ్చే ఏడాది గేమ్స్‌లో అనుమతించడం హర్షించదగిన అంశం. ఇంకా మిగిలి ఉన్న స్థానాల కోసం సరైన పద్ధతిని అనుసరించి అర్హత టోర్నీలు నిర్వహించాలి' అని ఆయన అన్నారు. కరోనా కారణంగా ఆటలన్నీ రద్దు కాకముందే మారథాన్, స్విమ్మింగ్, ఇతర క్రీడా ఈవెంట్‌లలో ఒలింపిక్స్ అర్హత టోర్నీలు జరుగగా వందలాది మంది అథ్లెట్లు టోక్యో బెర్తులు కైవసం చేసుకున్నారు. అనూహ్యంగా విశ్వక్రీడలు వాయిదా పడటంతో వారి కోటాలపై ఆటగాళ్లలో ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు సగం బెర్తులే ఖరారు కాగా... మిగిలిన స్థానాలను ఎలా భర్తీ చేస్తారనే అంశాన్ని ఇంకా నిర్ణయించాల్సి ఉంది.

## దక్షిణాఫ్రికా నుంచి అమెరికాకు...

### సఫారీ క్రికెటర్ డేన్ పీట్ అనూహ్య నిర్ణయం



**జోహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ డేన్ పీట్ అనూహ్య నిర్ణయంతో ఆశ్చర్యపరిచాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సభ్యదేశమైన దక్షిణాఫ్రికా జట్టును వదిలి అసోసియేట్ టీమ్ అమెరికాతో జతకట్టేందుకు సిద్ధమయ్యాడు. శనివారం ఉదయమే ఈ ఒప్పందానికి సంబంధించిన కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయని అతను ట్విట్టర్ వేదికగా ప్రకటించాడు. 'ఈ రోజు ఉదయం కాంట్రాక్ట్‌పై సంతకం చేశా. చాలా కఠినమైన నిర్ణయమే అయినప్పటికీ... ఇది నాకో మంచి అవకాశం. ఆర్థికంగానూ, జీవనశైలి పరంగానూ నాకు ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే దీన్ని వదులుకోలేకపోయాను. పైగా గతేడాది అమెరికాకు వన్డే జట్టు హోదా దక్కింది. ఇంకా ఆలోచించడానికి ఏముంది? దక్షిణాఫ్రికా వన్డే తుది జట్టులో తనకు చోటు దక్కే అవకాశాలు అతి స్వల్పంగా ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను ' అని పీట్ వ్యాఖ్యానించాడు. ఈ వేసవిలో ప్రారంభం కానున్న ' మైనర్ లీగ్ టి20 టోర్నమెంట్' నుంచి అతను అమెరికా తరపున తన ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు. 2014లో సఫారీ జట్టు తరపున అరంగేట్రం చేసిన పీట్ తొమ్మిది టెస్టుల్లో 26 వికెట్లు దక్కించుకున్నాడు.



# ఇలాంటి 'విశ్రాంతి' కావాల్సిందే!

**చాలా మంది ఆటగాళ్లు అలసిపోయారు**
- జట్టుకు కోహ్లినే 'బాస్'
- భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రవిశాస్త్రి మనోగతం

**ముంబై:** కరోనా కారణంగా ప్రపంచ క్రీడారంగం మొత్తం స్తంభించిపోయింది. ఎక్కడా ఎలాంటి ఈవెంట్లు లేకపోవడంతో ఆటగాళ్లంతా ఇళ్లకే పరిమితమయ్యారు. భారత్‌లోనైతే లాక్‌డౌన్ కూడా అమల్లో ఉంది కాబట్టి మన క్రికెటర్లకు మరో ప్రత్యామ్నాయం కూడా లేదు. అయితే ఈ విరామం మన ఆటగాళ్ల మంచికేనని జట్టు హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. కారణం కరోనానే అయినా సరైన సమయంలో తమ జట్టుకు తగిన విశ్రాంతి లభించిందని అతను అన్నాడు. 'ఈ విశ్రాంతి వల్ల ఇబ్బంది లేదని నా అభిప్రాయం. ఎందుకంటే న్యూజిలాండ్ పర్యటన చివరకు వచ్చేసరికి మన ఆటగాళ్లంతా శారీరకంగా, మానసికంగా కూడా బాగా అలసిపోయారు. వీటికి తోడు కొన్ని గాయాలు కూడా. కాబట్టి ఇది ఆటగాళ్లకు మేలు చేసేదే' అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. అయితే టీమిండియా సభ్యులు తాము పునరుత్తేజం పొందేందుకు ఈ సమయాన్ని వాడుకోవాలని సూచించాడు. 'గత పది నెలల కాలంలో భారత జట్టు చాలా ఎక్కువ క్రికెట్ ఆడింది. నాతోపాటు మరికొందరు ఆటగాళ్లు ప్రపంచ కప్ కోసం మే 23న ఇంగ్లండ్ బయల్దేరాం. అప్పటి నుంచి చూస్తే కేవలం 10–11 రోజులు మాత్రమే ఇంట్లో ఉండగలిగాం. కొందరు క్రికెటర్లు మూడు ఫార్మాట్‌లలోనూ ఆడుతున్నారు. వారి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. సుదీర్ఘ ప్రయాణాలు చేస్తూ టి20ల నుంచి టెస్టుల వరకు ఫార్మాట్‌లకు అనుగుణంగా తమను తాము మార్చుకోవడం అంత సులువు కాదు. కాబట్టి ఈ సమయంలో విరామం మంచిదే' అని భారత కోచ్ విశ్లేషించారు.

**అప్పుడే సందేహించాం...**

దేశంలో లాక్‌డౌన్‌లాంటిది జరగవచ్చని తాము కాస్త ముందుగానే అంచనాకు వచ్చామని, చివరకు అదే నిజమైందని శాస్త్రి చెప్పాడు. 'దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ సమయంలోనే రాబోయే ప్రమాదం గురించి మా మనసుల్లో శంక ఏర్పడింది. అప్పుడే కరోనా తీవ్రమవుతోంది. ఇక రెండో వన్డే రద్దు కాగానే పెద్ద నిర్ణయం తీసుకుంటారని అనుకున్నాం. నిజానికి న్యూజిలాండ్‌లో ఉన్నప్పుడే విమానాలు సింగపూర్ మీదుగా వెళుతున్నాయని తెలిసి పరిస్థితులు అదోలా అనిపించాయి. ఆ సమయంలో న్యూజిలాండ్‌లో రెండు కోవిడ్–19 కేసులు నమోదయ్యాయి. ఆలస్యం కాకుండా మేం సరైన సమయంలో భారత్‌లోకి అడుగుపెట్టగలిగాం. ఎందుకంటే మేం దిగిన రోజు నుంచే కరోనా గురించి ఎయిర్‌పోర్ట్‌లో స్క్రీనింగ్ పరీక్షలు మొదలయ్యాయి. ఇప్పుడు క్రికెటర్ల దృష్టిలో కూడా క్రికెట్ చివరి ప్రాధాన్యతాంశం మాత్రమే' అని ఈ మాజీ ఆటగాడు తమ అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు.

**కెప్టెన్‌వే అన్ని నిర్ణయాలు...**

భారత జట్టును నడపడంలో కెప్టెన్‌గా విరాట్ కోహ్లికే సర్వాధికారాలు ఉన్నాయని... కోచింగ్ సిబ్బంది అతనికి సహాయకారిగా మాత్రమే ఉంటారని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మొదటి నుంచి కూడా క్రికెట్‌లో కెప్టెన్ మాట చెల్లాలనే విషయాన్ని తాను నమ్ముతానని కూడా అతను చెప్పాడు. 'కెప్టెన్ మాత్రం జట్టుకు 'బాస్'గా ఉంటాడు. ఇది నా గట్టి నమ్మకం. మైదానంలో ధైర్యంగా, సానుకూల ఆలోచనతో, దూకుడైన క్రికెట్ ఆడే విధంగా ఆటగాళ్లను బయటినుంచి సన్నద్ధం చేయడమే కోచింగ్ సిబ్బంది పని. నాయకుడు స్వయంగా ముందుండి జట్టును నడిపించాలి. అతని భారం కొంత తగ్గించేందుకు మేం ఉన్నాం కానీ బరిలోకి కెప్టెన్ సొంత నిర్ణయాలు తీసుకోవాలి. అతను అనుకున్నట్లుగా ఆటను నడిపించాలి' అని శాస్త్రి వ్యాఖ్యానించాడు. కోహ్లి తాను అద్భుతమైన ఫిట్‌నెస్‌తో జట్టుకు ఆదర్శంగా నిలిచాడని... ఈ క్రమంలో ఎంతో త్యాగం చేశాడని కూడా భారత కోచ్ అన్నాడు. 'నేను ఈ ఆటను ఆడాలంటే, పటిష్టమైన ప్రత్యర్థులతో తలపడాలంటే ప్రపంచంలోనే అత్యంత ఫిట్ క్రికెటర్‌గా ఉండాలి. అందుకోసం దేనికైనా సిద్ధమని అతను నాతో ఒక రోజు చెప్పాడు. కేవలం ట్రైనింగ్ మాత్రమే కాదు. ఇందుకోసం కోహ్లి ఎన్నో త్యాగాలు చేశాడు. తన డైట్‌లో మార్పులు చేసుకున్నాడు. అతను ఒక ప్రమాణం నెలకొల్పడంతో అందరూ దానిని ఆచరించాల్సిన పరిస్థితి వచ్చింది' అని రవిశాస్త్రి తన కెప్టెన్‌పై ప్రశంసలు కురిపించాడు.

# ధోని కోరిక తీరకపోవచ్చు!

## పునరాగమనంపై హర్షా భోగ్లే వ్యాఖ్య



**ముంబై:** 2019 వన్డే వరల్డ్ కప్ సెమీఫైనల్లో ఓటమి తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టని మాజీ కెప్టెన్ ఎమ్మెస్ ధోని ఐపీఎల్‌పై ఎంతో నమ్మకం పెట్టుకున్నాడు. ఐపీఎల్‌లో రాణిస్తే వచ్చే టి20 వరల్డ్‌కప్ ఆడే అవకాశాలు కూడా మెరుగయ్యేవి. సెలక్టర్లు కూడా పదే పదే ఇదే విషయాన్ని చెప్పారు. అయితే ఇప్పుడు కరోనా కారణంగా ఐపీఎల్ జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మళ్లీ భారత జట్టుకు ఆడాలనే అతని కోరిక నెరవేరకపోవచ్చని ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లే అభిప్రాయపడ్డాడు. ఇక జాతీయ జట్టు తరపున అతని కెరీర్ ముగిసినట్లేనని అతను వ్యాఖ్యానించాడు. 'ప్రస్తుతం ధోని ఆలోచనలు ఎలా ఉన్నాయో మనమే కాదు అతని నీడ కూడా చెప్పలేదు. అయితే టెస్టులకు గుడ్‌బై చెప్పినప్పుడు, కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు ఎలా వ్యవహరించాడో ఇప్పుడూ అదే చేస్తాడు. భారీ ఆర్బాటపు వీడ్కోలు మ్యాచ్ ఉండదు. ఇది నా గట్టి అభిప్రాయం. అసలు ధోని ఎప్పుడు తప్పుకున్నాడనే విషయం కూడా మనకు తెలీకుండా అతని కెరీర్ ముగిసిపోతుంది. కాబట్టి ప్రస్తుత స్థితిలో అతను భారత జట్టులోకి పునరాగమనం చేయడం కష్టం. ఇంకా ప్రపంచకప్ కోసం నవంబర్ వరకు, ఆ తర్వాతి వరకు వేచిచూసే పరిస్థితి లేదు. ఐపీఎల్ జరగకపోతే ఇక ఏమాత్రం సాధ్యం కాదు' అని భోగ్లే విశ్లేషించాడు.

## భారత షాట్‌పుట్ క్రీడాకారుడిపై నాలుగేళ్ల నిషేధం



**న్యూఢిల్లీ:** డోపింగ్ పరీక్షలో విఫలమైన భారత షాట్‌పుట్ క్రీడాకారుడు నవీన్ చికారాపై అంతర్జాతీయ అథ్లెటిక్స్ సంఘం (ఐఏఏఎఫ్) ఇంటెగ్రిటీ విభాగం నాలుగేళ్ల నిషేధాన్ని విధించింది. 2018 జూలైలో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిర్వహించిన డోపింగ్ పరీక్షలో నవీన్ విఫలమైనట్లు ఐఏఏఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. దాంతో అతనిపై నిషేధం జూలై 27, 2018 నుంచి అమలులోకి వస్తుందంటూ ఐఏఏఎఫ్ తన తాజా ప్రకటనలో తెలిపింది. 'నాడా' అతని శాంపిల్స్‌ను సేకరించి కెనడాలోని అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా)కు పంపగా... అక్కడ జరిపిన పరీక్షల్లో నవీన్ నిషేధిత ఉత్ప్రేరకం జీహెచ్‌ఆర్‌పీ–6 వాడినట్లు తేలింది. అనంతరం జీహెచ్ ఆర్‌పీ–6 నిషేధిత ఉత్ప్రేరకాల జాబితాలో ఉన్నట్లు తనకు అవగాహన లేదని నవీన్ వివరణ ఇచ్చాడు. 23 ఏళ్ల నవీన్ 2018 ఫెడరేషన్ కప్‌లో రజత పతకంతో పాటు... అదే ఏడాది జరిగిన అంతర్రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచాడు.

---

**కరోనా విరాళం**


నాగార్జున


మహేశ్‌బాబు


రామ్‌చరణ్

**కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో సినిమా తారలు సహాయం చేయడానికి ముందుకు వస్తున్నారు, ఇప్పటికే పలువురు తారలు విరాళాలిచ్చారు. శనివారం విరాళం ప్రకటించిన వారి వివరాలు.**

- **దగ్గుబాటి ఫ్యామిలీ (సురేష్ బాబు, వెంకటేష్, రానా)** – 1 కోటి (ఆరోగ్య శాఖ వర్కర్లకు, సినీ వర్కర్లకు కలిపి)
- **నాగార్జున** – 1 కోటి (సినీ వర్కర్స్ సహాయార్థం)
- **మహేశ్ బాబు** – 25 లక్షలు ( కరోనా క్రై సిస్ చారిటీకి ) (ఆల్రెడీ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు కలిపి కోటి రూపాయిలు ప్రకటించారు)
- **రామ్‌చరణ్** – 30 లక్షలు (సినీ వర్కర్స్ సహాయార్థం).
- **నాగచైతన్య** (ఉపాధి కోల్పోయిన తెలుగు సినీ కార్మికులు సంక్షేమం కోసం)
- **నిఖిల్** – తెలుగు రాష్ట్రాల్లోని డాక్టర్స్, హెల్త్ వర్కర్స్‌కు పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ)ను అందించి కరోనా సమయంలో తన వంతు సాయం చేశారు నిఖిల్. 2 వేల రెస్పిరేటర్స్, 2 వేల రీ యూజబుల్ గ్లౌజ్స్, 2 వేల ఐప్రొటెక్షన్ గ్లాసెస్, శానిటైజర్స్ లతో పాటుగా పది వేలమాస్కులను అందజేశారు.
- **కార్తికేయ** – 2లక్షలు (రోజు వారి వేతనాలు తీసుకునే సినీ కార్మికుల కోసం)
- **లావణ్యా త్రిపాఠి** – 1 లక్షల (రోజు వారి వేతనాలు తీసుకునే సినీ కార్మికుల కోసం)


సురేష్ బాబు


నాగచైతన్య


వెంకటేశ్


నిఖిల్


రానా


కార్తికేయ


లావణ్యా త్రిపాఠి

# సినీ కార్మికుల కోసం సి.సి.సి. మనకోసం

కరోనా మహమ్మారి ప్రభావం అన్ని రంగాలపై తీవ్రంగా పడింది. దీని బారి నుంచి ప్రజలను కాపాడటానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషికి హీరోలు, నిర్మాతలు, దర్శకులు తమ వంతుగా విరాళాలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంక్షోభం నుంచి సినిమా రంగాన్ని బయటపడేయటానికి సినీ ప్రముఖులు నడుం బిగించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్‌లు ఆగిపోవడంతో పలువురు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు సి. సి. సి. మనకోసం (కరోనా క్రై సిస్ చారిటీ మనకోసం) అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఈ సంస్థకి చైర్మన్‌గా చిరంజీవి ఉంటారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ –''ఎలాంటి విపత్తులు వచ్చినా సహాయం చేయడంలో సినిమా పరిశ్రమ ముందుంటుంది. సినీ కార్మికులకి మనం ఏం చేయగలం అని చిరంజీవిగారు తన ఆలోచనతో ముందుకు వచ్చారు. చిరంజీవిగారి ఆధ్వర్యంలో సురేష్ బాబు, నేను, ఎన్.శంకర్, సి.కల్యాణ్, దాము కలిసి చిన్న కమిటీగా ఏర్పాటయి 'సీసీసీ మనకోసం' సంస్థ ద్వారా చిత్రపరిశ్రమ కార్మికుల సంక్షేమార్థం పలు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. దీనికి నాందిగా మొదట చిరంజీవిగారు కోటి రూపాయలు విరాళం ప్రకటించారు. నాగార్జునగారు కోటి రూపాయలు, ఎన్టీఆర్ 25లక్షలు విరాళాలు ప్రకటించారు. ఎవరైనా సినిమా పరిశ్రమ కార్మికులను ఆదుకోవచ్చు''అన్నారు.


చిరంజీవి

దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ మాట్లాడుతూ– ''సి.సి. సి. మనకోసం కమిటీతో పాటు డైరెక్టర్ మెహర్ రమేష్, గీతా ఆర్ట్స్ బాబు, కోటగిరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ, కొమరం వెంకటేష్, ఫెడరేషన్‌కు సంబంధించి అన్ని కార్మిక సంఘాల నాయకులు ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌గారి ఆశీస్సులు, మంత్రి కేటీఆర్‌గారి అండదండలు కావాలని కోరుతున్నాం'' అన్నారు.

# మార్క్ బ్లమ్ ఇక లేరు



'డెస్పరేట్లీ సీకింగ్ సుసాన్', 'క్రోకోడైల్ డూండీ' వంటి చిత్రాల ద్వారా నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న హాలీవుడ్ నటుడు మార్క్ బ్లమ్ (69) ఇక లేరు. కరోనా వైరస్ సోకి, ఆయన ఆస్పత్రిలో చేరారు. వైరస్ కారణంగా వచ్చిన ఆరోగ్య సమస్యల వల్ల మార్క్ చనిపోయారని స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్–అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్ట్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రెబెక్కా డామన్ పేర్కొన్నారు. టీవీ రంగంలోనూ, సినిమా రంగంలోనూ మంచి పేరు, ప్రఖ్యాతులు తెచ్చుకున్న మార్క్ మరణం తీరని లోటు అని పలువురు హాలీవుడ్ ప్రముఖులు పేర్కొన్నారు.

# 17 ఏళ్లు... 20 సినిమాలు

ఇటీవలే 'అల..వైకుంఠపురములో...'తో సూపర్‌సక్సెస్ అందుకున్నారు అల్లు అర్జున్ (బన్ని). ప్రస్తుతం సుకుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కనున్న సినిమా కోసం చిత్తూరు యాసపై పట్టు సాధించే పనిలో బిజీగా ఉన్నారు బన్ని. ఇది తన కెరీర్‌లో 20వ చిత్రం. కరోనా కారణంగా ఈ సినిమా షూటింగ్ వాయిదా పడింది. అలాగే బన్నీ సినీ కెరీర్‌లో 17 సంవత్సరాలు ముగిశాయి. 2003లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'గంగోత్రి' సినిమాతో ఎంట్రీ ఇచ్చారు అల్లు అర్జున్. ఆ తర్వాత 'ఆర్య', 'దేశముదురు', 'పరుగు', జులాయి, రేసుగుర్రం, సరైనోడు' వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్‌తో ఇండస్ట్రీలో తనదైన ప్రతిభను చాటుకున్నారు. ''పదిహేడేళ్లుగా నన్ను సపోర్ట్ చేస్తున్న ప్రేక్షకులకు, నా అభిమానులకు రుణపడి ఉంటాను. నన్ను ఇండస్ట్రీకి పరిచయం చేసిన రాఘవేంద్రరావు, అశ్వనీదత్, అల్లు అరవింద్ గార్లతో పాటు 'గంగోత్రి' టీమ్ అందరికీ థ్యాంక్స్'' అని పేర్కొన్నారు అల్లుఅర్జున్. అలాగే ఈ 17ఏళ్ల కెరీర్ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేశారు స్నేహా రెడ్డి (అల్లు అర్జున్ భార్య).


కుమారుడు అయాన్, కుమార్తె అర్హలతో అల్లుఅర్జున్

# న్యూ కట్

పని లేని మంగలి పిల్లి తల గొరిగాడన్నది సామెత. ఖాళీగా ఉండి ఏం చేయాలో తోచక ఏదో పని చేసేవాళ్లని ఇలా అంటుంటాం. ప్రస్తుతం కరోనా కారణంగా అందరూ ఇంట్లో లాక్ అయిపోయి ఉన్నారు. బొమ్మలేస్తూ, పాటలు పాడుతూ, వ్యాయామం చేస్తూ ఇలా కాలక్షేపం కోసం చేస్తున్న ప్రతీదాన్ని సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు స్టార్స్. బాలీవుడ్ నటి అనుష్కా శర్మ ఖాళీగా ఉండటంతో ఓ ప్రయోగం చేయాలనుకున్నారు. అయితే అది వంట గదిలోనో, వైట్ పేపర్ మీదో కాదు. తన భర్త విరాట్ కోహ్లీ తల మీద. కత్తెర తీసుకొని భర్త కోహ్లీకి హెయిర్ కట్ చేశారు. ఈ వీడియోను పోస్ట్ చేసి 'లాక్ డౌన్ సమయాల్లో ఇలా '' అని కాప్షన్ చేశారు అనుష్క. ఈ కొత్త హెయిర్ స్టైల్ బావుందంటూ అనుష్కను అభినందించారు కోహ్లీ.


అనుష్క, విరాట్ కోహ్లీ

# భారీ విరాళం

కరోనా వైరస్ పై పోరాడేందుకు సినిమా స్టార్స్ తమ వంతుగా ప్రభుత్వానికి, సినిమా కార్మికుల సంఘాలకు విరాళాలు ఇస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ భారీ విరాళాన్ని ప్రకటించి తన పెద్ద మనసును చాటుకున్నారు. 'పీఎం – కేర్స్ ఫండ్స్ కి ఏకంగా 25 కోట్ల మొత్తాన్నివిరాళంగా ప్రకటించారు అక్షయ్. 'ప్రస్తుత పరిస్థితుల్లో మనందరి ప్రాణాలే ముఖ్యం. మనకు ఉన్నది, తోచింది సహాయం చేద్దాం. మోదీగారి పీఎం – కేర్స్ ఫండ్స్ కి 25 కోట్లు విరాళంగా ఇస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను'' అని ట్వీట్ చేశారు అక్షయ్ కుమార్.


అక్షయ్ కుమార్

# 'జుమాంజి' నటికి కరోనా

కరోనా ప్రభావం హాలీవుడ్ నటుల మీద బాగా కనిపిస్తోంది. ప్రముఖ నటుడు టామ్ హాంక్స్, ఆయన భార్య రీటా విల్సన్, 'జేమ్స్ బాండ్' నటి ఓల్గా కురీలెన్కో ఆల్రెడీ కరోనా బారిన పడ్డారు. తాజాగా 'జుమాంజి' నటి లారా బెల్ బండీకి కరోనా సోకింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ఆమె ప్రకటించారు. 'కరోనా పాజిటివ్ అని తెలిసినా భయపడటం లేదు. డాక్టర్స్ సూచనలను పాటిస్తున్నాను. త్వరలోనే కోలుకుంటానని అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు లారా బండీ.


లారా బెల్ బండీ

epaper.sakshi.com

# వెయ్యికి చేరువగా...

## భారత్‌లో కరోనా పాజిటివ్ కేసులు 918



లాక్‌డౌన్‌తో సొంతూళ్లకు వెళ్లేందుకు ఘజియాబాద్‌లోని కౌశాంబి బస్‌స్టేషన్‌కు వందలాదిగా వచ్చిన వలస కుటుంబాలు

**న్యూఢిల్లీ/భోపాల్/కోచి:** భారత్‌లో కరోనా మరణ మృదంగం మోగుతూనే ఉంది. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యికి చేరువవుతోంది. శనివారం ఒక్క రోజే దేశంలో 179 కొత్త కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కేవలం ఒక్కరోజులో ఇన్ని కేసులు వెలుగు చూడడం ఇదే ప్రథమం. దీంతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 918కు చేరింది. కరోనాతో శనివారం మహారాష్ట్రలో ఒకరు, మధ్యప్రదేశ్‌లో ఒకరు మరణించారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 19కి ఎగబాకింది. దేశంలో కరోనా వ్యాప్తి మూడో దశలోకి ప్రవేశించనుందన్న అనధికార వార్తలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయి. పాజిటివ్ కేసుల సంఖ్య పెరగడం దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి వేగవంతమైందనడానికి సూచిక కాదని భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) తేల్చిచెప్పింది.

**అన్ని రాష్ట్రాల్లో కరోనా హాస్పిటళ్లు**

కరోనా భరతం పట్టడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో కరోనా ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ ప్రకటించారు. ఇప్పటికే 17 రాష్ట్రాలు దీనిపై కార్యాచరణ ప్రారంభించామని పేర్కొన్నారు. కరోనా ఆసుపత్రుల ఏర్పాటుపై అన్ని రాష్ట్రాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని వివరించారు. కరోనా తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. వైరస్ నియంత్రణకు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. లాక్‌డౌన్, సామాజిక దూరాన్ని వంద శాతం కచ్చితంగా అమలు చేసేందుకు కలిసికట్టుగా కృషి చేస్తున్నామన్నారు.

**నర్సింగ్ సిబ్బందికి ఆన్‌లైన్‌లో శిక్షణ**

కరోనా బాధితులకు అందించాల్సిన చికిత్సపై ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్యులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వచ్చే 5–7 రోజుల్లో ఎయిమ్స్ వైద్యులతో నర్సింగ్ సిబ్బందికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో రోజంతా పనిచేసే టెలీ కన్సల్టేషన్ సెంటర్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ శనివారం ప్రారంభించారని లవ్ అగర్వాల్ వివరించారు. ఈ సెంటర్ ద్వారా ఇతర ఆసుపత్రుల్లోని వైద్యులకు, వైద్య కళాశాలల్లోని సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తామని అన్నారు. కరోనాను నియంత్రించే విషయంలో ఇతర దేశాల కంటే మన దేశం ముందుగానే మేల్కొందని లవ్ అగర్వాల్ స్పష్టం చేశారు.

**918 మందిలో 47 మంది విదేశీయులు**

కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం.. కరోనా మహమ్మారితో ఇప్పటివరకు మహారాష్ట్రలో ఐదుగురు, గుజరాత్‌లో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, మధ్యప్రదేశ్‌లో ఇద్దరు, తమిళనాడు, బిహార్, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. కేరళలోనూ ఒక వృద్ధుడు కరోనాతో మరణించాడని అక్కడి అధికారులు ప్రకటించారు. కానీ, ఈ మరణాన్ని ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో చేర్చలేదు. దేశంలో ఇప్పటివరకు కరోనా ప్రభావానికి గురైన 918 మందిలో 47 మంది విదేశీయులు ఉన్నారు. అత్యధికంగా మహారాష్ట్రలో 180 కరోనా కేసులు నమోదయ్యాయి. 173 కేసులతో కేరళ రెండో స్థానంలో నిలిచింది. కర్ణాటకలో 55, తెలంగాణలో 48, రాజస్తాన్‌లో 48, గుజరాత్‌లో 48, ఉత్తరప్రదేశ్‌లో 45, ఢిల్లీలో 39, పంజాబ్‌లో 38, హరియాణాలో 33, తమిళనాడులో 38, మధ్యప్రదేశ్‌లో 30, జమ్మూకశ్మీర్‌లో 18, పశ్చిమబెంగాల్‌లో 15, ఆంధ్రప్రదేశ్‌లో 14, లదాఖ్‌లో 13, బిహార్‌లో 9, చండీగఢ్‌లో 7, ఛత్తీస్‌గఢ్‌లో 6, ఉత్తరాఖండ్‌లో 5, హిమాచల్ ప్రదేశ్‌లో 3, ఒడిశాలో 3, గోవాలో 3, పుదుచ్చేరిలో ఒకటి, మిజోరాంలో ఒకటి, మణిపూర్‌లో ఒకటి, అండమాన్ దీవుల్లో 2 కేసులు నమోదయ్యాయి.

**కేరళలో తొలి 'కరోనా' మరణం**

కేరళలో కరోనా వైరస్ బారినపడి ఓ వృద్ధుడు ప్రాణాలు విడిచాడు. రాష్ట్రంలో ఇదే తొలి కరోనా మరణం కావడం గమనార్హం. 69 ఏళ్ల ఈ వ్యక్తి ఎర్నాకుళం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మార్చి 16న దుబాయి నుంచి వచ్చిన అతడిలో తొలుత న్యుమోనియా లక్షణాలు కనిపించడంతో మార్చి 22న ఎర్నాకుళం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లోని ఐసోలేషన్ వార్డులో చేర్చారు. అనంతరం కరోనా పాజిటివ్ అని తేలింది. అంతేకాకుండా గుండె సంబంధిత వ్యాధితోపాటు అధిక రక్తపోటుతో బాధపడుతున్నాడని అధికార వర్గాలు తెలిపాయి. ఆ వృద్ధుడిని కలిసిన 86 మందిని ఇప్పటికే క్వారంటైన్‌కు తరలించారు.

**ఆ పాత్రికేయుడిపై కేసు**

మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌కు హాజరైన జర్నలిస్టుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మార్చి 20న కమల్‌నాథ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆ జర్నలిస్టు పాల్గొన్నాడు. లండన్‌లో చదువుతున్న ఆయన కుమార్తె భోపాల్‌కు వచ్చింది. ఆమెకూ కరోనా పాజిటివ్ ఉన్నట్లు బయటపడింది. ఆ తర్వాత ఆమె తండ్రి అయిన జర్నలిస్టుకు కూడా కరోనా పాజిటివ్ ఉన్నట్లు తేలింది. ఆ విషయాన్ని దాచి, విలేకరుల సమావేశానికి హాజరు కావడాన్ని ప్రభుత్వ వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

**ఆహార పదార్థాలు ఇవ్వండి.. పేదలకు అందజేస్తాం..**

**బెంగళూరు:** లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలను ఆదుకునేందుకు దాతలు విరివిగా ముందుకు రావాలని కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ కోరారు. బెంగళూరు పోలీసులు ఉపాధి కోల్పోయిన వారికి ఆహారం అందజేస్తున్నారు.

**రూ.9,000 కోట్లివ్వండి**

లాక్‌డౌన్ వల్ల ఎదురైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనేందుకు తమ రాష్ట్రానికి రూ.9 వేల కోట్లు ఇవ్వాలని తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రధాని మోదీకి లేఖ రాశారు.

**సరిగ్గానే స్పందించాం: కేంద్రం**

ఎలాంటి ప్రణాళిక లేకుండానే 21 రోజుల లాక్‌డౌన్‌ను ప్రకటించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందంటూ వెల్లువెత్తుతున్న విమర్శలను కేంద్రం ఖండించింది. కరోనా తీవ్రతపై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) హెచ్చరికల కంటే ముందే ప్రభుత్వం అప్రమత్తమైందని, సరిహద్దుల్లో ఆంక్షలను అమల్లోకి తెచ్చిందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రభుత్వ ప్రతిస్పందన సరైన రీతిలోనే ఉందని ఆ ప్రకటనలో వెల్లడించింది.



లాక్‌డౌన్ సమయంలో ఇళ్లలోనే ఉండాలంటూ కరోనా వైరస్‌ను పోలిన హెల్మెట్ ధరించి వాహనదారులను హెచ్చరిస్తున్న చెన్నై పోలీస్ అధికారి



చాన్నాళ్ల తర్వాత రామాయణ్ సీరియల్ మళ్లీ మొదలవడంతో గువాహటిలో సెల్‌ఫోన్‌లో సీరియల్ చూస్తున్న గువాహటి బాలిక



లండన్‌లోని ఎక్సెల్ కేంద్రాన్ని కరోనా పేషెంట్ల కోసం తాత్కాలిక ఆస్పత్రిగా మార్చేందుకు సాగుతున్న ఏర్పాట్లు



ఘజియాబాద్‌లో సొంతూరు కెళ్లే బస్సు కోసం పరుగు తీస్తున్న వలస కుటుంబాలు

## క్లుప్తంగా...

### పుణే నర్సుకి ప్రధాని ఫోన్

**పుణే:** కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో వైద్య సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ రోగులకు సేవలందిస్తున్నారు. వారిలో మనోధైర్యం నింపడం కోసం మహారాష్ట్ర పుణేలోని స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న నాయుడు ఆసుపత్రిలో ఒక నర్సుకి ప్రధాన మంత్రి మోదీ ఫోన్ చేసి మాట్లాడారు. వారి మధ్య మరాఠీలో జరిగిన సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. నర్సు ఛాయా జగతాప్‌కు ఫోన్ చేసిన మోదీ ముందుగా ఆమె క్షేమసమాచారాలు వాకబు చేశారు. జగతాప్ కుటుంబ సభ్యులు ఆమె గురించి ఆందోళన చెందుతున్నారా అని ప్రశ్నించారు. దీనికి ఆమె వినయంగా సమాధానమిచ్చారు. పవిత్రమైన నర్సు వృత్తిలో ఉన్నప్పుడు కుటుంబ సభ్యుల్లో ఆందోళన ఉన్నప్పటికీ రోగులకు సేవలందించడమే తమ కర్తవ్యమని తెలిపారు. వృత్తి పట్ల ఆమెకున్న అంకిత భావాన్ని ప్రధాని ప్రశం సించారు..

### వృద్ధురాలి మెడపై కరిచిన కరోనా క్వారంటైన్ వ్యక్తి

**థెని:** తమిళనాడులో ఘాతుకం చోటుచేసుకుంది. శ్రీలంకలో బట్టల వ్యాపారం చేసే ఓ వ్యక్తి స్వస్థలానికి తిరిగి వచ్చి వృద్ధురాలి (90) మెడపై కొరికాడు. ఆమెను ఆస్పత్రిలో చేర్చినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అధికారుల కథనం ప్రకారం.. శ్రీలంకలో బట్టలు అమ్ముకునే వ్యక్తి శుక్రవారం భారత్‌లోకి వచ్చాడు. కరోనా నేపథ్యంలో అతన్ని హోం క్వారంటైన్‌లో ఉండాలని అధికారులు సూచించారు. అయితే, జక్కమనయకంపట్టిలోని తన ఇంట్లోకి వచ్చిన వెంటనే నగ్నంగా వీధిలోకి పరుగెత్తాడు. ఆ వీధిలో ఉన్న ఓ వృద్ధురాలి మెడపై కొరికాడు. బంధువులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆమె శనివారం మరణించిందని వైద్యులు తెలిపారు.

### కరోనా కిట్ల రవాణాకు ఎయిరిండియా విమానాలు

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ నేపథ్యంలో రవాణావ్యవస్థ పూర్తిగా నిలిచిపోవడంతో కరోనా కిట్లను అత్యవసర ప్రాతిపదికన ఎయిరిండియా విమానాల ద్వారా ఆస్పత్రులకు అందిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు. ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) రూపొందించిన కరోనా కిట్లను ఢిల్లీ నుంచి ఐజ్వాల్, కోల్‌కతా, హైదరాబాద్‌లకు ఇప్పటికే పంపాం. ముంబై నుంచి పుణే, బెంగళూరు, తిరువనంతపురంలకు .. కోల్‌కతా నుంచి దిబ్రూగఢ్‌కుకు పంపనున్నాం' అని ట్విట్టర్‌లో వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురు వలస కార్మికులు మృతి

**పాల్ఘార్:** లాక్‌డౌన్‌తో దిక్కుతోచక సొంతూళ్లకు పయనమైన బడుగు జీవులను విధి వెంటాడింది. శనివారం తెల్లవారుజామున మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వలస కార్మికులు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌కు చెందిన కార్మికులు కొందరు మహారాష్ట్రకు జీవనోపాధికి వలసవచ్చారు. లాక్‌డౌన్‌తో పరిస్థితులు ఇబ్బందికరంగా మారడంతో కాలినడకన ఇళ్లకు పయనమయ్యారు. వారిని మహారాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులు అడ్డుకుని వెనక్కిపంపేశారు. దీంతో హైవేపై ముంబై వైపు నడిచి వస్తుండగా పాల్ఘార్ వద్ద తెల్లవారు జామున వారిపైకి వేగంగా టెంపో దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

# బోగీలే ఐసోలేషన్ వార్డులు



కరోనా రోగుల కోసం రైల్వే శాఖ సిద్ధం చేసిన బోగీ

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా కేసులు పెరిగిపోతూ ఉండడంతో ఆస్పత్రి సదుపాయాలు లేకపోవడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఒక వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రయాణికుల రైళ్లు రద్దు కావడంతో ఆ రైలు బోగీలను కరోనా బాధితులకు చికిత్సనందించే వార్డులుగా రూపొందించాలని ముందుకొచ్చింది. ఇందుకోసం ఒక నమూనా బోగీని కూడా తయారు చేసింది. దీనికి కేంద్రం ఆమోదం తెలిపితే మరికొద్ది రోజుల్లోనే వారానికి 10 బోగీలు తయారు చేయనున్నట్టు ఉత్తర రైల్వే అధికార ప్రతినిధి దీపక్ కుమార్ వెల్లడించారు.

**బోగీలను ఐసీయూ కేంద్రాలుగా ఎలా మార్చారంటే**

- ఒక కూపేలో ఒకవైపు లోయర్ బెర్త్‌నే మంచం మాదిరిగా రూపొందించి అన్ని బెర్త్‌లను తొలగించారు.
- ఆ బెర్త్ ఎదురుగా రోగుల సామాన్లు, వైద్య పరికరాలు ఉంచడానికి ఏర్పాట్లు చేశారు.
- ప్రతీ కోచ్‌లో ఉండే 4 టాయిలెట్ల స్థానంలో రెండు వాష్‌రూమ్‌లుగా మార్చి ఫ్లోరింగ్ మార్చారు. ప్రతీ బాత్‌రూమ్‌లో హ్యాండ్ షవర్, బక్కెట్, మగ్ ఉంచారు.
- ప్రతీ కోచ్‌లోనూ 220 ఓల్టుల ఎలక్ట్రికల్ పాయింట్లను ఏర్పాటు చేశారు.
- బోగీ వెలుపల 415 ఓల్టుల విద్యుత్ సరఫరా.
- బోగీకి 10చొప్పున ఇలా వార్డులు తయారు చేశారు.
- ఇక రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఐసీయూలు, మెడికల్ స్టోర్‌లు, పాంట్రీలు, అధికారుల కోసం గదులు వంటివి కూడా ఏర్పాటు చేశారు.
- ప్రతీ బోగీని నిత్యం శానిటైజ్ చేస్తారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతీ వెయ్యి మంది జనాభాకి కనీసం మూడు పడకలైనా ఉండాలి. కానీ, 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ప్రతీ వెయ్యి మందికి 0.7 పడకలు ఉన్నట్టుగా అంచనా.

# కరోనాపై పోరుకు

## టాటా గ్రూప్ విరాళం రూ.1,500 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రాణాంతక కరోనా మహమ్మారిపై యుద్ధానికి టాటా గ్రూప్ శనివారం భారీ విరాళం ప్రకటించింది. రూ.500 కోట్లు ఇవ్వనున్నట్లు తొలుత టాటా ట్రస్టు వెల్లడించింది. అనంతరం రూ.1,000 కోట్ల విరాళాన్ని 'టాటా సన్స్' చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ప్రకటించారు. దీంతో టాటా గ్రూప్ మొత్తం రూ.1,500 కోట్ల విరాళం ప్రకటించినట్లయ్యింది. కరోనా వైరస్ పీడితులకు అవసరమైన వెంటిలేటర్లను సాధ్యమైనంత త్వరగా అందజేస్తామని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. వాటిని తయారు చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. దేశంలో.. ప్రపంచంలో కరోనా వ్యాప్తి ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేగవంతమైన నివారణ చర్యలు అవసరమన్నారు. కరోనా నివారణకు టాటా ట్రస్టుతో కలిసి పని చేస్తామన్నారు.

కరోనా నివారణతోపాటు సహాయక కార్యకలాపాలకు రూ.500 కోట్ల విరాళాన్ని టాటా ట్రస్టు ప్రకటించింది. తాము ఇవ్వనున్న రూ.1,000 కోట్లతో డాక్టర్లు, వైద్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాలు, కరోనా టెస్టింగ్ కిట్లు అందజేయనున్నట్లు టాటా సన్స్ తెలిపింది. కరోనాను అరికట్టే విషయంలో తక్షణమే స్పందించాల్సిన సమయం వచ్చిందని టాటా ట్రస్టు చైర్మన్ రతన్ టాటా వ్యాఖ్యానించారు. మానవ జాతి ఎదుర్కొంటున్న కఠినమైన సవాళ్లలో కరోనా కూడా ఒకటని తెలిపారు.

**రూ.కోటి చొప్పున బీజేపీ ఎంపీల ఎంపీల్యాడ్స్**

కరోనాపై పోరులో ప్రభుత్వానికి సాయపడేందుకు తమ పార్టీ ఎంపీలు రూ.1 కోటి చొప్పున ఎంపీల్యాడ్స్ కేటాయించనున్నట్లు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఒక నెల వేతనం విరాళంగా అందిస్తారని తెలిపారు. దీంతోపాటు తమ పార్టీ కార్యకర్తలు లాక్‌డౌన్‌తో ఇబ్బందిపడే 5 కోట్ల నిరుపేదలకు 21 రోజులపాటు అన్నదానం చేస్తుందన్నారు. బీజేపీకి లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి 386 మంది సభ్యులున్నారు. ఒక్కో ఎంపీకి ఎంపీల్యాడ్స్ కింద ఏడాదికి రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసే వీలుంది. కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు తన ఒక నెల వేతనాన్ని ప్రధానమంత్రి సహాయ నిధికి అందించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఎంపీలంతా తమ ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.కోటి విరాళంగా అందించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ్యులను కోరారు.

**సన్‌ఫార్మా రూ.25 కోట్లు:** కరోనాపై పోరాటంలో ప్రభుత్వానికి సహకరించేందుకు సన్ ఫార్మా ఇండస్ట్రీస్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. కరోనా వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు రూ.25 కోట్ల విలువైన హైడ్రాక్సీ క్లోరోక్విన్, అజిత్రోమైసిన్ తదితర మం దులు, శానిటైజర్లను సరఫరా చేయనున్నట్లు ప్రకటించింది.

**అత్యాధునిక వెంటిలేటర్లు అందిస్తాం: హ్యుండయ్**

కరోనాపై పోరుకు దక్షిణ కొరియాలో వినియోగిస్తున్న అత్యాధునిక పరీక్ష కిట్లను అందించనున్న హ్యుండయ్ మోటార్స్ ప్రకటించింది. ఇవి 25 వేల మందికి ఉపయోగపడతాయని తెలిపింది.

**ఒకరోజు వేతనం ఇవ్వండి: జీఎస్ఐ**

కరోనాపై పోరులో సర్కారుకు బాసటగా నిలిచేందుకు ప్రధానమంత్రి సహాయ నిధికి ఒక రోజు వేతనం విరాళంగా ఇవ్వాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) తన ఉద్యోగులను కోరింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఉన్న ఆరు జోన్ల అధిపతులకు వినతులు పంపినట్లు జీఎస్ఐ డీజీ శ్రీధర్ తెలిపారు.

**కావాలంటే వెంటిలేటర్లు సరఫరా చేస్తాం: ట్రంప్**

కరోనాపై పోరులో మిత్ర దేశాలకు సాయం అందించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందుకు వచ్చారు. వెంటిలేటర్లు, ఇతర వైద్య సామగ్రి ఉత్పత్తిని దేశీయంగా పెంచడంతోపాటు అవసరమైన దేశాలకు వాటిని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కరోనా బారినపడిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపిన ట్రంప్.. వెంటిలేటర్లు పంపించాలన్న ఒకే ఒక కోరికను బోరిస్ ఈ సందర్భంగా వెల్లడించారని వ్యాఖ్యానించారు. రానున్న 100 రోజుల్లో తమ కంపెనీలు లక్ష వెంటిలేటర్లను ఉత్పత్తి చేయనున్నాయన్నారు.

## 'పీఎం కేర్స్'కు విరాళాలివ్వండి

### ప్రధాన మంత్రి కార్యాలయం విజ్ఞప్తి



**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి పౌర సహాయం మరియు అత్యవసర పరిస్థితుల ఉపశమన నిధి (పీఎం కేర్స్ ఫండ్)కు ఉదారంగా విరాళాలు ఇవ్వవలసిందిగా ప్రధాని కార్యాలయం విజ్ఞప్తి చేసింది. కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో భాగంగా ఏదైనా అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టడం, బాధితులకు ఉపశమనం అందించడం లాంటి ప్రాథమిక లక్ష్యంతో కూడిన జాతీయ నిధిని ఉండాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాన మంత్రి పౌర సహాయ, అత్యవసర పరిస్థితుల ఉపశమన నిధి (పీఎం కేర్స్) ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ కు ప్రధానమంత్రి చైర్మన్‌గా ఉంటారు. రక్షణ, హోం, ఆర్థిక శాఖల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ ఫండ్ చిన్న చిన్న విరాళాలను కూడా అనుమతిస్తుంది. ఈ ఫండ్ కోసం పెద్ద సంఖ్యలో ప్రజలంతా చిన్న విరాళాన్ని అయినా అందించవచ్చు. పౌరులు లేదా సంస్థలు పీఎం ఇండియా డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా పై వివరాలను ఉపయోగించి పి.ఎం. కేర్స్ ఫండ్‌కు విరాళాలు అందించవచ్చు.

**ఖాతా పేరు:** పీఎం కేర్స్
**ఖాతా సంఖ్య:** 2121పీఎం20202
**ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్:** ఎస్‌బీఐఎన్ 0000691
**స్విఫ్ట్ కోడ్:** ఎస్‌బీఐఎన్ఐఎన్‌బీబీ104
**బ్యాంక్, శాఖ పేరు:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ ప్రధాన శాఖ
**యూపీఐ ఐడీ:** పీఎంకేర్స్ ఎట్ ది రేట్ ఆఫ్ ఎస్‌బీఐ

**ఈ చెల్లింపు పద్ధతులు సైతం పీఎం ఇండియా డాట్ జీవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.. డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ (భీమ్, ఫోన్‌పే, అమెజాన్ పే, గూగుల్ పే, పేటీఎం, మొబిక్విక్, మొదలైనవి),ఆర్.టి.జి.ఎస్./ఎన్.ఇ.ఎఫ్.టి.(నెఫ్ట్), ఈ నిధికి అందించే విరాళాలకు సెక్షన్ 80(జి) కింద ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉంది.**

# ఇటలీలో ఆగని విలయం

**వాషింగ్టన్, రోమ్:** 183 దేశాల్లో కరోనా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా యూరప్ దేశాలు కరోనా కోరల్లో చిక్కుకొని విలవిలలాడిపోతున్నాయి. రోజురోజుకీ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు 6 లక్షలకు పైగా నమోదయ్యాయి. ఇటలీలో శుక్రవారం రికార్డు స్థాయిలో 969 మంది మరణించడంతో మొత్తం మృతుల సంఖ్య 10 వేలకు చేరువలో ఉంది. స్పెయిన్‌లో గత 24 గంటల్లో 832 మంది మరణించారు. దీంతో మొత్తం మృతులు 5,690కి చేరుకున్నాయి. యూరప్‌లో అత్యధిక దేశాలు లాకౌట్‌లో ఉండడంతో ఆర్థిక మాంద్యం కోరలు చాస్తోంది. ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాలన్నీ ఏకతాటిపై నిలిచి ఈ విపత్తుని ఎదుర్కోవాలని, మిగిలిన యూరప్ దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం నుంచి తమను బయట పడేయాలని ఇటలీ ప్రధాన మంత్రి గియూసెప్పె కోంటే అన్నారు.

- ఇటలీలో ఒకేరోజు 969, స్పెయిన్‌లో 832 మంది మృతి
- 183దేశాల్లో వైరస్ విస్తృతి
- మొత్తంగా 6.10 లక్షల కేసులు
- 30 వేలకు చేరువలో మరణాలు



ఎప్పుడూ పర్యాటకులతో రద్దీగా ఉండే న్యూఆర్లియన్స్‌లో జాక్సన్ స్క్వేర్ నిర్మానుష్యమైంది

**ఆర్థిక ప్యాకేజీపై ట్రంప్ సంతకం**

అగ్రరాజ్యం అమెరికాలో కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తోంది. ఆ దేశంలో లక్షకు పైగా కేసులు నమోదైతే, 1700 మందికి పైగా మరణించారు. కరోనా బాధిత రాష్ట్రాలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చరిత్రాత్మక బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ''కరోనాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీకు సాయం అందుతుంది. కంటికి కనిపించని శత్రువు మనపై దాడి చేసింది. మనం అంతకంటే గట్టిగా దానిపై ప్రతిదాడికి దిగాం'' అని చెప్పారు. అమెరికా చరిత్రలోనే అతి పెద్ద ఆర్థిక సహాయ ప్యాకేజీపై సంతకం చేశానని అన్నారు.

**చైనాలో ఘర్షణలు**

చైనాలో అత్యంత అరుదైన ఘటన చోటు చేసుకుంది. కరోనా వైరస్ బట్టబయలైన హుబాయ్ ప్రాంతంలో ప్రజాగ్రహాన్ని పోలీసులు చవి చూడాల్సి వచ్చింది. సెంట్రల్ హుబేలో లాకౌట్ ఎత్తేయడంతో భారీ సంఖ్యలో జనం పొరుగునే ఉన్న జియాంగ్‌కు బయల్దేరి వెళ్లారు. ఈ రెండు ప్రావిన్స్‌ల మధ్య వంతెన మీద నుంచి ప్రజలు దాటడానికి ప్రయత్నించడంతో జియాంగ్ సరిహద్దుల్లో పోలీసులు వారిని అడ్డుకున్నారు. కోవిడ్‌పై భయంతో వారిని ఆపేశారు. దీంతో ఆగ్రహంతో ప్రజలు పోలీసు వాహనంపై రాళ్లు రువ్వారు. చైనా ప్రభుత్వం వారికి ఎలాంటి వ్యాధి లేదని గ్రీన్ హెల్త్ కోడ్ ఇచ్చినా పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

## జిత్తుల మారి వైరస్

**బీజింగ్:** కరోనా మహమ్మారి జిత్తులు ఒక్కటొక్కటిగా ప్రపంచానికి తెలుస్తున్నాయి. వ్యాధి బారిన పడి ఓ మోస్తరు లక్షణాలు మాత్రమే కనపరిచిన వారికి చికిత్స చేశాక.. ఆ లక్షణాలు కనిపించక పోయినా, ఎనిమిది రోజుల పాటు వైరస్ వారి శరీరంలోనే ఉన్నట్లు గుర్తించామని భారతీయ సంతతి శాస్త్రవేత్త లోకేశ్ శర్మ చైనాలో నిర్వహించిన ఒక పరిశోధన చెబుతోంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ రెస్పిరేటరీ అండ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ తాజా సంచికలో పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి. బీజింగ్‌లోని పీఎల్ఏ జనరల్ ఆసుపత్రిలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 9 మధ్యకాలంలో కరోనా చికిత్స పొందిన 16 మందిపై తాము పరిశోధనలు చేశామని లోకేశ్ శర్మ తెలిపారు. పదహారు మంది రోగుల నుంచి తాము రోజు విడిచి రోజు నమూనాలు సేకరించామని, చికిత్స తరువాత వైరస్ లేనట్లు పరీక్షలు నిర్ధారించినప్పటికీ సగం మందిలో మరో ఎనిమిది రోజులపాటు వైరస్ వారి శరీరంలో ఉన్నట్లు తమ పరిశోధనల్లో తేలిందని చెప్పారు.

## లాక్‌డౌన్ ఉల్లంఘనులకు వినూత్న శిక్ష

**జైపూర్:** లాక్‌డౌన్ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారికి రాజస్తాన్ అధికారులు వినూత్న శిక్ష విధిస్తున్నారు రాజస్తాన్‌లోని జున్‌జున్ ప్రాంత అధికారులు. 'ఏ పనీలేకుండా రోడ్లపైకి వచ్చే వారిని అరెస్టు చేయడం, లాఠీలతో కొట్టడం చేయరాదని నిర్ణయించుకున్నాం. అందుకు బదులుగా వారిని జేజేటీ వర్సిటీ, సింఘానియా వర్సిటీల్లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాల్లో రోగులకు సేవలందించేందుకు పంపిస్తున్నాం' అని అధికారులు తెలిపారు. 'ఇదేమీ తమాషా కాదు. ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో సిబ్బంది కొరత బాగా ఉంది. అందుకే ఉల్లంఘనుల ద్వారా రోగులకు సేవలందించనున్నాం. రోడ్లపై చిల్లరగా తిరిగే వారిని గుర్తించి మాకు ఫొటోలు పంపితే, అధికారులు వారిని గుర్తించి క్వారంటైన్‌లలో సేవలకు వినియోగించుకుంటారు' అని సామాజిక మాధ్యమాల్లో అధికారులు ప్రజలకు సందేశాలు పెడుతున్నారు.

## నెలపాటు అద్దె వసూళ్లు ఆపండి

**నోయిడా:** లాక్‌డౌన్ నేపథ్యంలో వలసకార్మికులు సొంతూళ్లకు వెళ్లిపోతున్నారన్న వార్తల నేపథ్యంలో నోయిడా యంత్రాంగం కొత్త చర్యలు ప్రకటించింది. ఇళ్ల యజమానులు అద్దెకు ఉండే వారి నుంచి ఒక నెలపాటు అద్దె వసూలు చేయరాదని కోరింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్ బీఎన్ సింగ్ వెల్లడించారు. నివాస భవనాల యజమానులు వలస కార్మికులపై అద్దెల కోసం ఒత్తిడి చేస్తున్నారని, ఇవ్వకుంటే ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తమ ఆదేశాలను ఉల్లంఘించిన వారికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## అడుగు దూరం నుంచే ఉష్ణోగ్రత లెక్కించే పరికరం


ప్రతీకాత్మక చిత్రం

**షిల్లాంగ్:** అడుగు దూరం నుంచే ఉష్ణోగ్రతను లెక్కించే పరికరాన్ని నార్త్ ఈస్టర్న్ హిల్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ తయారు చేశారు. కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో దూరం నుంచే శరీర ఉష్ణోగ్రతను కనుక్కునేలా ఈ థర్మల్ ఉష్ణోగ్రత కనుక్కునే పరికరాన్ని అభివృద్ధి చేసినట్లు దాన్ని తయారు చేసిన సుదీప్ పాల్ తెలిపారు. కేవలం మూడున్నర రోజుల్లోనే దాన్ని తయారు చేసినట్లు చెప్పారు. ఫారెన్ హీట్, సెల్సియస్ మానాలు రెండింటిలో దీన్ని వాడుకోవచ్చని ఆయన చెప్పారు.

# వెల్లువలా వలసలు


తమ గ్రామానికి వెళ్లేందుకు లక్నో నుంచి సామానంతా సర్దుకొని వెళుతున్న కార్మికులు

**కూటి కోసం కూలి కోసం**
**పట్టణంలో బతుకుదామని వలస వచ్చిన**
**బాటసారికి ఎంత కష్టం ఎంత కష్టం**

మహాకవి శ్రీశ్రీ రాసిన ఈ కవితకి దృశ్య రూపం ఇప్పుడు అన్ని రాష్ట్రాల్లోనూ కనిపిస్తోంది. కోవిడ్–19 మహమ్మారిని అడ్డుకోవడానికి దేశం లాక్‌డౌన్ ప్రకటించడంతో వారికి పనుల్లేవు. తిండి లేదు, నీళ్లు లేవు. ఉండడానికి చోటు లేదు. ఏదో మహమ్మారి పెనుభూతమై కాటేస్తుందన్న భయంతో సొంతింటికి చేరుకోవాలన్న ఆరాటం ఎక్కువై పోయింది. రవాణా సౌకర్యాలు లేకపోవడంతో వలసదారులు తమ కాళ్లకి పని చెప్పారు.

నెత్తి మీద ఒక మూట, చంకలో పిల్ల, రెండు చేతుల నిండా పెద్ద పెద్ద బ్యాగుల్లో సామాన్లతో వలస కార్మికులు నడుస్తున్న దృశ్యాలు అన్నిచోట్లా కనిపిస్తున్నాయి. గమ్యస్థానం ఎప్పుడొస్తుందో తెలీదు, ఇల్లు చేరడానికి ఎన్నాళ్లవుతుందో అర్థం కాదు. అయినా ప్రాణాలను నిలుపుకోవాలన్న ఒకే ఒక్క ఆరాటంతో పళ్ల బిగువున అన్ని కష్టాలను నొక్కిపెట్టి కిలోమీటర్లకి కిలోమీటర్లు నడుస్తున్నారు. ఢిల్లీ, హరియాణా, గుజరాత్ నుంచి ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు కర్ణాటక నుంచి రాజస్తాన్‌కు వేలాది మంది రోడ్లపై నడుస్తున్న దృశ్యాలు అందరి గుండెల్ని పిండేస్తున్నాయి. మన దేశంలో బెంగాల్, ఒడిశా, బిహార్ నుంచి అత్యధికంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లి పని చేస్తుంటారు.

చాలా ప్రాంతాల్లో కాలినడకన వెళుతున్న కార్మికుల్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఆదుకుంటున్నాయి. వారికి మంచినీళ్లు, ఆహారపొట్లాలు అందిస్తూ గమ్యస్థానాలు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎక్కడ వాళ్లు అక్కడే ఉండాలని విజ్ఞప్తి చేసి, వారి బసకి ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఇంటికి తొందరగా చేరాలన్న ఆత్రుతతో వందలాది కిలోమీటర్లు నడిచి వెళుతున్నారు. బెంగళూరులో వెల్డర్‌గా పనిచేసే శశిరామ్ అనే వెల్డర్ బెంగళూరు నుంచి 1300 కి.మీ. దూరంలో ఉన్న రాజస్తాన్‌లో తన స్వగ్రామానికి కాలినడకన వెళ్లే సాహసం చేశాడు. ''నేను ఇల్లు చేరడానికి 10 రోజులైనా పట్టొచ్చు, 12 రోజులైనా పట్టొచ్చు. కానీ నాకు వేరే దారి లేదు. బెంగళూరులో పని లేదు. తిండి లేదు. అందుకే రాజస్తాన్‌లో ఉన్న మా సొంతింటికి బయల్దేరాను''అని శశిరామ్ అనే వెల్డర్ చెప్పారు. ''మా స్వగ్రామం యూపీలో ఝాన్సీ. మా కుటుంబం అంతా భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నాం. దేశం లాక్‌డౌన్‌తో ఒక్కసారిగా పనులు నిలిచిపోవడంతో మాకు దిక్కు తోచలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఎక్కడ ఉండాలో తెలీదు. అందుకే నడక మొదలు పెట్టాం''అని పానిపట్‌కు చెందిన రోహిత్ తెలిపారు.

**బస, ఆహారం ఏర్పాటు చేయండి**

వలస కార్మికుల కష్టాలను తీర్చడానికి రంగంలోకి దిగిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి ఎక్కడి వారు అక్కడే ఉండే ఏర్పాట్లు చేయాలన్నారు. వారందరికీ బస ఏర్పాటు చేసి ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ఏర్పాట్లు చేస్తున్నా వందలాది మంది జట్లు జట్లుగా గమ్యస్థానాలకు బయల్దేరిపోతున్నారు. దీంతో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హైవే అధికారుల్ని వారు క్షేమంగా ఇళ్లకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యూపీలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళుతున్న వారి కోసం యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 300 బస్సుల్ని ఏర్పాటు చేసింది. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం కార్మికులు సురక్షితంగా స్వస్థలాలకి చేరడానికి 100 బస్సుల్ని ఏర్పాటు చేసింది. పాఠశాలలన్నింటినీ బసలుగా మారుస్తామని ఎవరూ ఎక్కడికీ వెళ్లవద్దని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కార్మికులకి విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రభుత్వానిదే బాధ్యత: రాహుల్**

వలస కార్మికుల దుస్థితికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రజల్ని ఇలాంటి పరిస్థితుల్లోకి నెట్టేయడం అతి పెద్ద నేరమని చెప్పారు. ఈ సంక్షోభ పరిస్థితుల్లో నడుస్తూ వెళుతున్న వారందరికీ మద్దతుగా నిలవడం మన బాధ్యత. ఈ సమస్య మరింత దుర్భరంగా మారడానికి ముందే ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవాలి'' అని రాహుల్ ట్వీట్ చేశారు.

## ఢిల్లీ- ఘజియాబాద్ సరిహద్దుల్లో...


వృద్ధుడిని తమ సొంత గ్రామానికి మోసుకెళుతున్న కార్మికులు

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ కారణంగా అన్ని వ్యవస్థలూ మూసుకుపోవడంతో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు శనివారం తమ స్వస్థలాలకు పయనమయ్యారు. ఢిల్లీ–ఘజియాబాద్ సరిహద్దుకు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లో తమ ఊర్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే బస్సులు సరిపడా లేకపోవడంతో సీట్ల కోసం కార్మికులు తమలో తాము గొడవపడ్డారు. బస్సు నిండిపోయాక, బస్సు పైన కూడా కూర్చొని ప్రయాణం చేయడానికి సిద్ధమయ్యారు. బస్సుల్లో పరిస్థితి లాక్‌డౌన్ ఏమాత్రం అమలవుతున్నట్లుగా కనిపించడం లేదు. కొంత మంది ముఖాలకు మాస్కులు పెట్టుకున్నప్పటికీ అందులో ఎక్కువ కర్చీఫులనే కట్టుకొని కనిపించారు. ఢిల్లీలోని చార్కి దాద్రి నుంచి 110 కిలోమీటర్లు నడిచి సరిహద్దు వరకు చేరుకున్న సంతోశ్ సింగ్ (23)కు బస్సులో సీటు దొరకలేదు. దీంతో మరో 20 కిలోమీటర్లు నడిచి లాల్ కౌన్‌కు చేరుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడి నుంచైనా బస్సు దొరుకుతుందనే ఆశతో నడిచి వెళుతున్నట్లు చెప్పాడు. సరిహద్దుల వద్ద పోలీసులు ఉన్నప్పటికీ కార్మికులు ఎక్కువగా ఉండటంతో నియంత్రించలేకపోతున్నారు. ఎంత మంది సరిహద్దు దాటి రాష్ట్రంలోకి వచ్చారన్న విషయాన్ని కూడా చెప్పలేమని వారు పేర్కొన్నారు.

## వెంటిలేటర్ల తయారీలోకి మారుతీ!

**న్యూఢిల్లీ:** దేశీయ ఆటో దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా... కరోనావైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు వెంటిలేటర్స్, మాస్కుల తయారీ చేపట్టనుంది. భారత ప్రభుత్వం కోరిక మేరకు వెంటిలేటర్స్, మాస్కులు, పీపీఈలను తయారు చేసేందుకు అగ్వా హెల్త్‌కేర్ కంపెనీతో కలిసి పనిచేస్తామని మారుతీ సుజుకీ ప్రకటించింది. నెలకు 10,000 యూనిట్ల వెంటిలేటర్లను తయారు చేయాలని లక్ష్యిస్తున్నట్లు కంపెనీ తెలియజేసింది. మారుతీ తయారు చేసే వెంటిలేటర్స్‌కు తగిన టెక్నాలజీని అగ్వాహెల్త్ కేర్ అందించనుంది. ఈ వెంటిలేటర్స్ తయారీకి కావాల్సిన నగదు, ప్రభుత్వ పరమైన అనుమతులన్నింటిని మారుతీ సుజుకీ భరించి అగ్వా హెల్త్‌కేర్‌కు ఉచితంగా అందించనుంది. మూడు పొరల మాస్కులను తయారు చేసి హరియాణ, కేంద్ర ప్రభుత్వాలకు సరఫరా చేయనుంది కూడా. ఇంకా భారత్ సీట్స్ లిమిటెడ్‌తో కలిసి వైరస్ నుంచి రక్షణ కల్పించే క్లాత్‌ను తయారు చేయనుంది.

## ఇక 'పిట్ స్టాప్' ఉచిత మరమ్మతు సేవలు

- ఎటువంటి ఖర్చులేకుండానే ఉచిత మరమ్మతు సేవలు
- 9 నగరాల్లో అత్యవసర సేవల విభాగంలో పనిచేస్తున్న వారికి మాత్రమే

**బెంగళూరు:** కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌తో ఎక్కడికక్కడే ప్రజాజీవనం స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో డెలివరీ సిబ్బంది, అగ్నిమాపక, పోలీస్, అంబులెన్స్, వైద్యులు, వైద్య సిబ్బంది వంటి అత్యవసర విభాగాల్లో పనిచేసే వ్యక్తులు ఉపయోగించే వాహనాలు మధ్యలో ఆగిపోతే వారికి ఉచిత మరమ్మతు సేవలందించేందుకుగాను పిట్ స్టాప్ అనే సంస్థ ముందుకొచ్చింది. పిట్ స్టాప్ ఉచిత మరమ్మతు సేవల్ని పొందేందుకు గాను 626262 1234 నంబర్‌కు ఫోన్ గానీ, లేదా www.getpitstop.comను గానీ సంప్రదించవచ్చు. సమాచారం అందుకున్న పిట్ స్టాప్ సిబ్బంది తమ సంచార వాహనంతో వచ్చి సదరు వాహనాన్ని రిపేరు చేసి వెళ్లిపోతుందని సంస్థ ప్రతినిధులు శనివారం మీడియాకు తెలిపారు. ఈ సేవలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ, పుణె, హైదరాబాద్, చెన్నై, నోయిడా, గుర్గావ్, ఫరీదాబాద్ లలో మాత్రమే అందుబాటులో ఉంటాయని సంస్థ వివరించింది. ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో పనిచేస్తున్న వారందరికీ పిట్ స్టాప్ సంస్థ తరఫున సీఈవో మిహిర్ మోహన్ సెల్యూట్ చేసి అభినందించారు.

## ఐదు నిమిషాల్లోనే కరోనా టెస్ట్!

**అబాట్ ల్యాబ్స్ ఆవిష్కరణ**
**అనుమతులిచ్చిన యూఎస్ఎఫ్‌డీఏ**



కేవలం 5 నిమిషాల వ్యవధిలోనే కరోనా వైరస్ వ్యాధిని నిర్ధారించే ''రోగ నిర్ధారణ పరీక్ష కిట్''ను ఆవిష్కరించినట్లు అబాట్ ల్యాబొరేటరీస్ శుక్రవారం ప్రకటించింది. ID NOW COVID&19 అని పిలిచే ఈ పరీక్షతో అనుమానిత వ్యక్తులకు వ్యాధి సోకిందా లేదా అనే విషయాన్ని 5 నిమిషాల్లో తెలుసుకోవచ్చు. తాజాగా అమెరికా ఫెడరల్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) దీనికి అనుమతులిచ్చినట్లు సంస్థ తెలిపింది. ఈ పరీక్షలను అన్ని ఫిజీషియన్స్ ఆఫీసులు, అత్యవసర సంరక్షణ క్లినిక్‌లు, హాస్పిటల్‌లో సులభంగా జరపవచ్చని పేర్కొంది. ప్రపంచదేశాలను కబళిస్తున్న కరోనా వైరస్ అమెరికాలో తీవ్రరూపం దాల్చింది. ఇక్కడే అత్యధిక కేసులు నమోదయ్యాయి. దీంతో స్థానికులు కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు వస్తున్నారు. వేలాదిగా వస్తున్న ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయలేక వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అబాట్ ల్యాబొరేటరీస్ కిట్‌కు యూఎస్ఎఫ్‌డీఏ తన అత్యవసర అధికారాలను వినియోగించి ఈ కిట్‌కు వేగంగా అనుమతులిచ్చింది. సోమవారం నుంచి అందుబా టులోకి! వచ్చే వారం సోమవారం నుంచి పరీక్షలను ప్రారంభించే యోచనలో ఉన్నామని, రోజుకు 50 వేల వరకు పరీక్షలను జరిపే అవకాశం ఉంటుందని అబాట్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతానికి ID NOW COVID&19 పరీక్ష అమెరికాకు మాత్రమే పరిమితమవుతుంది. అవసరాన్ని బట్టి భారత్ సహా ఇతర దేశాలకు అందుబాటులోకి తీసుకొస్తామని కంపెనీ పేర్కొంది. ''ఇది అత్యుత్తమైన ముందడుగు. 5 నిమిషాల్లోనే పాజిటివ్ ఫలితాన్ని, 13 నిమిషాల్లో నెగెటివ్ ఫలితాన్ని పొందవచ్చు. ప్రస్తుత పరీక్షలకు 1–2 రోజుల సమయంతో పాటు ఖర్చు కూడా ఎక్కువే అవుతోంది. మా కిట్‌తో ఈ సమస్య తగ్గుతుంది'' అని అబాట్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ జాన్ ఫ్రీల్స్ చెప్పారు.

## లాక్‌డౌన్‌తో ఉపాధి కరువై..


శ్రీశైలం (ఫైల్)

**మొయినాబాద్:** లాక్‌డౌన్‌తో ఉపాధి కరువై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అమీర్‌గూడకు చెందిన మేకగూడెం శ్రీశైలం (38) గ్రామంలోనే కూలి పని చేసి కుటుంబాన్ని పోషించేవాడు. కరోనా నేపథ్యంలో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో వారం రోజులుగా పని దొరకలేదు. దీంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నానని మనస్తాపం చెందిన శ్రీశైలం శనివారం ఉదయం గ్రామ శివారులో వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబసభ్యులకు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్రనాథ్ తెలిపారు.

## పశుగ్రాసం అధిక ధరకు విక్రయిస్తే..

**91212 13220 నంబర్‌కు ఫిర్యాదు చేయండి: తలసాని**



**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్ నెపంతో ఎవరైనా పశుగ్రాసం, దాణాను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. అలాంటి వారిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో శాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ రాంచందర్, డెయిరీ ఎండీ శ్రీనివాస్‌రావుతో సమావేశమయ్యారు. తలసాని మాట్లాడుతూ.. దాణా కిలో రూ.22 నుండి 25, పచ్చిగడ్డి రూ.2 నుండి 2.50, వరిగడ్డి రూ.5 నుండి 6.50 వరకు, కుట్టి రూ.7 నుండి 7.50 వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. ఇంతకంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే 91212 13220 నంబర్‌కు రైతులు ఫిర్యాదు చేయాలని సూచించారు.


**సాక్షి పెళ్ళిచూపులు**

**వధువు కావలెను**



కమ్మ/సెకండ్/41 సం॥లు/6''/Well సెటిల్డ్ గల వరుడుకు తగిన వధువు కావలెను సంప్ర॥ (నో బ్రోకర్స్) 95428 01745 [R-326]

★ ఆర్య వైశ్య/37 Yrs/B.Tech / వెల్‌సెటిల్డ్ /4 Cr ప్రాపర్టీ/Minimum Any Degree చేసిన అందమైన అమ్మాయి కావలెను. డైరెక్ట్ : దిల్‌సుఖ్‌నగర్ : 8125898999 [H-742351]

**వరుడు కావలెను**



రెడ్డి విడో 36y పెద్ద స్థిరాస్థి కలిగిన ఫ్యామిలీ లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను (అర్జెంట్). (ఆస్థి, కుల పట్టింపు లేదు). Whatsapp : 72072 14721 [V- 2678]

కమ్మ 42y మంచి స్థిరాస్థి కలిగిన ఒంటరి వధువుకు వరుడు కావలెను. (వయస్సు, కుల పట్టింపు లేదు). Whatsapp : 90105 43653 [V- 2054]

★ SC మాల/హిందు/MCom/ 35 Yrs / 5'1" / Fair / Govt. Jr College / Hyd/ Contract Jr. Lecturer Job/ 37000/- PM /వధువుకి తగిన వరుడు కావలెను. డైరెక్ట్. ఫోన్ : 9949594536 [HA-742275]

SC ఆది ఆంధ్ర/ ఇంటర్ పాస్ /39y / 5'3"/ లేట్ మ్యారేజ్/ వధువుకి Hyd లో 50K పైన జీతం ఉన్న అప్పర్ క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. డైరెక్ట్. 9849301924 [H-733723]

**వేదికలు**



వైజాగ్‌లో రెడ్డీస్ వివాహ పరిచయ వేదిక www.reddysvaradhi.com నందు కాల పరిమితిలేని రూ. 1116ల రిజిస్ట్రేషన్ ఫీ. తదుపరి సేవలు ఉచితం. Contact : 9440599599, 9492516677 [HA-747420]

Best Jodi మ్యారేజ్ కన్సల్టెన్సీ. పరిచయం మాది పరిశీలన మీది ఆల్ Casts, సాఫ్ట్‌వేర్, Govt. జాబ్ ప్రొఫైల్స్ కలవు. Ph: 9652278729 [HA-5419]

కేవలం వెలమవారు మొదటి, రెండవ వివాహ సంబంధాల కొరకై నేరుగా వ్యక్తులు మాత్రమే సంప్రదించండి. Hyd : 9848068336 [HA-742759]

రెడ్డి వివాహ సంబంధముల కొరకు మీ ఫోటో బయోడేటాలను వాట్సప్ చేయండి. లేదా ఫోన్ చేయండి. రాణి Ph: 9393701675. [H-742173]

Free రిజిస్ట్రేషన్ బ్రాహ్మణ మరియు అన్ని కులాల వధూ–వరులకై (Whatsapp your photo & Bio data - 9533608887) ఫోన్: 9704656103 [HA-1395]

FREE REGISTRATION (online/ Whatsapp / Phone Call) 50,000 సంబంధాలు కలిగిన ఏకైక సంస్థ. 97016 59125 www.jeelakarrabellam.com [G-519]

బాబురావు మ్యారేజిబ్యూరో: మాల, మాదిగ స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, M.S, MD, Govt JOBS, SWE, USA, Group-I, II. Cell: 7893013265. [W-1084518]

★ RK ముదిరాజ్ మ్యారేజ్ బ్యూరో 1వ, 2వ, లేటు & అబ్రోడ్ ముదిరాజ్ కులస్థులకు మాత్రమే పెళ్ళి సంబంధములు చూపబడును. సంప్రదించండి Ph: 6304693427, 8106807528. [H-742172]

రెడ్డి, వైశ్య, మున్నూరుకాపు, ముదిరాజ్, యాదవ్, పద్మశాలి కులముల వారికి మరియు సెకెండ్ మ్యారేజ్‌లు 15 రోజుల్లో పెండ్లి సంబంధాలు కుదుర్చబడును. 8340917965 [H-742463]

**గమనిక**

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాల ను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు**

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines 385/- Extra Line | Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line
Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line | * Color 25% Extra
గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.
3+3 3 ప్రకటనలకు చెల్లించండి 3 ప్రకటనలు ఉచితంగా పొందండి

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | :99122 20764 | తిరుపతి | :99122 20584 | తాడేపల్లి గూడెం | :99122 20558 |
| కరీంనగర్ | :9705933396 | కడప | :99516 02932 | రాజమండ్రి | :99122 20358 |
| వరంగల్ | :99516 02868 | అనంతపూర్ | :99122 20718 | విజయవాడ | :9912225442 |
| నల్గొండ | :95055 08382 | కర్నూల్ | :99122 20575 | గుంటూరు | :99122 20349 |
| మహబూబ్‌నగర్ | :99516 02829 | శ్రీకాకుళం | :99122 20343 | ఒంగోలు | :99122 25431 |
| ఖమ్మం | :99122 20596 | విశాఖపట్నం | :99122 20550 | నెల్లూరు | : 99516 02861 |

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.
6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912377533.


రాష్ట్రీయం

# హైకోర్టులో ఈ-ఫైలింగ్‌కు మార్గదర్శకాలివీ..



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ తీవ్రరూపంలో ఉన్న నేపథ్యంలో హైకోర్టు అతి ముఖ్యమైన కేసుల నమోదుకు, విచారణ కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ–ఫైలింగ్ విధానాలను తెలియజేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ వివరాలు ఇలా...

- అత్యవసర కేసులను దాఖలు చేసే న్యాయవాదులు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ఈ–మెయిల్ ద్వారా పంపాలి. కేసుకు సంబంధించిన అన్ని పత్రాల పైన న్యాయవాది, పిటిషనర్లు సంతకాలు చేయాలి.
- అలా చేసిన పిటిషన్‌ను పీడీఎఫ్ రూపంలో ఈ మెయిల్ చేయాలి. అదే ఈమెయిల్‌లో కేసు దాఖలు చేసిన న్యాయవాది, పిటిషనర్ పేర్లు, న్యాయవాది కోడ్ నంబర్, ఈమెయిల్ ఐడీ, సెల్ ఫోన్ నంబర్లను కూడా పంపాలి.
- ఇలా దాఖలయ్యే పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి స్వయంగా పరిశీలించి విచారణయోగ్యమైన వాటిని ఎంపిక చేస్తారు. విచారణ చేయాలని నిర్ణయించిన కేసుల గురించి, విచారణ జరిపే తేదీ తదితర సమాచారాన్ని న్యాయవాది మొబైల్ నెంబర్‌కు మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది.
- విచారణ చేయాలని నిర్ణయించిన కేసుల్లో న్యాయవాది లేదా పిటిషనర్ వారిళ్ల వద్ద నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించాలి. ఈ విధంగా చేసేందుకు వీలుకాకపోతే బేగంపేటలోని సీఎం క్యాంపు కార్యాలయం పక్కన మూడో క్వార్టర్‌లోని కంట్రోల్ రూం నుంచి వాదనలు వినిపించవచ్చు.
- వీడియో కాన్ఫరెన్స్ కోసం న్యాయవాది లేదా పిటిషనర్ 'జూమ్ క్లౌడ్ మీటింగ్స్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. న్యాయవాది లేదా పిటిషనర్ ఫోన్‌కు లింక్ అందాక కోర్టు హాలుతో అనుసంధానం అయ్యాక వాదనలు వినిపించాలి.
- ఇరుపక్షాల వాదనల తర్వాత కోర్టు రూంలోని కోర్టు మాస్టర్‌కు న్యాయమూర్తులు ఉత్తర్వులు చెబుతారు. ఆ ఉత్తర్వుల ప్రతిపై న్యాయమూర్తితో పాటు హైకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రార్ సంతకాలు చేశాక హైకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- దీనినే హైకోర్టు ఉత్తర్వులుగా పరిగణించాలి. సాంకేతిక సమస్యలు వస్తే హైకోర్టు రిజిస్ట్రార్ (ఐటీ)కు ఫోన్ లేదా ఈ మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.
- కరోనా వైరస్ నేపథ్యంలో విధించిన ఈ ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత పరిస్థితులన్నీ అదుపులోకి వచ్చాక పిటిషనర్లు, ప్రతివాదులు తమ వాదప్రతివాదనల ప్రతులను హైకోర్టుకు ఇప్పుడున్న విధానంలో అందజేయాలి.
- కేసులు పరిష్కారం అయినా, అవ్వకపోయినా వాటికి చెందిన పత్రాలను హైకోర్టులోని ఫైలింగ్ విభాగంలో దాఖలు చేయాలి.
- ఈ–ఫైలింగ్‌కు హైకోర్టు కేటాయించిన మెయిల్ ఐడీ reg.gen-tshc@aij.gov.inకు వివరాలు పంపాలి.

## పంటల తరలింపు
# బాధ్యత తీసుకోండి

**జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్‌లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



**సాక్షి, హైదరాబాద్:** రైతులు పండించిన పంటను గ్రామ కొనుగోలు కేంద్రాలకు తరలించడంతో పాటు వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంలో జిల్లా, మండల గ్రామాల రైతుబంధు సమితి అధ్యక్షులు క్రియాశీలక పాత్ర నిర్వహించాలని తెలంగాణ రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కరోనా వ్యాధి కట్టడిలో భాగంగా సీఎం ఆదేశాల మేరకు పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామ కొనుగోలు కేంద్రంలో గోనెసంచులు, కాంటాలు, టార్పాలిన్ (తాడిపత్రి)లను తగు సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధాన్యం తీసుకుని వచ్చే రైతులు సామాజిక దూరం పాటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద చేతులు శుభ్రం చేసుకోవడానికి సబ్బులు, శానిటైజర్లు, నీటిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు పలు విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. వరి, మొక్కజొన్న కోత యంత్రాలు గ్రామాల్లోకి రావడానికి తమ అనుమతులను తీసుకోవడానికి రైతులకు సహాయ సహకారాలను అందించాలన్నారు. వెటర్నరీ మందుల దుకాణాలను, విత్తన, ఎరువుల పురుగు మందుల దుకాణాలను తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న పామాయిల్ ఉత్పత్తి కంపెనీని నడిచే విధంగా చూడాలన్నారు. రైతుబంధు సమితి సభ్యులు, తమ గ్రామాలలోని రైతులు పండించిన పంటంతా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న భరోసా కలిగించాలన్నారు.

## జేఎన్ఏఎఫ్ఏయూ ఇన్‌చార్జి వీసీగా చిత్రా రామచంద్రన్



**సాక్షి, హైదరాబాద్:** జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా (వీసీ) విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల కిందటే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమించిన ప్రభుత్వం జేఎన్ఏఎఫ్ఏయూకు నియమించలేదు. ఎట్టకేలకు ఆ వర్సిటీకి కూడా ఇన్‌చార్జి వీసీని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

## పల్లెల్లో అప్రమత్తంగా ఉండండి

- 'సామాజిక'దూరం పాటించేలా చూడండి: కేంద్రం
- ఉపాధి కూలీల బకాయిలను విడుదల చేస్తున్నాం
- శానిటైజర్లు, మాస్కులు, సబ్బులు తయారు చేసేలా మహిళలకు ప్రోత్సాహం
- కలెక్టర్లను ఆదేశించిన కేంద్ర గ్రామీణ, పంచాయతీరాజ్ కార్యదర్శులు

**సాక్షి, హైదరాబాద్:** మానవాళికి పెనుసవాల్‌గా పరిణమించిన కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర గ్రామీణ, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శులు రాజేశ్ భూషణ్, సునీల్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కరోనా నియంత్రణలో గ్రామ పంచాయతీల పాత్ర కీలకమని, ఇందులో పంచాయతీరాజ్ వ్యవస్థలోని మూడంచెల ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. లాక్‌డౌన్ రోజుల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా చూడాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని.. కూరగాయలు, పాల దుకాణాలు, షాపులు, బ్యాంకులు, ఏటీఎంలు, పెట్రోలు పంపులు, వంట గ్యాస్ కేంద్రాల్లో సామాజిక దూరం పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కొత్తవారెవరైనా వచ్చినా, విదేశాల నుంచి పౌరులు వచ్చినా తక్షణమే ఆ సమాచారాన్ని స్థానిక పాలనా వ్యవస్థతో పంచుకోవాలని సూచించారు. ఒకవేళ కరోనా వైరస్ లక్షణాలైన దగ్గు, తుమ్ములు, జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే ఆస్పత్రులకు లేదా స్వీయ నిర్బంధం చేయాలన్నారు. అనుమానాస్పద కేసులను ఆలస్యం చేయకుండా క్వారంటైన్ చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు శానిటైజర్లు, మాస్కులను, సబ్బులను ఉత్పత్తి చేసేలా ఆరోగ్య శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు.

**ఉపాధి కూలీలకు ప్రభుత్వ సాయం...**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని చెప్పారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పథకాల కింద బకాయిలను తక్షణమే చెల్లిస్తున్నామని, ఏప్రిల్ 15లోగా అన్ని నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు వేతనాలు పెంచడమే కాక, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లను అదనంగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహిళలకు జన్‌ధన్ ఖాతాల్లో రూ.500 నగదు జమ చేస్తున్నామని తెలిపారు.

సాక్షి 24|7 నల్లగొండ
NALGONDA DISTRICT
ఆదివారం । 29 । మార్చి । 2020

## హోం క్వారంటైన్‌ను పాటించాలి

**కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**



**నల్లగొండ :** ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న వారు తిరిగి వచ్చి హోంక్వారంటైన్‌లో ఉన్నవారు నిబంధనలు ఉల్లంఘించి తప్పించుకుని తిరుగుతున్న ఏడుగురిని జిల్లాయంత్రాంగం గుర్తించి ఎంజీయూనివర్సిటీలోని క్వారంటైన్‌కు తరలించినట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. ఎవరైనా హోం క్వారం టైన్ ఉల్లంఘించి తిరిగితే కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూం టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1442, ల్యాండ్‌లైన్ 08682 –244151 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

## న్యూస్‌రీల్

### వ్యవసాయ ఉత్పత్తులకు ఎలాంటి ఆంక్షలు లేవు : ఎస్పీ



**నల్లగొండ క్రైం :** కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా లాక్‌డౌన్ చేసిన నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తులకు ఎలాంటి ఆంక్షలు లేవని, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమతి తీసుకొని వెళ్లవచ్చని నల్లగొండ ఎస్పీ రంగనాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయ పనులకోసం యంత్రాలు తీసుకొని వారి క్షేత్రాలకు వెళ్లవచ్చని, కిరాణం షాపు వ్యాపారులు ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతి తీసుకోవాలన్నారు. రైతులు బత్తాయి, పుచ్చకాయ, కూరగాయలు, నిత్యావసర వస్తువులు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పోలీస్‌స్టేషన్ల వారీగా అనుమతి ఇచ్చి ట్రాక్టర్లకు పాస్‌లు జారీ చేయాలన్నారు. రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

**బలవంతంగా చిట్టీ పైసలు వసూలు చేయొద్దు**

లాక్‌డౌన్ కారణంగా చిట్టీ వ్యాపారులు బలవంతంగా డబ్బులు వసూలు చేయొద్దని నల్లగొండ ఎస్పీ రంగనాథ్ ఆదేశించారు. చిట్టీ వ్యాపారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

### అధిక ధరలకు అమ్మితే చర్యలు

**చండూరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని నల్లగొండ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. శనివారం చండూరు మున్సిపల్ కేంద్రంలోని కూరగాయలు, కిరాణం దుకాణాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు లాక్‌డౌన్ పాటించాలన్నారు. ఉదయం పూట కుటుంబానికి ఒక్కరు చొప్పున బయటకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలన్నారు. సాయంత్రం 7 నుంచి తెల్లారి 7వరకు ఎవ్వరూ బయటకు రాకూడదన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్ తోకల వెంకన్న తదితరులు ఉన్నారు.

### అన్నం పెట్టి.. ఇంటికి పంపిన పోలీసులు



పోలీస్‌స్టేషన్‌లోనే అన్నం తింటున్న కుటుంబసభ్యులు

**చిట్యాల :** సూర్యాపేట జిల్లా నూతనకల్‌కు చెందిన ఇద్దరు వృద్ధులు, ఓ మహిళ, ఇద్దరు చిన్నారులంతా కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామం వెళ్లేందుకు లారీలో శనివారం బయలుదేరారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు రాగానే పోలీసులు వీరు ప్రయాణిస్తున్న లారీని నిలిపివేశారు. దీంతో చేసేది ఏమీలేక వారు అక్కడి నుంచి కాలినడకన చిట్యాలలోని పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కాలినడకన రావడంతో వారు విపరీతమైన అలసటతో ఆకలితో ఇబ్బందులు పడుతూ పోలీస్‌స్టేషన్‌లోని ఆవరణలోనే ఉండిపోయారు. దీంతో వీరిని గమనించిన మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ చలించిపోయి తన ఇంటిలో వండుకున్న భోజనాన్ని వెంటనే తీసుకొచ్చి వారికి అందించి వారి ఆకలి తీర్చింది. అంతేగాకుండా వారిని పోలీసులు ఒక వాహనంలో స్వగ్రామానికి పంపించారు.

### కరోనా కట్టడికి కలిసికట్టుగా పోరాడాలి



వృద్ధులకు టోన్డ్ పాల ప్యాకెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

**కొండమల్లేపల్లి (దేవరకొండ) :** కరోనా వైరస్ కట్టడికి ప్రజలంతా కలిసికట్టుగా పోరాడాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, టోన్డ్ పాల ప్యాకెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని, లాక్‌డౌన్‌లో పని చేస్తున్న పోలీసులు, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా మహమ్మారి నుంచి మనల్ని మనం రక్షించుకోవడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన ఆదేశాలను అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, తహసీల్దార్ వెంకటేశ్, టి.వి.ఎన్.రెడ్డి, ఇలియాస్, సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సేవకులు!

## కరోనాపై పోరులో మేము సైతం అంటున్న పారిశుద్ధ్య కార్మికులు

- పొద్దస్తమానం వీధుల్లోనే.. పరిశుభ్రతలో వీరిది కీలకపాత్ర
- అరకొరగా రక్షణ పరికరాలు
- తాగునీటికి తీవ్ర ఇబ్బందులు
- కరోనా భయంతో చుట్టుపక్కల వారు కూడా కనికరించని వైనం



**ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు బట్టు ఎల్లమ్మ. నల్లగొండ పట్టణంలోని ఔట్ డోర్ స్టేడియం దగ్గర నివాసం ఉంటుంది. నల్లగొండ మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్‌గా పని చేస్తుంది. ప్రజా రవాణా ఉన్న సమయంలో రోజూఆటోలో ఎక్కి రామగిరికి చేరుకునేది. ఇప్పుడు ఆటోలు లేకపోవడంతో నడిచి వచ్చి విధులకు హాజరవుతుంది. తెల్లవారుజామున నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిండి తిప్పలు లేకపోవడంతో కడుపులో గాబర అవుతుందని ఎల్లమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 'వేసవి కాలంలో తాగడానికి గిన్ని మంచి నీళ్లు కూడా ఎవరు పోయడంలేదు. అన్నింటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది' అని ఈ మహిళ చెబుతోంది.**



నల్లగొండ పట్టణంలో బ్లీచింగ్ పౌడర్, రసాయన ద్రావణం పిచికారీ చేస్తున్న కార్మికులు

**నల్లగొండ టూటౌన్ :** కరోనా వైరస్ కట్టడి కోసం మున్సిపాలిటీల్లో పొద్దస్తమానం పారిశుద్ధ్య కార్మికులు వీధులను శుభ్రం చేస్తున్నారు. తమ ఇంటిల్లిపాదిని వదిలి, కరోనా వైరస్‌ను సైతం లెక్క చేయకుండా తెల్లవారుజామున 3 గంటలకే లేచి వారు నివాసం ఉంటున్న ప్రాంతాల నుంచి కాలినడకన పనులు చేసే వార్డులకు చేరుకుంటున్నారు. బయోమెట్రిక్ హాజరు వేసి ఉదయం 5 గంటలకు విధుల్లో చేరాల్సి ఉండడంతో 3 గంటలకు నిద్ర లేవాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజారవాణా బంద్ కావడంతో కార్మికులకు నడక తప్పడం లేదు. ప్రజల కోసం పట్టణాలను పరిశుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు నేడు తాగునీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్మికులు వివిధ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు, డ్రెయినేజీలు పూడిక తీయడం, చెత్త తీసుకుపోవడం లాంటి పనులు చేస్తున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో కార్మికులు 8 నుంచి 9 గంటల వరకు శానిటేషన్ పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలైన నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, చండూరు, హాలియా, చిట్యాల మున్సిపాలిటీల్లో దాదాపు 1090 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా కరోనా వైరస్ కారణంగా నానా ఇబ్బందులు పడుతున్నారు.

**ఆటోలు లేక అవస్థలు..**

ప్రధాన పట్టణాలు అయిన నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ లాంటి మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కావడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఉదయం 5 గంటలకు బయోమెట్రిక్ హాజరు పూర్తి చేసుకొని వారికి కేటాయించిన వార్డుల్లో పనులు చేపట్టాల్సి ఉంటుంది. నల్లగొండ, మిర్యాలగూడ లాంటి మున్సిపాలిటీల పరిధి భారీగా విస్తరించి ఉండడంతో వారికి రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక ప్రాంతం నుంచి వారికి కేటాయించిన వార్డుకు చేరుకోవాలంటే ఐదారు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుంది. గతంలో ఆటోల్లో వెళ్లేవారు. నేడు ఆటోలు బంద్ కావడంతో నడిచి వెళ్లడానికి గంట సమయం పడుతుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కార్మికులకు తాగునీటివసతి, అల్పాహారం (టిఫిన్), చాయ్ (టీ) లాంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున వచ్చిన కార్మికులు మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి చేరుకునే దాకా వారు తిండి లేక పస్తులు ఉండాల్సి వస్తోంది.

### అరకొరగా రక్షణ పరికరాల పంపిణీ..

ప్రపంచాన్ని హడలెత్తిస్తున్న కరోనా మహమ్మారికి భయపడకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులకు వారి రక్షణ విషయంలో మున్సిపాలిటీలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. కార్మికులందరికీ సరిపడా రక్షణ పరికరాలు సమకూర్చకపోవడంతో వారు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న వాటిని కూడా అందించకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమేనని విమర్శలు వస్తున్నాయి. ప్రధాన మున్సిపాలిటీలు అయిన నల్లగొండ, మిర్యాలగూడలో మాస్కులు, చేతి గ్లౌజులు కార్మికులకు పంపిణీ చేయగా, కొత్త మున్సిపాలిటీల్లో మాత్రం కార్మికులందరికీ రక్షణ పరికరాలు అందించడంలేదు. దీంతో కొంత మంది కార్మికులు రక్షణ పరికరాలు లేకుండానే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.



ఈయన పేరు దాసరి కుమార్. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటాడు. లాక్‌డౌన్ లేనిసమయంలో ఆటో ద్వారా రామగిరికి చేరుకునే వాడు. ఇప్పుడు ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో నడిచి వెళ్లి విధుల్లో చేరుతున్నాడు. కాలనీల్లో కనీసం తాగునీరు ఇవ్వడం లేదు. ఉదయం 3 గంటలకు లేచి కాలినడకన రామగిరికి వచ్చి తమ పని పూర్తయిన తరువాత 2 గంటలకు ఇక్కడి నుంచి వెళ్లి ఇంటికి వెళ్లే సరికి మూడు గంటలు అవుతుంది. 'కనీసం టిఫిన్, చాయ్ కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 8 నుంచి 9 గంటల పాటు తిండి, తిప్పలు లేకుండా ఉండాలంటే నీరసానికి గురవుతున్నాం. కరానా వైరస్ కారణంగా తమకు కాలనీల్లో మంచి నీళ్లు ఇవ్వడానికి భయపడుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

# పూరా... బంద్!

- విజయవంతమవుతున్న స్వీయ నిర్బంధం
- రోడ్లన్నీ నిర్మానుష్యం
- తగ్గిపోయిన కొనుగోలు దారులు
- దవాఖానాల వద్ద కనిపించని జనాలు

**సాక్షి ప్రతినిధి నల్లగొండ :** లాక్‌డౌన్ విజయవంతంగా కొనసాగుతోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు స్వీయ నిర్బంధం పాటిస్తూ .. ఇళ్లకే పరిమితం అవుతున్నారు. కూరగాయల మార్కెట్లు, కిరాణం షాపులు , పండ్ల దుకాణాలు, మెడికల్ షాపులు మినహా, అన్ని బంద్ కావడంతో ప్రధాన రోడ్లపైన, కాలనీల వీధుల్లో కూడా జనాలు కనిపించడంలేదు. అవసరమైతే తప్ప బయటికి రావడం లేదు. మొదట్లో షాపులపై ఎగబడి కొనుగోలు చేసినా ఇప్పుడా పరిస్థితి లేదు. జిల్లా వ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రశాంతంగా కొనసాగుతోంది. పోలీసులు కూడా అనవసరంగా రోడ్లపైకి రావద్దంటూ హెచ్చరికలు చేస్తుండడంతో ఎవరూ బయటికి రావడం లేదు. అక్కడక్కడా మాస్కులు లేకుండా, ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు ఉన్నా, అవసరం లేకున్నా చిన్న కారణాలతో బయటికి వస్తున్న వారిపై లాఠీలు ఝులిపిస్తున్నారు. కొందరు తప్పని పరిస్థితిలో బయటికి వస్తున్నా తిరిగి వెంటనే ఇళ్లకు చేరుకుంటున్నారు.

**తగ్గిన కొనుగోళ్లు**

లాక్‌డౌన్ ఏప్రిల్ 15వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో జనాలు ముందే నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు. దీంతో కిరాణాషాపులు, ఇతర మాల్స్ వద్ద కూడా జనాలు తగ్గారు. కూరగాయల మార్కెట్లు కూడా పట్టణానికి నలువైపులా ఏర్పాటు చేయడంతో అక్కడ కూడా జనాలు తగ్గిపోయారు.

**వైరస్ నివారణకు కెమికల్ స్ప్రే**

పట్టణాలు , గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు వైరస్ నివారణకు కెమికల్ చల్లుతున్నారు. బ్లీచింగ్ పౌడర్‌తోపాటు సున్నం చల్లుతూ పరిసరాలలో వైరస్ నివారణకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు చర్యలు తీసుకుంటున్నాయి. సోడియం హైడ్రోక్లోరైడ్ ద్రావణాన్ని వైరస్ నివారణ మున్సిపాలిటీలతోపాటు గ్రామాల్లో కూడా చల్లించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ ద్రావణం చల్లడం వల్ల వైరస్ త్వరితగతిన చనిపోతుందని చెబుతున్నారు. దాన్ని తెప్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది.



మూసివేయడంతో నిర్మానుష్యంగా ఉన్న ప్రకాశంబజార్‌లోని కూరగాయల మార్కెట్

**ఇళ్లలోనే ఆటలు**

కరోనా కారణంగా విద్యాసంస్థలకు సెలవులు వచ్చాయి. మరో వైపు ప్రభుత్వ కార్యాలయాలకు 20 శాతం మంది ఉద్యోగులు మాత్రమే హాజరు కావాలని ప్రభుత్వం సూచించింది. అత్యవసర శాఖల మినహా మిగతా వారంతా అందుబాటులో ఉంటూ గృహాలకే పరిమితమవుతున్నారు. లాక్‌డౌన్ వల్ల షాపులతోపాటు కూలీ పనులు కూడా బంద్ కావడంతో వారుకూడా ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులంతా ఇళ్లలోనే ఉంటూ క్యారం, చెస్ ఆటలు ఆడుతూ గడుపుతున్నారు. మద్యం దుకాణాలు బంద్ అయిపోయాయి. దీంతో బ్లాక్‌లో ప్రయత్నించినా అధిక ధరలు. ఆ పరిస్థితిలో కాలనీల శివారు ప్రాంతం వారు గ్రామాలబాట పట్టి కల్లు కోసం వెదుకుతున్నారు. దీంతో కల్లుకు డిమాండ్ పెరిగి రేట్లు కూడా పెంచారు.

### సరిహద్దుల్లో పకడ్బందీగా తనిఖీలు

**దామరచర్ల (మిర్యాలగూడ) :** తెలంగాణ, ఏపీ సరిహద్దు ప్రాంతమైన వాడపల్లి వద్ద శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. లాక్‌డౌన్ నేపథ్యంలో రెండు ప్రభుత్వాలు రాష్ట్ర సరిహద్దు కేంద్రాలను మూసి వేశారు. దీంతో ఎలాంటి ప్రైవేట్ వాహనాల రాకపోకలను పోలీసులు అనుమతించడం లేదు. అత్యవసర వాహనాలను ధ్రువీకరణ పత్రాలు పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తున్నారు. వేలాది వాహనాలు వెళ్లే నార్కట్‌పల్లి–అద్దంకి రాష్ట్ర రహదారి నిర్మానుష్యంగా మారింది. మండల కేంద్రంలో దుకాణాలను మూసివేశారు. పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.





నందికొండ సరిహద్దు వద్ద అడ్డంగా పెట్టిన లారీ

**నాగార్జునసాగర్ :** ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు లోగల నాగార్జునసాగర్(నందికొండ) మున్సిపాలిటీ కాలనీలో కరోనా కోవిడ్–19 వైరస్ వ్యాప్తి కట్టడికిగాను లాక్‌డౌన్ పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. సరిహద్దులోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ప్రధాన రహదారికి అడ్డంగా లారీని పెట్టి ఎలాంటి వాహనాలు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.



లాక్‌డౌన్‌తో జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న మిర్యాలగూడ, దేవరకొండ రోడ్డు

## ప్రతి రెవెన్యూ గ్రామంలో..
# ధాన్యం కొనుగోలు కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రంలో ఎంపీ బడుగుల, కలెక్టర్ , ఎస్పీ, ఎమ్మెల్యేలు

- కొత్తగా 104 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రవాణా వసతి ఉన్న చోట కల్లాల వద్దే కొనుగోలు కేంద్రాలు
- కరోనా వైరస్... కొనుగోలుకు అడ్డు కాదు
- రైతులకు ఇబ్బంది కలగకుండా కేంద్రాల పెంపు
- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ధాన్యం కొనుగోలుపై సమీక్ష

**సాక్షి ప్రతినిధి నల్లగొండ :** రబీలో పండించిన పంటను సత్వరమే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కరోనా వైరస్ ధాన్యం కొనుగోలుకు ఏ రకంగా అడ్డు కాదని, అందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అయితే అదే సమయంలో రైతులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం రబీ కొనుగోళ్లపై మంత్రి జగదీశ్ రెడ్డి, కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షించారు. జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, శాసన సభ సభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య సమీక్షలో పాల్గొన్నారు. కరోనా మహమ్మారితో చేతికొచ్చిన పంట కొనుగోలుపై రైతుల్లో అనుమానాలు ఉన్నాయని, రైతులకు ఇబ్బంది జరగకుండా ప్రతి గింజనూ కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగానే జిల్లాలో మొత్తం 31 మండలాల పరిధిలోని 844 గ్రామ పంచాయతీలలో 563 రెవెన్యూ గ్రామాలుగా గుర్తించామని, ఇక్కడ 236 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తొలుత నిర్ణయించామన్నారు. కానీ, కరోనా వైరస్ వల్ల ఏర్పడిన లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో ఆ సంఖ్యను 340కి పెంచాలని నిర్ణయించామని చెప్పారు. జిల్లాలో వరి 1,26,450 హెక్టార్లలో సాగు చేయగా 5,96,960 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారని, అధికంగా పంట దిగుబడి వస్తాయని భావిస్తున్న 14 మండలాలు, మధ్యస్తంగా దిగుబడి వచ్చే అ వకాశం ఉన్న ఏడు మండలాలను గుర్తించామన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, అందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ కొలిచే యంత్రాలతో పాటు, ఎలక్ట్రానిక్ కాంటాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో దళారులు రైతులను మోసం చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు ధాన్యం రాకుండా చెక్‌పోస్ట్‌లలో భద్రత ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లా ఎఫ్‌సీఐ గోదాముల్లో పూర్తి నిల్వ సామర్థ్యం లేనందున ఇతర ప్రాంతాలకు తరలించి ధాన్యం నిల్వ చేస్తామని మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకరాగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్పీ ఏవీ రంగనాథ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

## స్థానికంగానే బత్తాయి, నిమ్మ విక్రయించాలి : గుత్తా

**నల్లగొండ రూరల్ :** కరోనా నివారణకు రైతులు జిల్లాలోనే స్థానికంగా బత్తాయి, నిమ్మ విక్రయించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. బత్తాయి, నిమ్మ ఎగుమతి లేకపోవడంతో జిల్లాకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రవాణా వసతికి అనుమతించాలని శనివారం రైతులు కోరడంతో ఆయన వెంటనే సీఎం కేసీఆర్‌తో మాట్లాడారు. కరోనా వైరస్ నివారణకు స్థానికంగానే బత్తాయి, నిమ్మ విక్రయించేలా తగిన మార్కెట్ వసతి కల్పించాలని, ఆ దిశగా రైతులను సమన్వయం చేయాలని గుత్తాకు సీఎం కేసీఆర్ సూచించారు. అంతర్ జిల్లాలో విక్రయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

## కడసారి చూపునకు నోచుకోని తనయులు

**ఆత్మకూరు(ఎం) (ఆలేరు) :** అనారోగ్యంతో మృతి చెందిన తన తల్లిని కడసారి చూపును చూడలేక పోయిన తనయుల ఉదంతం ఆత్మకూరు(ఎం) మండలంలోని రహీంఖాన్‌పేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కల్వల మంగమ్మ(45) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. మంగమ్మకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు మహేష్ గ్రామంలోనే ఉంటున్నారు. పెద్ద కుమారులు నరేష్, సురేష్ జీవనోపాధి నిమిత్తం చెన్నైలో ఉంటున్నారు. తల్లి మరణవార్త విని గ్రామానికి చెన్నై నుంచి రావడానికి విశ్వప్రయత్నం చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి వల్ల అక్కడి అధికారులు అడ్డుచెప్పడంతో అక్కడే ఆగిపోయారు. దీంతో చిన్న కుమారుడితో తలకొరివి పెట్టించి అంత్యక్రియలు చేశారు. కరోనాతో తన తల్లిని కడసారి చూసుకోలేకపోయామని కుమారులు ఆవేదన వ్యక్తం చేశారు.

## పోలీసుల అదుపులో నిందితులు

**నల్లగొండ క్రైం :** నార్కట్‌పల్లి – అద్దంకి రోడ్డులో నిధి పీవీసీ కంపెనీకి వెళ్లే దారిలో కొండమల్లేపల్లి మండలానికి చెందిన మారం వెంకట్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను నల్లగొండ రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. భార్య శ్రవంతితో సన్నిహితంగా ఉండే పానగల్‌కు చెందిన ఆటో డ్రైవర్ మరో ఇద్దరి సహకారంతో వెంకట్‌రెడ్డిని హత్యచేసినట్లు తెలుస్తుంది. డీసీఎంలో హైదరాబాద్‌కు వెళ్తున్న వెంకట్‌రెడ్డిని గమనించిన భార్య శ్రవంతితో సన్నిహితంగా ఉన్న వ్యక్తి మరో ఇద్దరితో కలిసి హైదరాబాద్ రోడ్డులో డీసీఎంను ఆపి కారులో తీసుకొచ్చి నిధి పీవీసీకి వెళ్లే రోడ్డులో కత్తితో పొడిచి హత్య చేసినట్లు సమాచారం. భార్యతో సన్నిహితంగా ఉన్న విషయం వెంకట్‌రెడ్డికి తెలిసిపోయిందని, ఎప్పటికైనా వెంకట్‌రెడ్డిని అడ్డుతొలగించకపోతే ఇబ్బంది కలుగుతుందని భావించిన ఆటో డ్రైవర్ హత్యకు ఒడిగట్టినట్లు తెలుస్తుంది.

## 'రైతులు అధైర్యపడొద్దు'

**సూర్యాపేట రూరల్ :** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ధాన్యం అమ్మకాల విషయంలో రైతులు అధైర్యపడొద్దని డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి, గాంధీనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి జగదీశ్‌రెడ్డి సూచనలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంటకోత తర్వాత తేమశాతం వచ్చేవరకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రానికి తీసుకొచ్చి సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఈఓ వాసు, డైరెక్టర్ మామిళ్ల యల్లయ్య, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ రాపర్తి సైదులు, నాయకులు సోమగాని లింగస్వామి, వల్లల సైదులు, చెరుకుపల్లి వెంకట్‌లాల్, బంగారి శ్రీను, గవ్వ కేశవరెడ్డి, పాశం కృష్ణారావు, సిబ్బంది వెంకటేష్, వెంకన్న ఉన్నారు. అనంతరం పిల్లలమర్రిలో ఉన్న ప్రభుత్వ గోదాములను పరిశీలించి మరమ్మతులు చేసి రైతుల అవసరాలకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

# విదేశాలనుంచి వచ్చిన వారికి జియో ట్యాగింగ్

**వలిగొండ (భువనగిరి) :** మండలంలోని వివిధ గ్రామాలకు ఇటీవల విదేశాల నుంచి వచ్చిన ఆరుగురు వ్యక్తులకు శనివారం మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వారికి కరోనా దృష్ట్యా జియో ట్యాగింగ్‌లు వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మాట్లాడుతూ.. కరోనా ప్రభావం దృష్ట్యా ప్రతిఒక్కరూ గృహ నిర్బంధంలో ఉండాలని, ఏమైనా లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చినట్లైతే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వారు తెలిపారు. ఈ ట్యాగింగ్ వల్ల వారి కదలికలు ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారులకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమలత, ఆరోగ్య పర్యవేక్షకులు నాచబోయిన నర్సింహ, శౌరి, వినోద్‌కుమార్, ప్రీతంబాబు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


హుజూర్‌నగర్‌లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఒకరు ఐసోలేషన్‌కు, ఇద్దరు క్వారంటైన్‌కు తరలింపు..**

**శాలిగౌరారం (నకిరేకల్) :** ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల్లో ఒకరిని ఐసోలేషన్‌కు, మరో ఇద్దరిని క్వారంటైన్‌కు తరలించడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన నూనెమూంతల అశోక్ ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో చదువుకుంటున్నాడు. జ్వరంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న వైద్యసిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు. శనివారం జ్వరం అధికమవడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వైద్యసిబ్బంది అతడిని నల్లగొండలోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని ఐసోలేషన్‌కు తరలించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన నిమ్మల వంశీ, పుట్ట మధు అనే యువకులు ముంబయిలో ఉంటూ రెండు రోజుల క్రితం ఎన్‌జీ కొత్తపల్లికి వచ్చారు. వెంటనే వారిని గుర్తించిన మండల వైద్యాధికారి వెంకన్న, ఎస్‌ఐ హరిబాబు, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మయ్య శుక్రవారం గ్రామానికి చేరుకొని ఆ యువకులను ఇల్లువిడిచి బయటకు వెళ్లకుండా హోంక్వారంటైన్‌లో ఉండాలని సూచించారు. ఆ యువకులు ఇంటినుంచి బయటకు రాకుండా గేట్లకు తాళం వేశారు. అయినప్పటికీ ఆ యువకులు ఇంటి ప్రహరీగోడ దూకి శుక్రవారం నుంచి శనివారం మధ్యాహ్నం వరకూ స్నేహితులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న మండల అధికారులు సంబంధిత కుటుంబీకులకు పలుమార్లు ఫోన్‌చేసి ఆ యువకులను ఇంటికి పిలిపించుకొని ఇంట్లోనే ఉంచాలని సూచించారు. అయినప్పటికీ ఆ యువకులు ఇంటికి రాకపోవడంతో శనివారం మధ్యాహ్నం మండల అధికారులు వారిని ఇంటివద్దకు పిలిపించి నల్లగొండ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు తరలించారు.

**ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు**

**చింతలపాలెం (హుజూర్‌నగర్) :** ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి హుజూర్‌నగర్ పట్టణంలోని రైస్‌మిల్లుల్లో పని చేస్తున్న కార్మికులకు శనివారం వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైస్‌మిల్లుల్లో గల బీహార్ కార్మికులకు మండల వైద్యాధికారి లక్ష్మణ్‌గౌడ్ థర్మల్ స్కానర్‌తో కోవిడ్ 19 పరీక్షలు నిర్వహించారు. ఎవరికి కూడా పాజిటీవ్ నమోదు కాలేదని తెలిపారు. వారికి కరోనా వైరస్ వ్యాప్తిపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కాశీకి వెళ్లొచ్చిన వారికి క్వారంటైన్


తుర్కపల్లి : స్టాంపింగ్ వేస్తున్న వైద్య సిబ్బంది

**తుర్కపల్లి (ఆలేరు) :** మండలంలోని వాసాలమర్రి, కొండాపూర్ గ్రామంలో ఉత్తరభారత దేశ యాత్రలు చేసి వచ్చిన వారిని శనివారం అధికారులు పరిశీలించారు. వారిని 14రోజుల పాటు క్వారంటైన్‌లో ఉండాలని వారికి స్టాంపింగ్ వేసినట్లు వైద్యాధికారి చంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు వారిపై ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్ల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

**మఠంపల్లి మండలంలో 106మందికి క్వారంటైన్**

**మఠంపల్లి (హుజూర్‌నగర్) :** మండలంలోని వివిధ గ్రామాల్లో కరోనావైరస్ వ్యాధి వ్యాప్తి నివారణలో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 106మందిని క్వారంటైన్‌లో ఉంచినట్లు మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్.ఫిరోజ్ తెలిపారు. శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి ఇతర దేశాల నుంచి 16మంది రాగా, పలురాష్ట్రాల నుంచి 90మంది వచ్చారన్నారు. దీంతో ఉన్నతాధికారుల సూచనలతో మండల తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్‌ఐ వై.ప్రసాద్‌ల సహకారంతో వైద్యసిబ్బంది, రెవెన్యూ, పోలీసుల టీంలుగా ఏర్పడి 106 మందిని ఆయా గ్రామాల్లో క్వారంటైన్‌లో ఉంచామన్నారు. వారందరిని 14రోజుల పాటు ఇంటి నుంచి బయటకు రాకుండా స్థానిక సర్పంచ్‌ల సహకారంతో పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు. అదేవిధంగా మండలంలోని మట్టపల్లి వద్ద సరిహద్దు రాకపోకలు పూర్తిగా మూసివేసినట్లు తెలిపారు. ఆయన వెంట హెల్త్ సిబ్బంది ప్రభాకర్, బెల్లంకొండ శ్రీను, భాస్కర్, నిర్మల, రాధిక, సైదమ్మ, తదితరులున్నారు.

**25 మందిని క్వారంటైన్ చేసిన అధికారులు**

**నాగారం (తుంగతుర్తి) :** కరోనా వైరస్ (కోవిడ్–19)ని యంత్రించేందుకు మండల పరిధిలోని పసునూర్, ప స్తాల, నర్సింహులగూడెం గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 25మందిని గుర్తించి శనివారం క్వారంటైన్ చేసినట్లు స్థానిక తహసీల్దార్ జి.శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసునూర్ గ్రామంలో చెన్నై నుంచి స్వస్థలానికి వచ్చిన 12 మంది వలసకూలీలను, పస్తాలలో సూరత్ నుంచి వచ్చిన నలుగురిని, నర్సింహులగూడెంలో హైదరాబాద్ నుంచి వచ్చిన 9 మందిని గుర్తించినట్లు తెలిపారు. వీరందరికి కరోనాపై కౌన్సెలింగ్ ఇచ్చి, వారి చేతులపై స్టాంపింగ్ చేసి క్వారంటైన్ చేసినట్లు తెలిపారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు (మైగ్రేట్‌లేబర్)ను మండలంలో 45 మందిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కుమార్, ఆర్‌ఐలు లక్ష్మీనర్సింహారావు, ఎంఎ వహిద్, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జియో ట్యాగింగ్ వేస్తున్న వైద్యాధికారులు


నాగారం : పసునూర్‌లో...


శాలిగౌరారం : ఎన్‌జీ కొత్తపల్లికి చెందిన యువకుడిని ఐసోలేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

# బత్తాయి, నిమ్మ ఎగుమతులకు ఇబ్బంది లేదు

- జాతీయంగా రవాణాపై ఆంక్షలు ఎత్తివేశారు
- జిల్లాలోనూ సంచార రైతుబజార్లు
- వైరస్‌ను తట్టుకునే గుణం బత్తాయి, నిమ్మలలో ఉంటుంది
- బత్తాయి, నిమ్మ, పుచ్చకాయ పంటలపై సమీక్షలో మంత్రి జగదీశ్‌రెడ్డి


పండ్ల తోటలపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

**నల్లగొండ :** బత్తాయి, నిమ్మ ఎగుమతులకు ఇకపై ఎటువంటి ఇబ్బంది ఉండబోదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. జాతీయంగా సరుకులు, పంట దిగుబడులు రవాణా చేసే వాహనాల మీద ఉన్న ఆంక్షలు ఎత్తివేసిన క్రమంలో బత్తాయి, నిమ్మ రైతులు నిరభ్యంతరంగా ఎగుమతి చేసుకోవచ్చని ఆయన చెప్పారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో బత్తాయి, నిమ్మ పంటలతో పాటు అధిక దిగుబడి ఉన్న పుచ్చకాయ పంటలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి సంగీత లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో బత్తాయి, నిమ్మతో పాటు పుచ్చకాయ పంట దిగుబడిని వివరించారు. చేతికి వచ్చిన పంట రవాణా సౌకర్యం లేకపోవడంతో రైతాంగం గాబరా పడుతుందని ఆమె మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో మొత్తం 46 వేల 800 ఎకరాలలో బత్తాయి తోటలు విస్తరించి ఉండగా.. అందులో 30 వేల ఎకరాల పై చిలుకు బత్తాయి కాపుకొచ్చిందన్నారు. మొత్తం మీద ఈ సీజన్‌లో ఒక్క బత్తాయి పంటనే 43 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందన్న అంచనా వేశామని ఆమె మంత్రికి తెలిపారు. అదే విధంగా 16 వేల ఎకరాల విస్తీర్ణంలో వేసిన నిమ్మ ఇప్పటికే 8,800 ఎకరాల్లో సాగుకు వచ్చిందన్నారు. 52 వేల 400 మెట్రిక్ టన్నుల నిమ్మ పంటతో పాటు 5,300 ఎకరాల విస్తీర్ణంలో వేసిన పుచ్చకాయ దాదాపు లక్షకు పై చిలుకు మెట్రిక్ టన్నుల దిగుబడికి సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని బత్తాయి, నిమ్మ, పుచ్చకాయ పంటను ఇక్కడి రైతాంగం ట్రేడర్స్ ద్వారా హైదరాబాద్, ఢిల్లీలతో పాటు గుజరాత్‌కు ఎగుమతి చేసేవారని అయితే కరోనా వైరస్‌తో ఏర్పడ్డ పరిస్థితులు రవాణా రంగం మీద ప్రభావం చూపడంతో రైతుల్లో ఆందోళన మొదలైందని సంగీత లక్ష్మి మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయంగా ఈ తరహా ఎగుమతులు చేసే వాహనాలపై కేంద్రం ఆంక్షలు ఎత్తివేసినందున ఎటువంటి ఇబ్బంది ఉండబోదన్నారు. అయితే అదే సమయంలో ఇక్కడి పంటను ఇక్కడి ప్రజలు వినియోగించుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటుందని ఆయన అన్నారు. రోగ నిరోధక శక్తికి 'సీ' విటమిన్ దోహదపడుతుందని నిపుణులు చెబుతున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అటువంటి విటమిన్లు కలిగిన బత్తాయి, నిమ్మ పంటల ఎగుమతులకు ప్రాధాన్యం ఇవ్వకుండా జిల్లా ప్రజలు వినియోగించుకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు ఆరోగ్యం సమకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో పొటాషియం వంటి పోషకాలు కలిగి ఉన్న పుచ్చకాయ పండ్లను వేసవిలో విరివిగా వినియోగించుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని అన్నారు. అటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకునే జిల్లాలోను హైదరాబాద్ తరహాలో సంచార రైతు బజార్ల యోచనతో పాటు కూరగాయల మార్కెట్ల తరహాలో బత్తాయి, నిమ్మ, పుచ్చకాయ వంటి పంటలను విక్రయించేందుకు మార్కెట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఇందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్, అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి

**ఆలేరు రూరల్ :** ప్రజలు కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆలేరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌ను సందర్శించిన అనంతరం పాలకేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో 184 మంది ఇతర రాష్ట్రం, 23 మంది విదేశాల నుంచి గ్రామాలకు చేరుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పోలీసు, ఆరోగ్య శాఖలు, అధికారులు, సర్పంచ్‌లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని గుర్తించి కరోనా నియంత్రణ పట్ల కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎవరికీ పాజిటివ్ కేసులు నమోదు కాలేదని, ముందు జాగ్రత్త కోసం చేతిపై స్టాంప్ వేస్తున్నట్లు తెలిపారు. వారంతా ఇంట్లో ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అనవసరంగా బయటికి రావడంతో కేసులు నమోదు అవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కరోనా వైరస్‌పై జాగ్రత్తలు పాటించకపోవడం ద్వారా కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్టాంప్‌లు వేసిన వారిని చూసి ఇతరులు సామాజిక దూరం పాటించాలని కోరారు. ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటే ఆలేరు, భువనగిరి, శారాజీపేట వైద్యశాలల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లాక్‌డౌన్ ప్రకటించినందున ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం ద్వారా రాష్ట్రం సురక్షితంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్, ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, వైస్ చైర్మన్ మొరిగాడి మాధవి పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ తరలింపు

- పరిశీలించిన ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు


మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ (కోవిడ్ –19) వ్యాప్తి నివారణలో భాగంగా స్థానిక నేతాజీ కూరగాయల మార్కెట్‌ను శనివారం ఎన్‌ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లోకి మార్చారు. మార్కెట్‌లో స్థలం లేకపోవడం వల్ల వినియోగదారులు సామాజిక దూరం పాటించే అవకాశం లేకపోవడంతో మార్కెట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు తరలించారు. స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంపులో ఏర్పాటు చేసిన మార్కెట్‌లో సామాజిక దూరం పాటించేలా మార్కు చేసి ఉంచారు. కాగా మార్కెట్‌ను తరలించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో కరోనా వైరస్ విస్తరించకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. దీనికి మందు లేకపోవడం వల్ల రాకుండా చూసుకోవడమే ముఖ్యమన్నారు. కూరగాయల వ్యాపారులు కూడా సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు లాక్‌డౌన్ ఉన్నందున అప్పటి వరకు ఎన్ఎస్‌పీ క్యాంపులో కూరగాయల మార్కెట్ అందుబాటులో ఉంటుందని అన్నారు. కరోనా వ్యాప్తి నివారణకు ప్రజలు స్వీయ నిర్బంధంలో ఉండాలని, అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రోహిత్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**పేదలకు వరం...సీఎంఆర్‌ఎఫ్**

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అని స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురు లబ్ధి దా రులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశా రు. పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన పూర్ణచందర్‌రా వుకు రూ.30 వేలు, చైతన్యనగర్‌కు చెందిన ఝా న్సీ ల క్ష్మికి రూ.60 వేలు, శాంతినగర్‌కు చెందిన నర్సింహులుకు రూ.26 వేలు, ప్రకాశ్‌నగర్‌కు చెంది న ప్రసాద్‌కు రూ.26 వేలు, బాపూజీనగర్‌కు చెందిన సాయి కృష్ణకు రూ.18 వేలు, సీతారాంపురానికి చెందిన అచ్చమ్మకు రూ.40 వేల చెక్కును అందజేశారు.

# ప్రభుత్వానికి అండగా నిలవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి


విరాళం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**రామన్నపేట :** కరోనా వ్యాధి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. శనివారం రామన్నపేటలో లాక్‌డౌన్ జయప్రదం కోసం వివిధ శాఖలు తీసుకుంటున్న చర్యలను వేర్వేరుగా సమీక్షించారు. చెక్ పోస్టును సందర్శించి పోలీసులకు పలు సూచనలు చేశారు. రేషన్ బియ్యం పంపిణీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి కట్టడికి తీసుకున్న చర్యలపై తహసీల్దార్ శ్రీనివాస్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్‌తో చర్చించారు. రాష్ట్రంలో అత్యధిక కుటుంబాలకు రేషన్ సరుకులు రామన్నపేటలోనే పంపిణీ చేసినట్లు తహసీల్దార్ వివరించారు. బ్లీచింగ్ కొరత ఉందని సర్పంచ్‌లు, మాస్క్‌లు, శానిటైజర్లు అందుబాటులో లేవని డాక్టర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుకోసం తీసుకునే చర్యలను నిరంతరాయంగా కొనసాగించాలని, స్థానికంగా ఉంటూ రెవెన్యూ, పోలీస్, వైద్యశాఖ అధికారులకు సహకరించాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి వివరాలను అధికారులకు తెలియజేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

**రూ.4 లక్షల విరాళం అందజేత**

కరోనా నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలకు గాను మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రూ. నాలుగు లక్షల విరాళంను శుక్రవారం ఎమ్మెల్యేకు అందజేశారు.

# స్వామి వారికి ఏకాంత సేవలు


సుదర్శన నారసింహ హోమంలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి

**యాదగిరిగుట్ట (ఆలేరు) :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం శ్రీస్వామి వారికి బాల ఆలయంలో ఆచార్యులు ఏకాంత సేవలు కొనసాగించారు. ఉదయం 5గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారికి సుప్రభాతం సేవ నిర్వహించి, అనంతరం ఆస్థాన పరంగా స్వామి వారికి అర్చనలు, అభిషేకం, సువర్ణ పుష్పార్చన చేశారు. మండపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు, శ్రీసుదర్శన నారసింహ హోమం నిత్యకల్యాణం, సేవల ఊరేగింపు జరిపించారు. ఉదయం 11గంటలకు మహా నివేదన జరిపించిన ఆచార్యులు ఆలయాన్ని సాయంత్రం 5గంటల వరకు మూసివేశారు. తిరిగి ఆలయాన్ని 5గంటలకు తెరిచిన ఆచార్యులు వివిధ పూజలు నిర్వహించి, రాత్రి 7గంటలకు స్వామి అమ్మవార్లకు మహా నివేదన, శయనోత్సవం నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన శ్రీసుదర్శన నారసింహ హోమంలో ఆలయ ఈఓ గీతారెడ్డి పాల్గొన్నారు.

# సెక్రటేరియట్‌ను కరోనా వైద్యశాలగా మార్చాలి

- తెలంగాణ ఇంటిపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.చెరుకు సుధాకర్


మాట్లాడుతున్న చెరుకు సుధాకర్

**నకిరేకల్ :** ముఖ్యమంత్రి కేసీఆర్ గాంధీ ఆస్పత్రిని కరోనా వైద్యశాలగా మార్చాలని భావిస్తున్నారని, దీనికి బదులుగా ఖాళీగా ఉన్న సెక్రటేరియట్‌ను వినియోగించుకోవాలని తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.చెరుకు సుధాకర్ అన్నారు. నకిరేకల్‌లోని ఆయన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నివారణ చర్యలపై ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.70 లక్షల కోట్ల ప్యాకేజీని రూ.5లక్షల కోట్లకు పెంచాలని కోరారు. నిత్యావసర వస్తువుల సరుకుల పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ఎన్నో టన్నుల బియ్యం వృథా అవుతున్నాయని, 12 కిలోల బియ్యం, రూ.1500 సరిపోవన్నారు. కరోనా విషయంలో నిత్యావసర వస్తువుల కోటాను పెంచి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. అదే విధంగా ఐసోలేషన్ సెంటర్‌ను గచ్చిబౌలిలో, ఎల్బీస్టేడియంలో ఏర్పాటు చేస్తున్నారని పేర్కొనడం సరికాదన్నారు. ఇలా మారుస్తే ప్రజలు చాలా ఇబ్బందులు పడతారని అన్నారు. సెక్రటేరియట్‌లో అన్ని బ్లాకులను వినియోగిస్తే 10 వేల మం దికి చికిత్స అందించవచ్చని సూచించారు. జూనియర్ డాక్టర్లకు, వైద్య సిబ్బందికి కరోనా కిట్లు అందించాలని, అన్ని జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలుగా మార్చాలని కోరారు. ఎల్బీనగర్ వద్ద ఉన్న ఎయిమ్స్ ఔటర్ రింగ్‌రోడ్డుకు దగ్గరగా ఉన్నందున ఈ వైద్యశాలను కూడా కరోనా వ్యాధిగ్రస్తుల కోసం వాడుకోవాలని కోరారు.


## సాక్షి సండే క్లాసిఫైడ్స్

### REAL ESTATE

■ నల్లగొండలో ప్లాట్లు, ఇండ్లు, వ్యవసాయ భూములు అమ్మబడును మరియు కొనబడును. వివరాలకు సంప్రదించండి. సెల్ : 7013358937 [YA-1537]

### PLOT FOR SALE

■ నల్లగొండ పట్టణం ఆర్జాలబావి అద్దంకి బైపాస్ రోడ్ ప్రక్కన హ్యుందాయ్ షోరూం ఎదురుగా, మెయిన్‌రోడ్ ఫేస్ గల 1300 గజాల ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9440628696, 9441804096 [Y-708808]

### HOUSE FOR SALE

■ నల్లగొండ టౌన్ MLG రోడ్ ఇండియన్ కాలనీలో 142 చ॥గ॥ల పడమర ఫేస్ 2BHK న్యూ కన్‌స్ట్రక్షన్ అన్ని వసతులు కలిగిన ఇల్లు వెంటనే అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. 7396781479, 9440184054 [Y-708870]

### FOR SALE

■ దామరచర్ల మండలం గుంటూరు వెళ్ళే హైవే ప్రక్కన 16x70 చ॥గ॥ షాపు, ఇల్లు అమ్మబడును. ఆంధ్రాబ్యాంక్ ప్రక్కన మంచి రన్నింగ్‌లో ఉన్న షాపు అమ్మబడును. సంప్ర॥ 7989020471 [Y-708772]

### SERVICES

### OLDAGE HOME

■ మీన్స్ వృద్ధుల సేవాసంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కి, దీర్ఘవ్యాధులతో ఉన్నవారికి మానసిక శారీరక వికలాంగులకు 24గం॥ వైద్యభోజనం, వసతి. అతితక్కువ వ్యయంతో సేవలు. సంప్ర: 7981467036, 6281125552, 9391039990. [H-742489]

### WANTED

■ HYD లోని ఇంటర్‌నెట్ సంస్థలో Cable Work చేయుటకు వర్కర్స్ కావలెను. జీ॥ 9000, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారికి జీ॥ 11000 & ఫ్రీ భోజనం + ఉచిత వసతి సౌకర్యం. No Qualification సంప్ర: 7995567266. [W-723332]

■ ఆయాలు, కేర్‌టేకర్స్–వృద్ధులను, పేషంట్లను వారి ఇంటి వద్దే ఉండి చూసుకొనుటకు విజయవాడలోని హోంకేర్ సంస్థకు కావలెను. జీ: 12–15 వేలు + వసతి + భోజనం. ✆ 9160835559, 7815835561. [B-1068059]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం హైదరాబాద్‌లో ముసలివారికి సేవ చేయుటకు వర్కర్స్, ఏజెంట్లు కావలెను. భోజనం+వసతి+మంచిజీతం, మంచి కమీషన్ కలదు. Ph: 9705571122 / 9010581122. [H-733898]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-742253]

■ Wanted Teachers for all Subjects (Primary and Higher) in a most reputed School in Bhongir. Teachers should be fluent in english. For more details, contact : 9490398748, 9290811110 [Y-708901]

### గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచు రించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పం దించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాం టి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 'కరోనా' కలిపింది అందరినీ!

విపత్కర పరిస్థితుల్లో దేశాల సరిహద్దులు కృత్రిమమైపోతాయని అంటారు. ఒకరికొకరు తోడుగా ఉండటమే ముఖ్యమవుతుంది. కరోనా దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు జరుగుతున్నది కూడా ఇదే. ఎక్కడో దక్షిణ అమెరికాలోని క్యూబా నుంచి వైద్యులు ఇటలీ వెళ్లి అక్కడి కరోనా బాధితులకు చికిత్స అందించడం ఈ కోవకే చెందుతుంది. ఇరాన్‌లో చిక్కుకుపోయిన తన పౌరులను వెనక్కి తెచ్చుకునేందుకు భారత్ అప్పటికప్పుడు మొబైల్ కరోనా టెస్టింగ్ యూనిట్‌ను సిద్ధంచేసి అక్కడకు పంపడమే కాదు.. ఇరాన్ దేశస్తులకూ సేవలందించడం మొదలుపెట్టింది. చైనా తన ఇల్లు చక్కబెట్టుకున్న మరుక్షణం కరోనా తాకిడికి అల్లాడిపోతున్న ఇటలీకి వైద్య బృందాలను, మందుల సరఫరాను చేపట్టింది. ఆర్థికంగా కొంచెం మెరుగైన స్థితిలో ఉన్న భారత్.. తన ఇరుగుపొరుగు మేలు కోసం తనవంతు ప్రయత్నాలు మొదలుపెట్టింది. సార్క్ దేశాధినేతలతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినా, కరోనా కట్టడికి మెరుగైన పద్ధతులను తెలుసుకోవడం.. ఆచరించడం కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసినా.. అన్నీ మనిషికి మనిషి తోడు ఉండాలనే కానీ ఇక్కడ సరిహద్దు గొడవల్లేవు. రాజకీయాలు అసలే లేవు.


ఇటలీ వెళ్లిన క్యూబా డాక్టర్లు

## మంచి మనసులకు స్వాగతం

కార్పొరేట్ కంపెనీలు కేవలం లాభాలను మాత్రమే చూసుకునే స్వార్థ సంస్థలని చాలామంది అనుకుంటారు. ఇందులో కొంత నిజమూ లేకపోలేదు. అయితే కరోనా సృష్టించిన ఆపత్కాలంలో చాలా కంపెనీలు ఉదారంగా వ్యవహరిస్తూ మానవత్వంతో స్పందిస్తున్నాయి. భారత్‌లో రెండు విమానయాన సంస్థలు కారోనా బాధితులను ఆదుకునే విషయంలో విమానాలతోపాటు సిబ్బందిని కూడా వాడుకోవచ్చునని ప్రభుత్వానికి సూచించడం, కేరళలో అన్నార్తులను ఆదుకునేందుకు వందల సంఖ్యలో సామూహిక వంటశాలలు ఏర్పాటు చేయడం, సమాజంలోని ప్రతి వర్గం వారూ తమకు చేతనైనంతలో ఇతరులకు సాయం చేయడం.. ఇవన్నీ మనిషిలో దాగున్న మానవత్వాన్ని చాటేవే. కరోనా కేసులు బాగా పెరిగిపోతే వెంటిలేటర్లు ఎక్కువ సంఖ్యలో అవసరమవుతాయి కాబట్టి, వాటిని తయారు చేసిస్తామని ఆనంద్ మహీంద్రా వంటి పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారు. ఫ్రాన్స్‌లో లగ్జరీ బ్రాండ్ లూయిస్ విటన్ ఆసుపత్రులకు శానిటైజర్లు, మాస్కులు ఉచితంగా సరఫరా చేస్తుంటే.. జారా అనే బ్రాండ్ స్పెయిన్‌లో ఇదే పనిచేస్తోంది. భారత్‌లో కాలినడకన సొంతూళ్ల బాటపట్టిన వలస కార్మికులకు కాసింత ఆహారమిచ్చి ఉపశమనం కల్పించేందుకు ముందుకొస్తున్న చేతులు ఎన్నో.. ఎన్నెన్నో!

## కోల్డ్ స్టోరేజీలకు పోటెత్తిన మిర్చి

**ఒక్క రోజే లక్ష బస్తాలకు పైగా రాక**

వ్యవసాయ మార్కెట్లు పూర్తిగా బంద్ కావడంతో రైతులు మిర్చిని కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో వేలాది వాహనాలు కోల్డ్ స్టోరేజీల ముందు వాహనాలు బారులు తీరాయి. శనివారం ఒక్కరోజే లక్ష బస్తాలకు పైగా మిర్చి ఖమ్మం కోల్డ్ స్టోరేజీలకు పోటెత్తింది. ఇదే పరిస్థితి ఇంకా రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందని, కోల్డ్ స్టోరేజీలు సరిపోయే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

\- సాక్షి ప్రతినిధి, ఖమ్మం




వరంగల్ రూరల్ జిల్లా పొనకల్‌లో పైపుతో కల్లు పోస్తున్న గౌడన్న

## గౌడన్న.. భలే ఐడియా అన్నా..

లాక్‌డౌన్ కారణంగా వైన్స్, బార్లు మూతపడటంతో మందు బాబులు కల్లు మండువాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది కల్లు తాగేందుకు వచ్చినా ఇబ్బంది ఎదురుకాకుండా కల్లు గీత కార్మికులు సైతం సామాజిక దూరం పాటిస్తున్నారు. ఎవరి దగ్గరకు వెళ్లకుండా దూరం నుంచే పైపులు ఏర్పాటు చేసి కల్లు పోస్తున్నారు.

\- నల్లబెల్లి /దుగ్గొండి

# సామాజిక మాధ్యమాల్లో 'మందు' గోల

**29 నుంచి కొద్దిసేపు వైన్‌షాపులు తెరుస్తున్నారంటూ ప్రచారం**

- ఫేక్ అని కొట్టిపారేసిన ఎక్సైజ్ యంత్రాంగం
- సీఎం తప్ప ఎవరూ నిర్ణయం తీసుకునే అవకాశం లేనట్టే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైన్‌షాపులు తెరుస్తున్నారంటూ శనివారం మధ్యాహ్నం సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం ఒక రకంగా సంచలనానికి దారి తీసింది. ఈనెల 29 నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వైన్‌షాపులు తెరుస్తున్నారని, ప్రతి షాపు దగ్గర ఐదుగురు ఎక్సైజ్ కానిస్టేబుళ్లు కాపలా ఉంటారని వాట్సాప్‌లో వచ్చిన ఫేక్ డాక్యుమెంట్ క్షణాల్లో వైరల్ అయింది. అలా వాట్సాప్‌లోకి వచ్చిందో లేదో నిమిషాల్లో వందలు, వేల వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైంది. దీంతో ఒక్కసారిగా రాష్ట్రంలో మళ్లీ మద్యం గురించి చర్చ మొదలైంది. మద్యం కోసం తహతహలాడుతున్న మందు బాబులు మళ్లీ వైన్‌షాపులు తెరుస్తున్నారన్న ఆశతో తమ సహచరులు, సన్నిహితులు, మీడియా వ్యక్తులకు ఫోన్లు చేసి ఆరా తీశారు. అయితే వాట్సాప్‌లో ఈ ఫేక్ సమాచారం ఎంత వేగంగా ప్రచారమైందో అంతే వేగంగా ఎక్సైజ్ అధికారులు కూడా స్పందించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన డాక్యుమెంట్ నకిలీదని, శాఖా పరంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారికంగా వివరణ ఇచ్చారు. పైగా నకిలీ పోస్టును ప్రచారం చేసిన వారిపై హైదరాబాద్ సీసీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ఈజీ కాదు

రాష్ట్రంలో మద్యం తాగేవారి సంఖ్య దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కొంచెం ఎక్కువే ఉంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గత వారం రోజులుగా రాష్ట్రంలో పూర్తిస్థాయిలో మందు దొరక్కపోవడంతో ఎప్పుడెప్పుడు వైన్‌షాపులు తెరుస్తారా అనే ఆశతో మందుబాబులు ఎదురుచూస్తున్నారు. మందు కోసం వీరంతా రోజూ ఏదోలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. శనివారం వెలుగులోకి వచ్చిన నకిలీ డాక్యుమెంట్ వీరిలో లేనిపోని ఆశలు కల్పించింది. అయితే దీనిపై నిర్ణయం తీసుకోవడం అంత తేలిక కాదని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కసారి షాపులు తెరిస్తే నియంత్రించడం కష్టమవుతుందని, అలాంటి పరిస్థితుల్లో ఇప్పట్లో మద్యం దుకాణాలు తెరవడం జరిగే పని కాదని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. అవసరమైన వారికి మద్యం ఇంటికే సరఫరా చేసేందుకు కసరత్తు జరుగుతుందన్న వార్తల్లో కూడా వాస్తవం లేదని చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మద్యం దుకాణాలపై సీఎం కేసీఆర్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఎక్సైజ్ అధికారుల చేతిలో ఈ నిర్ణయం ఉండదని, ఒక్కసారి నిత్యావసరాల చట్టం అమల్లోకి వచ్చాక శాఖల చేతిలో ఏమీ ఉండదని, సీఎం సూచన మేరకు ఉన్నత స్థాయిలోనే నిర్ణయం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇది ఒక్క ఎక్సైజ్ శాఖకే కాదని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకూ ఇదే నిర్ణయం వర్తిస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఈ నకిలీ డాక్యుమెంట్ తయారుచేసిన వారిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించారు. ఈ వదంతులను పంపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

**మరికొన్ని ఫేక్‌న్యూస్‌ల హల్‌చల్**

కరోనా నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ కొందరు తప్పుడు పోస్టులు పెడుతున్నారు. కరోనా నియంత్రణకు అనుమానితులను చైనా కాల్చేసిందని, రష్యా రోడ్లపై సింహాలను వదిలిందంటూ కొన్ని ఫేక్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. జనసంచారం నియంత్రణకు ఆర్మీ వస్తోందని పాత వీడియోలు షేర్ చేస్తున్నారు.

### ఆర్మీ రావడం అవాస్తవం: డీజీపీ

కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో జన సంచారాన్ని నియంత్రించేందుకు సైన్యం రంగంలోకి దిగిందన్న ప్రచారాన్ని డీజీపీ కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో ఖండించింది. ప్రస్తుతం కొనసాగుతున్న లాక్‌డౌన్‌ను నియంత్రించడానికి రాష్ట్ర బలగాలు సరిపోతాయని, అదనపు బలగాలు, ఆర్మీని పంపాలని రాష్ట్రం నుంచి కేంద్రానికి ఎలాంటి విజ్ఞప్తి చేయలేదని తెలిపింది.

## జాగ్రత్తలు మరిస్తే ఎలా..?

**పారిశుధ్య కార్మికులు మాస్కులు లేకుండా పనిచేస్తారా? : హరీశ్**

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో పారిశుధ్య కార్మికులకు తగిన మాస్కులు, గ్లౌజ్‌లు లేకుండా పని చేయిస్తుండటంపై మంత్రి హరీశ్‌రావు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కరోనా వైరస్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులతో ఇలా పనిచేయించడం సరికాదని, జాగ్రత్తలు మరిస్తే ఎలా అని శనివారం ఆయన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌పై మండిపడ్డారు. హైదరాబాద్ నుంచి వస్తున్న సమయంలో పొన్నాల, సిద్దిపేట మార్గంతో పాటు మరి కొన్ని చోట్ల మాస్కులు, గ్లౌజులు లేకుండా రోడ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులను చూసిన మంత్రి, తన కాన్వాయ్ ఆపి వారితో మాట్లాడారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జాగ్రత్తలు ఎందుకు తీసుకోవడం లేదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పారిశుధ్య కార్మికులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కార్మికులకు వెంటనే మాస్కులు, గ్లౌజులు ఉన్న కిట్లను అందజేసి, కరోనా వైరస్ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తన వాహనంలో ఉన్న మాస్కులను తెప్పించి కార్మికులకు ఇచ్చారు.


మృతదేహం వద్ద దస్తీలు కట్టుకుని రోదిస్తున్న బంధువులు

## కన్నీరుకూ కరోనా భయమే..!

రామగిరి: మాయదారి కరోనా.. చివరి మజిలీలోనూ ఇబ్బందులకు గురి చేస్తోంది. మృతదేహం వద్ద బంధువులు, కుటుంబ సభ్యులు నోటికి దస్తీలు కట్టుకుని రోదించాల్సిన పరిస్థితి. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ సర్పంచ్ బడికెల విజయ నాన్నమ్మ అక్కెమ్మ శనివారం మధ్యాహ్నం చనిపోయింది. బంధువులు నోటికి దస్తీలు, రుమాలు కట్టుకుని రోదించారు.

## గని కార్మికులకూ తప్పని కష్టాలు

సింగరేణి సంస్థలోని కొన్ని ఏరియాల్లో సామాజిక దూరం పాటిస్తూ, కార్మికులకు ఎప్పటికప్పుడు థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తూ, శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకునే ఏర్పాట్లు చేశారు. అయితే భూగర్భ గనులకు వెళ్లే కార్మికులకు మాత్రం గని బయట థర్మల్ స్క్రీనింగ్, మాస్కులు ధరించినప్పటికీ గనిలోకి వెళ్లిన తర్వాత పని ప్రదేశంలో వాతావరణం భిన్నంగా ఉండే నేపథ్యంలో తమకు ఈ వైరస్ నుంచి రక్షణ లేదని వాపోతున్నారు.

\- సాక్షి ఫొటో జర్నలిస్టు, కొత్తగూడెం



## ప్రాణం తీసిన కరోనా కంచె

**గీత కార్మికుడు మృతి**



ఎల్లారెడ్డిపేట: కరోనా కట్టడికి గ్రామస్తులు వేసిన కంచె ఓ గీత కార్మికుడి ప్రాణాలను బలి తీసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన బాలనర్సాగౌడ్ (72) కల్లు గీసుకుని గ్రామ శివారులో అమ్ముకోవడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బండలింగంపల్లి నుంచి కొండాపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు, మొద్దులను వేశారు. వాటిని దాటుతున్న క్రమంలో బండిపై నుంచి బాలనర్సాగౌడ్ కింద పడి మృతి చెందాడు.

## ఉయ్యాలే ఉరితాడై..

**చున్నీ గొంతుకు బిగుసుకుని బాలిక మృతి**



బెజ్జంకి: ఇంట్లో ఉయ్యాల ఊగుతూ ప్రమాదవశాత్తు పబ్బతి దివ్య (14) మృతి చెందింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపెల్లికి చెందిన దివ్య ఇంట్లో ఉయ్యాల ఊగుతుండగా తను వేసుకున్న చున్నీ తాడుకు ముడివడి గొంతుకు చుట్టుకుంది. ఉయ్యాల వేగానికి చున్నీ గొంతుకు ఉరిలా బిగుసుకోవడంతో మృతి చెందింది.

## కల్లు దొరక్క ఇద్దరి ఆత్మహత్య

**ఫిట్స్‌తో ఒకరి మృతి**

నిజామాబాద్ అర్బన్: లాక్‌డౌన్ నేపథ్యంలో కల్లు దొరక్క కొంత మంది వింతగా ప్రవర్తిస్తున్నారు. నిజామాబాద్ నగరంలో ఇద్దరు ఆత్మహత్య చేసుకోగా, ఒకరు ఫిట్స్‌తో మృతి చెందారు. నగరంలోని సాయినగర్‌కు చెందిన శకుంతల (65) ప్రతిరోజూ కల్లు సేవించేది. వారం రోజులుగా కల్లు లేక పిచ్చిగా ప్రవర్తించింది. శుక్రవారం రాత్రి ఇంట్లో బాత్‌రూంలో ఉన్న ఫినాయిల్ తాగింది. ఆమె భర్త ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై జాన్‌రెడ్డి తెలిపారు. అలాగే.. గాయత్రి నగర్‌కు చెందిన శంకర్ (45) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ముదిరాజ్ వీధిలో నివాసం ఉండే భుషణ్ కల్లు లేక విచిత్రంగా ప్రవర్తిస్తుండటంతో పాటు ఫిట్స్ వచ్చి మృతి చెందాడు.

## విదేశాల నుంచి వచ్చిన వ్యక్తిపై కేసు

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో పోలీసులు అంటువ్యాధుల నివారణ చట్టం కింద ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పట్టణంలోని రాచన్నపేటకు చెందిన రాజశేఖర్ ఇటీవల బ్యాంకాక్‌కు వెళ్లి వచ్చాడు. అతను స్వీయ నియంత్రణ పాటించకుండా పట్టణంలో తిరుగుతున్నాడని తెలుసుకుని, తహసీల్దార్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రాజశేఖర్‌పై కేసు నమోదు చేశామన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షల కోసం అతడిని ఐసోలేషన్‌కు తరలించామని తెలిపారు.


జోలెలో గర్భిణీని మోసుకొస్తున్న ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎం

## కాన్పు కష్టాలు

**జోలెలో గర్భిణీని మోసుకొచ్చిన ఆశ వర్కర్లు**

ములకలపల్లి: రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో గిరిజన ప్రాంతాలకు అత్యవసర వైద్య సేవలందడంలేదు. వాహనం సౌకర్యంలేక ఓ గొత్తికోయ మహిళ అటవీ ప్రాంతంలోనే ప్రసవించింది. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఆదివాసీ గొత్తికోయ గ్రామమైన పూసుగూడెం పంచాయతీ సోయం గంగులునగర్‌కు చెందిన మడకం ధూలెకు శనివారం పురిటి నొప్పులు వచ్చాయి. అయితే ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేదు. దీంతో ఆశ కార్యకర్త ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ దుర్గ, ఏఎన్‌ఎం జ్యోతిలు కలసి జోలెలో గర్భిణీని 3 కిలో మీటర్లు మోసుకుంటూ వచ్చారు. నొప్పులు ఎక్కువ కావడంతో మార్గమధ్యలోనే కాన్పు చేశారు. ధూలె మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. కష్టకాలంలో వైద్య సేవలందించిన ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్‌కు ధూలె భర్త కృతజ్ఞతలు తెలిపాడు.

## కరోనా భయంతో వ్యక్తి ఆత్మహత్య

తుంగతుర్తి: కరోనా వైరస్ సోకిందేమోనన్న అనుమానంతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాలలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్విరాల గ్రామానికి చెందిన వార్డుసభ్యుడు వెలుగు శ్రీనివాస్ (45) వారం క్రితం కరీంనగర్ నుంచి వచ్చిన ఓ వ్యక్తికి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు.. కరోనా ముప్పు ఉండగా ఎందుకు కరచాలనం చేశావని అడిగారు. మరుసటి రోజు నుంచి శ్రీనివాస్ తనకు కరోనా సోకిందనే భయంతో వారికి దూరం, దూరంగా ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున చూసేసరికి శ్రీనివాస్ ఇంట్లో లేకపోవడంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఉంటాడని భావించి భార్య, కుమారుడు అక్కడికి వెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ అక్కడ మంటల్లో పూర్తిగా కాలిపోయి కనిపించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

# ఆన్‌లైన్‌లో పాల సరఫరా

**స్విగ్గీ, బిగ్ బాస్కెట్‌ల ద్వారా పంపిణీకి చర్యలు**

- పాల సరఫరా కోసం డెలివరీ సిబ్బందికి ప్రత్యేక కోడ్
- ఎక్కువ ధరలకు విక్రయిస్తే పీడీ చట్టం ప్రకారం చర్యలు
- ప్రైవేట్ డెయిరీ యాజమాన్యాల సమావేశంలో తలసాని



సాక్షి, హైదరాబాద్: కరోనా నేపథ్యంలో పాలు సరఫరా చేసేందుకు డెలివరీ బాయ్స్ ముందుకు రావడం లేదని, ఈ నేపథ్యంలో స్విగ్గీ, బిగ్ బాస్కెట్ లాంటి డోర్ డెలివరీ సంస్థల ద్వారా అవసరమైన మేరకు పాలు ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. ప్రజలు పాల కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం ఆయన రాష్ట్రంలోని ప్రైవేట్ డెయిరీల యాజమాన్యాలతో పాలు, సంబంధిత ఉత్పత్తుల సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లాక్‌డౌన్‌కు ముందు రాష్ట్రంలో అన్ని డెయిరీలవి కలిపి రోజుకు దాదాపు 68 లక్షల లీటర్ల పాలను ప్రజలు వినియోగిస్తుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 64 లక్షల లీటర్లకు పడిపోయిందని విజయా డెయిరీ ఎండీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఒక్క హెచ్‌ఎండీఏ పరిధిలోనే రోజుకు 30 లక్షల లీటర్లు సరఫరా అయ్యేవని, ఇప్పుడు అది 27 లక్షలకు పడిపోయిందని చెప్పారు. ఇందుకు పాల సరఫరా కోసం సిబ్బంది ముందుకు రాకపోవడమే కారణమని వివరించారు. దీనికి మంత్రి స్పందిస్తూ నిత్యావసరాలైన పాలు, పాల పదార్థాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటుందని చెప్పారు. పాల ఉత్పత్తులను కేవలం ఉదయం 5 నుండి 9 గంటల లోపే సరఫరా చేసేందుకు పోలీసులు అనుమతించడంతో ఇబ్బందులు వస్తున్నాయని, సాయంత్రం 5 గంటల వరకు రిటైల్ ఔట్‌లెట్‌ల ద్వారా పాల సరఫరా జరిగేలా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని డెయిరీ నిర్వాహకులకు మంత్రి హామీ ఇచ్చారు. పరిస్థితులను ఆసరాగా చేసుకుని రిటైల్ వ్యాపారులు కొందరు ధరలు పెంచి పాలను విక్రయిస్తున్నారని ప్రజలు తమకు ఫిర్యాదు చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్పత్తుల ప్యాకెట్లపై తప్పనిసరిగా ఎమ్మార్పీ ధరలను ముద్రించాలని ఆదేశించారు. పాల సరఫరా, పంపిణీలో సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్ (040–23450624)కు ఫిర్యాదు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.

## బీదర్ నుంచి వచ్చిన 43 మంది అడ్డగింత

కంగ్టి: కర్ణాటకలోని బీదర్‌లో ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 43 మంది ఉద్యోగులు రాష్ట్రంలోకి ప్రవేశిస్తుండగా అధికారులు వారిని అడ్డుకుని వెనక్కి పంపించారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం దెగుల్‌వాడి చెక్‌పోస్టు గుండా ఉద్యోగులు రాష్ట్రంలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. అయితే వారిని పోలీసులు ఆపివేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. కలెక్టర్ హనుమంతరావుకు ఈ సమాచారం తెలపగా, వచ్చిన వారందరినీ ప్రత్యేక బస్సులో బీదర్‌కు తిరిగి పంపాలని ఆదేశించినట్లు తెలిపారు. కాగా, మండుటెండలో కాలినడకన వచ్చిన వారికి తహసీల్దార్ పండ్లు, బిస్కట్లు, తాగునీరు అందించారు. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండతో పాటు ఏపీలోని చిత్తూరు, అనంతపూర్ జిల్లాలకు చెందిన ఈ ఉద్యోగులు దాదాపు 55 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో బీదర్‌లో ఉండలేక వీరు స్వస్థలాలకు బయలుదేరినట్టు అధికారులు తెలిపారు.

## 9 గంటలు.. 55 కి.మీ


ముస్తాబాద్‌లో కార్మికులు

- కామారెడ్డి నుంచి మహబూబాబాద్‌కు

**14 మంది కూలీల పాదయాత్ర**

ముస్తాబాద్: కరోనా కల్లోలం వసల కూలీలను అతలాకుతలం చేస్తోంది. పనులన్నీ నిలిచిపోగా.. చేతిలో చిల్లిగవ్వలేక ఆకలితో అలమటిస్తూ.. సొంతూరుకు పయనమవుతున్నారు. మహబూబాబాద్‌కు చెందిన 14 మంది కంకర పనులు చేసేందుకు కామారెడ్డికి చేరుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో పనులు బంద్ అయ్యాయి. దీంతో సొంతూరుకు శనివారం ఉదయం కామారెడ్డి నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరారు. ముస్తాబాద్‌కు సాయంత్రం రోడ్డుమార్గాన చేరుకున్నారు. తహసీల్దార్ విజయ్, ఎస్సై లక్ష్మారెడ్డి, వైద్యాధికారి సంజీవ్‌రెడ్డి వారి కష్టాలు తెలుసుకుని చలించారు. భోజన వసతి కల్పించారు. అనంతరం ట్రాక్టర్‌లో పంపించారు.

## హైదరాబాద్ టు ఎటపాక

**260 కి.మీ నడకయాతన**

పొట్టకూటి కోసం పట్నం వెళ్లిన కూలీలపై కరోనా ప్రభావం పడింది. పనులు దొరక్క.. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో చేసేది లేక ఇంటిబాట పట్టారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా ఎటపాక మండలం చిమ్మలవాగు గ్రామానికి చెందిన మిడియం పొదయ్య, కురం మల్లేష్, మడకం రమేష్, పద్దం సోమయ్య, పద్దం దుర్గయ్య, ఉంగయ్య, దేవయ్య, చుక్కలు రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బయలుదేరారు. శనివారం మధ్యాహ్నం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దండుమిట్ట తండాకు చేరుకున్నారు. సుమారు 260 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణం చేశామని, ఇంకా 90 కిలోమీటర్లు నడవాల్సి ఉందని వారు తెలిపారు. కాగా, అధికారులు వారిని ప్రత్యేక వాహనంలో సొంతూరుకు పంపించారు.

\- జూలూరుపాడు, ( కొత్తగూడెం జిల్లా)

వూహాన్ చైనా..



మన్‌హట్టన్ బీచ్ అమెరికా..



# చైనా అలా.. ప్రపంచమంతా ఇలా..

ఇక్కడ చూశారా.. అన్ని ఫొటోలకు ఈ పక్క ఫొటో(ఎడమ)కు తేడా ఉంది గమనించారా.. ఇక్కడ వాహనాలు బేషుగ్గా తిరుగుతుండగా.. మిగతా అన్నిటిలోనూ కర్ఫ్యూలాంటి వాతావరణం కనిపిస్తోంది. ఈ వాహనాలు తిరుగుతున్న చిత్రం చైనాలోని వూహాన్‌ది.. ఇప్పుడు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్(కోవిడ్–19) కేంద్ర స్థానమిది.. రెండు నెలల లాక్‌డౌన్ తర్వాత నిబంధనలను సడలించడంతో అక్కడ వాహనాలు తిరుగుతుండగా.. మిగతా ప్రపంచమంతా కరోనా భయంతో పూర్తిగా లాక్‌డౌన్‌లో ఉన్నాయి.. శనివారం ఆయాదేశాల్లోని పరిస్థితిని తెలియజేసే చిత్రమాలిక ఇదీ..

గోల్డెన్ గేట్ బ్రిడ్జి కాలిఫోర్నియా..



మెక్సికో సిటీ మెక్సికో..



ఫ్లోరిడా యూఎస్



జకార్తా ఇండోనేసియా



రోమ్ ఇటలీ



మయామి యూఎస్



షేక్ జాయేద్ రోడ్ దుబాయ్..



శాంటియాగో చిలీ



బ్యాంక్‌నాక్ స్కాట్లాండ్




# 'క్వారంటైన్' ఇళ్లకు జియో ట్యాగింగ్

- టీఎస్ కాప్ యాప్‌లో ప్రత్యేక లింక్ ఏర్పాటు
- గస్తీ సిబ్బంది నిత్యం పరిశీలించేలా ఆదేశాలు
- నిర్ణీత ప్రాంతం దాటి బయటకు వస్తే అలర్ట్స్

సాక్షి, హైదరాబాద్:

విదేశాల నుంచి వచ్చిన వారి నుంచే కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో వారిని హోమ్ క్వారంటైన్ చేశారు. అలాంటి వారికి విమానాశ్రయాల్లోనే స్టాంపింగ్ చేస్తున్నారు. నిర్ణీత గడువు ముగిసే వరకు ఇళ్లు దాటి బయటకు రావద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా కొందరు విదేశీ ప్రయాణాలు చేసి వచ్చిన వారు నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నారని పోలీసులకు సమాచారం అందుతోంది. దీనికి సంబంధించి కొన్ని ఉదాహరణలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే హోమ్ క్వారంటైన్‌లో ఉన్న వారిపై పటిష్ట నిఘా కోసం సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నారు. దీని కోసం తెలంగాణ పోలీసు అధికారిక యాప్ టీఎస్ కాప్‌లో హోమ్ క్వారంటైన్‌లో ఉన్న వారిని జియో ట్యాగ్ చేయడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఇప్పటికే విదేశాలకు వెళ్లివచ్చిన వారి వివరాలను పోలీసు విభాగం వివిధ మార్గాల్లో సేకరించింది. ఈ జాబితాను స్టేషన్‌ల వారీగా క్షేత్ర స్థాయి అధికారులకు అందించింది. ఈ జాబితాల్లోని వివరాల ఆధారంగా వారి ఇళ్లకు వెళ్తున్న గస్తీ సిబ్బంది చిరునామాలను సరిచూస్తున్నారు. ఆపై ఆ ఇంటిని అక్షాంశం, రేఖాంశాల ఆధారంగా జియో ట్యాగింగ్ చేస్తున్నారు. క్వారంటైన్ అయిన వ్యక్తి ఫోన్ నంబర్‌ను దీనికి అనుసంధానిస్తున్నారు.



### 22 వేల మంది వివరాలు...

శనివారం నాటికి ఇలా మొత్తం 22 వేల మంది వివరాలను జియో ట్యాగింగ్ ద్వారా టీఎస్ కాప్ యాప్‌లోని లింక్‌లో పొందుపరిచారు. ఫలితంగా ప్రతి గస్తీ సిబ్బంది, ఆకస్మికంగా తనిఖీ చేసే అధికారులు అనునిత్యం ఆ ఇళ్లను, క్వారంటైన్ అయిన వ్యక్తుల్ని పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. ఇలా క్వారంటైన్ అయిన వ్యక్తుల కదలికల్ని పోలీసు విభాగం నిరంతరం పర్యవేక్షిస్తోంది. వీరిలో ఎవరైనా తమ ఇంటిని దాటి గరిష్టంగా 50 మీటర్లు వెళితే ఆ విషయాన్ని జియో ట్యాగింగ్ ద్వారా పోలీసు విభాగం తక్షణం గుర్తిస్తుంది. క్వారంటైన్ అయిన వ్యక్తి పరిధి దాటిన విషయం పోలీసులకు టీఎస్ కాప్ యాప్ ద్వారా కంట్రోల్ రూమ్ సిబ్బందికి తెలుస్తుంది. అక్కడి వారు క్షేత్రస్థాయి అధికారులకు దీనిపై సమాచారం ఇవ్వడం ద్వారా అప్రమత్తం చేస్తారు. ఆ అధికారులు గస్తీ టీమ్ సహకారంతో కొన్ని నిమిషాల్లోనే బయటకు వచ్చిన క్వారంటైన్ వ్యక్తిని గుర్తించి, ఆ ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకుంటారు. వీరిపై ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు.

# కరోనా అనుమానితుల తరలింపునకు ఆర్టీసీ

**సాక్షి, హైదరాబాద్:** నగరంలో క్రమంగా కరోనా వైరస్ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో అవసరమైతే వారిని క్వారంటైన్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా నగరంలో ప్రతి డిపోలో ఐదు చొప్పున బస్సులను సిద్ధం చేసింది. ఈమేరకు ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గత కొన్ని రోజులుగా నగరంలో వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. బాధితుల్లో కొంతమంది విదేశాల నుంచి వచ్చిన వారు ఉండగా మరికొంతమంది వారి ద్వారా సోకినవారు ఉంటున్నారు. దీంతో స్థానికంగా కూడా వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతోందని స్పష్టమైంది. కోవిడ్ వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినవారు అప్పటికే స్థానికంగా సంచరించి ఉండటంతో వారి ద్వారా ఎవరెవరికి వైరస్ సోకనుందనేది తెలియని పరిస్థితి. వారు ఎంతమందితో కాంటాక్ట్ అయ్యారనే వివరాలు సేకరించి, వారందర్నీ క్వారంటైన్ కేంద్రాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఒక్కో రోజు ఏకంగా పది మంది వరకు వైరస్ పాజిటివ్‌గా తేలుతున్నారు. ఫలితంగా వారు కాంటాక్ట్ అయిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. అంతమందిని క్వారంటైన్ కేంద్రాలకు తరలించాలంటే పెద్ద సంఖ్యలో వాహనాల అవసరం ఏర్పడుతోంది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే వచ్చే వారం పది రోజుల్లో ఇలా క్వారంటైన్ కేంద్రాలకు తరలించేవారి సంఖ్య భారీగానే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందు జాగ్రత్తచర్యగా ఆర్టీసీ డిపోలకు సరిపడా డ్రైవర్లు, కండక్టర్లను కూడా పిలిపించి సిద్ధంగా ఉంచుతున్నారు. ఒక్కో షిఫ్ట్‌లో పది మంది చొప్పున మూడు షిఫ్టులకు కలిపి ఒక్కో డిపోలో రోజుకు 30 మంది చొప్పున డ్రైవర్లు, మరో ఐదుగురు కండక్టర్లను పిలిపిస్తున్నారు. వీరికి ప్రత్యేకంగా పాసులను కూడా జారీ చేశారు. రొటేషన్ పద్ధతిలో ఈ డ్రైవర్లు విధులకు హాజరవుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.